

నాగపూర్: ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బొమ్మలతో ఉన్న పతంగులను విక్రయిస్తున్న ఓ దుకాణాదారుడు

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com Journalism first!

సంపుటి: 60 • సంచిక: 365 • మంగళవారం 9 జనవరి 2018 • విజయవాడ ✻ పేజీలు: 14 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, తిథి: బహుళ అష్టమి రా. 8.4 వరకు, అనంతరం నవమి; నక్షత్రం: హస్త ఉ. 6.45 వరకు, అనంతరం చిత్త; అమృతకాలం: రా. 1.00 నుండి 2.40 వరకు; వర్జ్యం: మ. 2.55 నుండి 4.34 వరకు, దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, తదుపరి రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు

ప్రకృతి వనరులతో సంపద సృష్టిస్తా

పటిష్ట ప్రణాళికలు సిద్ధం

• నీటి వనరుల సద్వినియోగం • ప్రాజెక్టులపై రూ.50 వేల కోట్ల వ్యయం • యుద్ధ ప్రాతిపదికన 29 ప్రాజెక్టులు • సౌర విద్యుత్‌తో నూతన శకం • ఉమ్మడి కుటుంబాలకు త్వరలో పథకం • పశ్చిమగోదావరి జిల్లా జన్మభూమిలో ముఖ్యమంత్రి చంద్రబాబు




కొవ్వూరు (పశ్చిమగోదావరి), ప్రభ న్యూస్ : ప్రకృతి వనరుల్ని సమర్థ వంతంగా వినియోగించుకోవడం ద్వారా సంపదను సృష్టిస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సోమవారం ఆయన పశ్చిమ గోదావరి జిల్లా తాళ్ళపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలో జన్మభూమి గ్రామ సభలో పాల్గొన్నారు. రాష్ట్రంలో గాలి, నీరు, సూర్యరశ్మి వినియోగించి, సంపద సృష్టించేందుకు పటిష్ట ప్రణాళికలు రూపొందించామన్నారు. నీటి వనరుల్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో ముందడుగేస్తామన్నారు. నీటి వనరులు సముద్రంలోకి పోకుండా నిరోధించే ప్రాజెక్టుల నిర్మాణానికి రూప కల్పన చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఇంతవరకు 50వేల కోట్లు సేద్యపు నీటి ప్రాజెక్టులపై వ్యయం చేశామన్నారు. ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల్తో పాటు తాను ముఖ్యమంత్రిగా ప్రారంభించిన ప్రాజెక్టుల్ని శర వేగంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. 29 ప్రాజెక్టుల్ని యుద్ధ ప్రాతి పదికన నిర్మిస్తున్నామన్నారు. ప్రకృతి ప్రాధాన్యతను ఆయన వివరించారు. అలాగే ప్రకృతి పట్ల కృతజ్ఞతతో వ్యవహరించాలన్నారు. ప్రకృతిని నిత్యం ఆరాధించడం ద్వారానే అందులోని సంపదను మనం పొంద గలుగుతామన్నారు. నీరు బంగారంతో సమానమని చంద్రబాబు చెప్పారు. నీరు లేకుంటే అభివృద్ధి లేదన్నారు. అందుకే జలసిరికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా జలసిరికి హారతి కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. తద్వారా మన సంస్కృతిని ప్రపంచానికి చాటిచెబుతామన్నారు. ఈ హారతితో నీటి పవిత్రతను అందరికీ తెలియజేస్తామని చంద్రబాబు ➪ 2వ పేజీలో...



ఐదు విడతల్లో నదుల అనుసంధానం

• వంశధార నుంచి పెన్నా వరకూ మహాసంగమం • అదనంగా 40 లక్షల ఎకరాలకు సాగునీరు • పోలవరం పనుల్ని పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు • 196 టీఎంసీల నిల్వ సాధ్యం • అగ్రిగేట్ కూలింగ్ ప్లాంట్ ప్రారంభం • కాఫర్‌డ్యామ్ పనులకు పూజలు

ఏలూరు, ప్రభ న్యూస్: శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు గల నదుల అను సంధానాన్ని ఐదు విడతల్లో పూర్తి చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణ పెన్నా నదుల్ని ఒకదానికొకటి అను సంధానించి ఓ మహా సంగమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అనుసంధానంతో రాష్ట్రంలో 40.26లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరందు బాటులోకొస్తుందన్నారు. 196 టీఎమ్‌సీల నీటిని నిల్వ చేసుకోగలుగు తామన్నారు. తద్వారా సముద్రంలో వృథాగా కలుస్తున్న నదీ జలాల్లో కొన్నింటినైనా రాష్ట్ర అవసరాలకు మళ్ళించుకునే వీలేర్పడుతుందన్నారు. రాష్ట్రం పాడిపండల్తో, పచ్చని పల్లెసీమల్తో కళకళ్ళాడుతోందన్నారు. సోమవారం ఆయన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించారు. అగ్రిగేట్ కూలింగ్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ➪ 2వ పేజీలో...



ప్రకృతి సేద్యంతో మెట్టలోనూ వరి

• ఎకరానికి 120 క్వింటాళ్ల దిగుబడి: పాలేకర్

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రకృతి సేద్యంతో మాగాణి భూములతో పాటు మెట్ట భూముల్లో కూడా వరి సాగును చేపట్టి అధిక దిగుబడులను పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ సుభాష్ పాలేకర్ తెలియజేశారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా గల బైబిల్ మిషన్ మైదానంలో గత తొమ్మిది రోజులుగా ప్రకృతి వ్యవసాయంపై రాష్ట్రరైతాంగానికి ఇస్తున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో సోమవారం ఆయన పలు ఆసక్తికరమైన ➪ 8వ పేజీలో...

సెట్‌లన్నీ ఆన్‌లైన్‌లో

• ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల
• ఏప్రిల్ 22న ఎంసెట్ ఇంజనీరింగ్
• కట్టుదిట్టంగా నిర్వహిస్తాం



• ఎంసెట్‌కు 150 పరీక్షా కేంద్రాలు
• వారంలోపే ఫలితాలు: మంత్రి గంటా
• విశాఖలో నైపుణ్యాభివృద్ధి వర్శిటీ

అమరావతి, ఆంధ్రప్రభ : ఈ విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. గత ఏడాది కంటే ఈసారి ముందుగానే ప్రవేశ పరీక్షల షెడ్యూల్ తేదీలను విడుదల చేశామన్నారు. రూరల్ ఏరియా విద్యార్థులకు మాక్ టెస్ట్‌ల నిమిత్తం సీడీలను కూడా అందుబాటులో ఉంచామన్నారు. అంతేకాకుండా ఈసారి అన్ని ప్రవేశ పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున ఫలితాలను కూడా వారంలోపే ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రధానంగా ఎంసెట్ విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. కాకినాడ జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎంసెట్‌కు ఆంధ్రప్రదేశ్‌లో 115 నుంచి 150 ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఎంసెట్‌కు గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 1,36,790 మంది విద్యార్థులు హాజరయ్యారని, అయితే 84,478 సీట్లు భర్తీ అయ్యాయని, దాదాపు 52,312 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. గతేడాది ఏపీ ఎడ్‌సెట్‌ను ఏప్రిల్ 19న నిర్వహించామన్నారు. ఆ సందర్భంగా 8,785 మంది అభ్యర్థులు రిజిష్టర్ చేసుకుంటే 7010 మంది ➪ 8వ పేజీలో...

1,385 అధ్యాపక పోస్టుల భర్తీ: గంటా 8 లో



రైల్వేపై డ్రోన్ కన్ను!

• భద్రత, ట్రాక్‌ల నిర్వహణకు కొత్త ఆలోచన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రైళ్ల నిర్వహణ, పనితీరు మెరుగుపర్చేందుకు రైల్వే శాఖ కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టింది. రైళ్ల భద్రత, సమర్థతను పెంచేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగించాలని నిర్ణయించింది. దీనితో రైల్వే ప్రాజెక్టుల పర్యవేక్షణ, ట్రాక్ మెయింటెనెన్స్ , మౌలిక సదుపాయాల పరిస్థితిని ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశముంది. ఫలితంగా రైల్వే శాఖ పనితీరులో గణనీయమైన మార్పు వస్తుందని ఆశిస్తోంది. తొలిదశలో వెస్ట్ సెంట్రల్ రైల్వేలో దీనిని అమలు చేస్తున్నారు. రైల్వే శాఖ ➪ 8వ పేజీలో...



బెంగళూరు బార్‌లో అగ్ని ప్రమాదం

• ఐదుగురి సజీవదహనం 5 లో



గంగవరం పోర్టు చీఫ్ సెక్యూరిటీ అధికారిగా నండూరి సాంబశివరావు

3 లో



దుర్గగుడిలో భద్రతేదీ?

• బయటి వ్యక్తులను నిలువరించని ఎస్పీఎఫ్ సిబ్బంది • ప్రవేశించినా పట్టించుకోని ఔటుపోస్టు అధికారులు • విచారణకు ఎస్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశం



అమరావతి, ఆంధ్రప్రభ: శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో తాంత్రిక పూజల వ్యవహారంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో భద్రతాపరమైన చర్యలు వివాదాస్పదమవుతున్నాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) సాయుధ పహారా మధ్య ఉన్న దేవాలయంలోకి అనుమతి లేకుండా ఇతరులు ఎలా ప్రవేశించారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. గతంలో పేరుమోసిన గజదొంగ ప్రకాష్ సాహూ అమ్మవారి కిరీటం, నగలు చోరీ చేసిన నేపథ్యంలో ఈ తరహా భద్రత ఉంటే జరిగే పరిణామాలకు ఎవరు బాధ్యత వహిస్తారనేది భక్తుల ఆందోళన. పోలీసులు, భద్రతా ➪ 8వ పేజీలో...

కృశిస్తున్న సబల!

• పథకంలో కేంద్రం కుదింపు • 2.6 లక్షల మంది బాలికలకు పౌష్టికాహారం దూరం • 15-18 ఏళ్ల బాలికలకు నిలిపివేత



అమరావతి, ఆంధ్రప్రభ: దేశవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన రక్తహీనతను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కిషోర బాలిక సంరక్షణ పథకం కింద 'సబల' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. రక్తహీనత, పౌష్టికాహార సమస్యను అధిగమించాలనే లక్ష్యంతో 2011లో దేశవ్యాప్తంగా సుమారు కోటి మంది బాలికలకు కిషోర బాలిక పథకంలో భాగంగా 'సబల' కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. అయితే ఎందరో బాలబాలికలకు వర ప్రదాయినిగా మారిన ఈ పథకానికి కోత పెడుతూ కేంద్రం అనూహ్యమైన నిర్ణయం తీసుకుంది. ఈ పథకం వల్ల ఇప్పటి వరకు రాష్ట్రంలో 11 నుంచి 14 సంవత్సరాల వయసున్న 14 వేల మందికి, 15 నుంచి 18 ఏళ్ల మధ్య 2.68 లక్షల మందికి ప్రయోజనం పొందుతున్నారు. వీరందరికీ నెలలో 25 రోజులకు 3 కేజీల బియ్యం, అరకేజీ కందిపప్పు, 16 కోడిగుడ్లు, ➪ 8వ పేజీలో...

ప్రకృతి వనరులతో సంపద సృష్టిస్తా

(మొదటిపేజీ తరువాయి)
మన్నారు. విదేశీయుడైనప్పటికీ కాటన్ మహాశయుడు ఆనకట్ట నిర్మించబట్టే గోదావరి జిల్లాలు ఇప్పుడు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయన్నారు. కాటన్ మహాశయుడ్ని మన పెద్దల్తో సమానంగా పూజిస్తున్నామని చెప్పారు.

కార్తీకంలో వనమహోత్సవం

ప్రజల ఆరోగ్యానికి, ఆహ్లాదానికి చెట్లు ఎంతో అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి చెట్టు ప్రాణంతో సమానమన్నారు. చెట్లు విషవాయువుల్ని స్వీకరించి మనకు ఆక్సిజన్ ఇస్తాయన్నారు. దీనివల్ల ఆరోగ్యం మెరుగౌతుందన్నారు. అందుకే ప్రతి కార్తికంలో వనమహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. తద్వారా రాష్ట్రాన్ని పచ్చదనంతో నింపుతామన్నారు. చెట్లను పూజించడం భారత సంస్కృతిలో భాగంగా చెప్పారు. చెట్ల ద్వారా కాలుష్య నివారణ జరుగుతుందన్నారు. ప్రతి ఇంటి ముందు చెట్లు నాటడంతో పాటు దాన్ని పూజించాలన్నారు.

త్వరలోనే సూర్యారాధన

ఈ నెల్లోనే సూర్యారాధన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చంద్రబాబు చెప్పారు. ఇది సూర్య భగవానుడ్ని ఆరాధించే కార్యక్రమంగా చెప్పారు. అందరి ఆరోగ్యానికి సూర్యుడి శక్తి అవసరమన్నారు. సూర్యారాధనతో మన సంస్కృతిని ప్రతిబింబిస్తామన్నారు. అలాగే సూర్యరశ్మి నుంచి సౌరవిద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామన్నారు. గతంలో యూనిట్ విద్యుత్‌ను 14రూపాయలకు కొనుగోలు చేసేవారమన్నారు. కాగా ఇప్పుడు సౌర విద్యుత్ కారణంగా యూనిట్ 3రూపాయలకే లభిస్తోందన్నారు. సౌర విద్యుత్‌తో రాష్ట్రంలో నూతన శకానికి నాంది పలుకుతామన్నారు. 1999లో తాను ముఖ్యమంత్రిగా విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చానన్నారు. నీరు, బొగ్గు, గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు అమలు చేశామన్నారు. ప్రస్తుతం రెండో విడత విద్యుత్ సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. తద్వారా భవిష్యత్‌లో విద్యుత్ ధరలు పెరిగే అవకాశముండదని చెప్పారు.

విత్తన హబ్‌గా ఏపీ

రాష్ట్రాన్ని విత్తన కేంద్రంగా రూపు దిద్దుతామని చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటికే కర్నూల్‌లో ఇందుకుతగ్గ ప్రాజెక్టును ప్రారంభించామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో కూడా సంబంధిత ప్రాజెక్టును ఏర్పాటు చేస్తామన్నారు. విత్తన హబ్‌గా రూపుదిద్దడం ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచానికే ఆదర్శనీయంగా మారుస్తామన్నారు.

పాపప్రక్షాళనకే పాదయాత్రలు

ఇదే సందర్భంగా ముఖ్యమంత్రి విపక్షాలపై మండిపడ్డారు. పాపప్రక్షాళనకే పాదయాత్రలు నిర్వహిస్తున్నారన్నారు. పోలవరంపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. అడ్డుకునేందుకు అన్నిరకాలుగా ప్రయత్నాలు చేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో పదేళ్ళ పాటు పోలవరం ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. వారి హయాంలో విద్యుత్‌లేక వ్యవసాయంతో పాటు పారిశ్రామికరంగం కుదేలైందన్నారు. పలువురు పారిశ్రామికవేత్తలు దివాళా తీశారన్నారు. కరెంట్‌లేక పంటలు పండక రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఉద్యమ స్ఫూర్తితో విద్యుత్‌రంగంలో నూతన సంస్కరణల్తో ముందుకు నడిపిస్తున్నామన్నారు. సమైఖ్యాంధ్రా ఉద్యమంలో రైతుల కష్టాల్ని చూసి ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ అమలుచేస్తున్నామన్నారు. ఇది దేశంలోనే ప్రప్రథమంగా చెప్పారు. ఆర్‌బిఐ అడ్డుపడ్డా.. కొందరు సహకరించక పోయినా ఈ విషయంలో తన నిర్ణయం మారదని తేల్చిచెప్పారు.

చలించిపోయిన చంద్రబాబు



గ్రామసభలో కండవిల్లి లక్ష్మి అనే 7వ తరగతి విద్యార్థిని జిల్లా ప్రగతిపై తాను రాసిన పాట పాడివినిపించింది. వెంటనే చంద్రబాబు ఆమెను దగ్గరకు తీసుకుని వివరాలడిగారు. తల్లిదండ్రులు ఏం చేస్తారంటూ ప్రశ్నించారు. అయితే తనకు తల్లిదండ్రులు లేరని చెప్పడంతో చంద్రబాబు చలించిపోయారు. ఎవరు పెంచుతున్నారంటూ ఆరాతీశారు. వృద్ధులైన నాయనమ్మ, తాతయ్యలే తనను, తన తమ్ముడ్ని సాకుతున్నట్లు లక్ష్మి వెల్లడించింది. వారికున్న ఆస్తులపై వివరాలడిగారు. దమ్మిడికూడా లేదని, కేవలం ప్రభుత్వమిస్తున్న పింఛన్‌పైనే వారు బతుకుతూ తమను చదివిస్తున్నారంటూ బాలిక చెప్పడంతో చంద్రబాబు మరింత విచలిత మనస్కుడయ్యారు. అప్పటికప్పుడు లక్ష్మితోపాటు ఆమె సోదరుడి పేరిట చెరో 50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలంటూ కలెక్టర్‌ను ఆదేశించారు. భవిష్యత్‌లో ఏం కావాలని కోరుకుంటున్నావంటూ చంద్రబాబు లక్ష్మిని ప్రశ్నించారు. టీచర్ కావాలన్న ఆమె ఆకాంక్ష విని మరింత ముగ్దులయ్యారు. లక్ష్మి, ఆమె తమ్ముడు చదువుకయ్యే మొత్తం వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందంటూ చంద్రబాబు ప్రకటించారు.

ఉమ్మడి కుటుంబాల కోసం పథకం

త్వరలోనే ఉమ్మడి కుటుంబాల కోసం తానో పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు చంద్రబాబు చెప్పారు. ఇటీవల కాలంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్చిన్న మౌతోందన్నారు. వివాహాలు కాగానే వేరు కుటుంబాలు పెరిగాయన్నారు. ఉమ్మడి కుటుంబాల కాలంలో పరస్పర అవగాహన ఉండేదన్నారు. నేరప్రవృతి కనిపించేదికాదన్నారు. తిరిగి ఉమ్మడి కుటుంబాల్ని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకతను చంద్రబాబు నొక్కి చెప్పారు.

ఐదు విడతల్లో నదుల అనుసంధానం

(మొదటిపేజీ తరువాయి)
ఎగువ కాఫర్ డ్యామ్, జెట్ గ్రౌటింగ్ పనులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా పోలవరం నిర్మాణ పర్యవేక్షక ఇంజనీర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. స్పిల్‌వే, ఎగువ కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్, గేట్ల తయారీ పనుల్ని పరిశీలించారు. వాటి వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే కొద్దిసేపు మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్ట్‌ను వ్యక్తిగతంగా పరిశీలించి సమీక్షించడం ఇది 22వ సారని వెల్లడించారు. కొత్తగా అందుబాటులో కొచ్చిన అగ్రిగేటర్ కూలింగ్ ప్లాంట్ వల్ల రోజూ 5వేల క్యూబిక్ మీటర్లకు పైబడ్డ కాంక్రీట్ పనుల్ని చేసే వీలేర్పడుతుందన్నారు. ఈ ప్లాంట్ వల్ల స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పనులు పుంజుకుంటాయన్నారు. డయాఫ్రమ్ వాల్ పనుల్ని నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తిచేయగలుగుతామన్నారు. ఇప్పటికే 29సాగునీటి ప్రాజెక్టుల్ని ప్రారంభించగా 9 ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేశామన్నారు. మూడ్నాలుగు మాసాల్లోనే మరో 8 ప్రాజెక్టులు పూర్తవుతాయన్నారు.



విలేకరులతో సీఎం చంద్రబాబునాయుడు

పెరుగుతున్న భూగర్భ జలమట్టం

ఇప్పటికేప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా భూగర్భ జలమట్టం అనూహ్యంగా పెరుగుతోందన్నారు. పట్టిసీమ నుంచికృష్ణా డెల్టా ఆయకట్టుకు 105టిఎంసిల నీటిని తెచ్చామన్నారు. సాగర్ నుంచి 140టిఎంసిలను రాయలసీమకు మళ్ళిస్తున్నామన్నారు. పైగా ఏడు లక్షల నీటి కుంటలు ఏర్పాటు చేశామన్నారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భ జలమట్టం పెరిగేందుకు దోహదపడిందన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌పై ఇంత వరకు 16వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని కేంద్రానికి సమర్పించామన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్ని త్వరలోనే రాబడతామన్నారు. ఇందుకు సంబందించి చర్చలు జరుగుతున్నా యన్నారు. ఎవరెన్ని అడ్డతులు సృష్టించిన పోలవరాన్ని సకాలంలో పూర్తిచేస్తామన్నారు. కొందరు సృష్టిస్తున్న రాజకీయాల వల్లే పనుల్లో కొద్దిపాటి ఆటంకం ఏర్పడుతోందన్నారు. అలాంటి శక్తుల్ని, వ్యక్తుల్ని నిరోధించాల్సిన ఆవశ్యకతుం దని ఆయన పిలుపు నిచ్చారు. అలాంటివారికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ విషయంలో తానెలాంటి వ్యాఖ్యలు చేయబోనన్నారు.

నిబద్ధతతో తాను ఏడు ముంపు మండలాల్ని ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సాధించడం వల్లే ఇప్పుడీ ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. లేనిపక్షంలో జాతీయ హోదా లభించినా నిర్మాణ ప్రగతి కుంటుపడుండేదన్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పితాని సత్యనారాయణ, ఇరిగేషన్ సెక్రటరీ శశిభూషణ్, ఎమ్‌పిలు తోట సీతా రామలక్ష్మి, మాగంటి బాబు, కలెక్టర్ కాటంనేని భాస్కర్, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పాలి ప్రసాద్, ఎమ్మెల్యే శ్రీనివాసరావు, డిసిసిబి చైర్మన్ ముత్యాల రత్నం, తదితరులున్నారు.

2013 చట్టం మేరకే పరిహారం

భూములు కోల్పోయిన నిర్వాసితుల్ని అన్ని విధాలా ఆదుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. 2013 భూసేకరణ చట్టం మేరకు నష్టపరిహారాన్ని అందిస్తామన్నారు. నిర్వాసితులు ఈ విషయంలో ఎలాంటి అపోహలకు గురికావొద్దని సూచించారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

సాంకేతిక అనుమతులు పూర్తి

ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అనుమతులన్నీ పూర్తయ్యా యని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇక ఢిల్లీలోని సాంకేతిక విభాగంతో చర్చించి డిజైన్ అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ పనుల్ని కూడా ప్రారంభిస్తామన్నారు. రాక్ ఫిల్ డ్యామ్‌కు సంబంధించి 4.90లక్షల క్యూబిక్ మీటర్ల పని పూర్తయిందన్నారు. మరో 2.3కిలోమీటర్ల పనుల్ని నిర్దిష్ట గడువులోగా పూర్తిచేస్తామన్నారు. కాంక్రీట్ వాల్ పని 4.79లక్షల క్యూబిక్ మీటర్లు జరిగిందన్నారు. యుద్ధ ప్రాతిపదికన 42గేట్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నామన్నారు. వీటి బరువు 4వేల టన్నులుంటుందన్నారు. నిర్దిష్టసమయంలోనే ఈ గేట్లను అమరుస్తామన్నారు.

2019లోపు మూడు లక్షల మందికి ఉద్యోగాలు

- ప్రతి పేదవాడికి ఇళ్లు కట్టివ్వాలన్నదే మా లక్ష్యం
- నెల్లూరుకు ఎలక్ట్రానిక్ తయారీ కంపెనీలు తెస్తా
- నెల్లూరు జిల్లా పర్యటనలో మంత్రి లోకేష్



నెల్లూరు, ప్రభ న్యూస్ బ్యూరో: రాష్ట్రాన్ని పారిశ్రామికరంగంగా అభివృద్ధి చేయడంతో పాటు 2019 లోపు ఐటీరంగంలో లక్ష, ఎలక్ట్రానిక్ రంగంలో 2 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, ఐటీ శాఖామంత్రి నారా లోకేష్ అన్నారు. సోమవారం ఆయన జన్మభూమి కార్యక్రమంతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు వచ్చారు. మధ్యాహ్నం 12.20 గంటలకు నెల్లూరు చేరుకున్న ఆయనకు రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నెల్లూరు జనార్ధన్‌రెడ్డి కాలనీలో ఎన్‌టీఆర్ అర్బన్ హౌసింగ్ పథకం క్రింద నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి సభలో లోకేష్ వారిని ఉద్దేశించి సుదీర్ఘంగా ప్రశంగించారు. ఇల్లు కట్టాలంటే ఎంత కష్టమో తనకు తెలుసన్నారు. గతంలో తాను సొంతిల్లు నిర్మించుకునేప్పుడు ఆ కష్టాన్ని స్వయంగా చవిచూశానన్నారు. అయితే ప్రతి పేదవాడికి సొంతింటి స్వప్నం నెరవేర్చాలన్న పట్టుదలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాణ్యమైన ఇళ్లను నిర్మించి ఇవ్వబోతున్నారన్నారు. షీర్‌వాల్ టెక్నాలజీతో అద్భుతంగా నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి మొదటి దశ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయని వీలైనంత త్వరలోనే సంబంధిత లబ్దిదారులకు ఇళ్లను అందిస్తామన్నారు. ఒకేచోట 5 వేల ఇళ్లు నిర్మించడం చిన్నవిషయం కాదని ఈ ప్రాంతంలో 20 వేలమంది ప్రజలు జీవనం సాగించబోతున్నారని వాటిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతంలో అన్ని మౌళిక వసతులు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటిదశ ఎన్‌టీఆర్ అర్బన్ హౌసింగ్ పథకం క్రింద 6.80 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. అందుకోసం సుమారు రూ. 38 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. పేదలకు తక్కువ ఖర్చుతో వీలైనంత ఎక్కువ సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో సీఎం సింగపూర్, మలేషియా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో పర్యటిస్తుంటే కొంతమంది నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. అటువంటి వారు ఒక్కసారి ఈ ఇళ్లను పరిశీలిస్తే ముఖ్యమంత్రి ఎందుకోసం విదేశాలకు వెళుతున్నారో కళ్లకు కట్టినట్లు అర్ధమవుతుందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రతి పేదవాడికి అభివృద్ధి ఫలాలను అందించాలన్న పట్టుదలతో ఆయన 67 ఏళ్ల వయసులోనూ 24 ఏళ్ల యువకుడిలా కష్టపడి పనులు చేస్తున్నారన్నారు. ప్రత్యేకించి నెల్లూరు జిల్లాను అన్నిరంగాల్లో ముందుకు నడిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ప్రాంతంలో కృష్ణపట్నం పోర్టు ఉండడం మరింత కలిసొస్తుందన్నారు. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఎలక్ట్రానిక్ తయారీ కంపెనీలను తీసుకొచ్చి ఈ ప్రాంతంలో 2 వేల ఐటీ ఉద్యోగాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆయన లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడారు.

మరో 16 లక్షల మరుగుదొడ్లు నిర్మించబోతున్నాం

గ్రామీణ ప్రాంతాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి మరింత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. కావలి మండలం తుమ్మలపెంటలో జరిగిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు రూ. 3200 కోట్లు ఖర్చుచేసి 26 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించామన్నారు. మరో 16 లక్షలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అలాగే గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు 157 గ్రామాల్లో భూగర్భ డ్రైనేజీని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అలాగే గడిచిన మూడున్నర సంవత్సరాల్లో 14 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు నిర్మించామన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం వేగవంగా జరుగుతున్నాయన్నారు. ఇలా అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడకుండా ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని లోటు బడ్జెట్‌లో కూడా ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారన్నారు. జన్మభూమి కార్యక్రమం నిర్వహించడం వల్ల ఎన్నో సమస్యలు పరిష్కారమవుతున్నాయని ప్రధానంగా పల్లె ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందడానికి ఓ వేదికగా మారిందన్నారు. ప్రత్యేకించి పల్లెల్లో వెలుగు నింపేందుకు 30 లక్షల ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏ ప్రాంతంలోనైనా లైటు వెలగకపోతే తక్షణమే తనకు సమాచారం అందేలా టెక్నాలజీని ఉపయోగిస్తున్నానన్నారు. ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతుంటే కొంతమంది పనికట్టుకుని విమర్శలు చేస్తున్నారన్నారు. అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా నిధులు కేటాయిస్తున్నా ప్రతిపక్షఎమ్మెల్యేలు పసలేని విమర్శలు చేయడం బాధాకరమన్నారు. అనంతరం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పై సమావేశాల్లో ఆయన వెంట రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పాశం సునీల్‌కుమార్, మేయర్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, కావలి మున్సిపల్ ఛైర్‌పర్సన్ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దృష్టికి అమరావతి

- త్వరలో ఢిల్లీలో 12 లేదా 17న అంతర్జాతీయ మీడియా సదస్సు



అమరావతి, ఆంధ్రప్రభ: అమరావతి అభివృద్ధిలో ఆమ్‌స్టర్‌డామ్‌ను మించిపోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అన్ని రంగాల్లో అంతర్జాతీయంగా అత్యాధునిక సౌకర్యాలతో నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌ని అమరావతి మించిపోయే తరుణం రానున్నదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అమరావతిలో ఇటీవల కాలంలో జరుగుతున్న అభివృద్ధికి సంబంధించి జాతీయ, అంతర్జాతీయ మీడియాకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అమరావతి నిర్మాణంలో భాగంగా పెట్టుబడులకు గల అవకాశాలను ప్రపంచమంతటికి తెలియచేసేందుకు గాను రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) జాతీయ మీడియా సంస్థ సహకారంతో ఢిల్లీలో అంతర్జాతీయ మీడియా సదస్సు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నది ముఖ్యమంత్రి యోచనగా ఉంది.

ఈ నెల 12వ తేదీన చంద్రబాబునాయుడు ప్రధాన మంత్రి మోడీని పలు అంశాలపై కలవనున్నారు. ఆ కార్యక్రమం పూర్తయ్యాక అదే రోజు లేదా ఈ నెల 17వ తేదీన సదస్సు నిర్వహించాలని భావిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అమరావతి మీడియా సిటీ అనే అంశంపై జరగనున్న ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యాలను వివరించనున్నారు. మీడియా సిటీలో 2036 నాటికి 60 వేల ఉద్యోగాలు కల్పించడం లక్ష్యంగా మీడియా ఆధారిత ఇంటిగ్రేటెడ్ బిజినెస్ పార్క్ (ఐబీపీ), విఎఫ్ఎక్స్, యానిమేషన్, గేమింగ్ కంపెనీలకు ఆర్థిక ప్రోత్సాహకాలు కల్పించడం, టీవీ, టాలీవుడ్, బాలీవుడ్, లోకాస్ట్‌కంటెంటెలకు అత్యాధునిక టెక్నాలజీతో స్టూడియో ఏర్పాటు వంటి అంశాలను కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. ఇరవై నుంచి ముప్పై ఎకరాలవిస్తీర్ణంలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రపంచం దృష్టికి అమరావతి పేరిట అంతర్జాతీయ మీడియా సదస్సు మంగళవారం ఢిల్లీలో జరగాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల ఈ సదస్సును 12 లేదా 17వ తేదీన నిర్వహిస్తామని, ప్రిన్సిపాల్ సెక్రటరీ అజయ్‌జైన్ సోమవారం సాయంత్రం తెలిపారు.

పారదర్శకతకు పెద్దపీట

- 'రెవెన్యూ'కు సాంకేతిక హంగులు
- ఐటీ రాకతో కొత్త పుంతలు
- బహుముఖ సేవలతో జనంతో మమేకం
- 'ఆంధ్రప్రభ'తో ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి



అమరావతి, ఆంధ్రప్రభ: పాదర్శకతకు పెద్దపీట వేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది. ఫలితంగా ఆధునిక సాంకేతిక హంగులను జోడించడం ద్వారా ఈ శాఖ కొత్త పంథాలో పయనిస్తోంది. రాష్ట్ర విభజన అనంతరం రెవెన్యూ శాఖ ప్రక్షాళనలో భాగంగా వినూత్నతకు ఇతోధిక ప్రాధాన్యం కల్పించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కొన్ని పథకాలకు సైతం శ్రీకారం చుట్టి శీఘ్రగతిన సంస్కరణలను అమలు చేయడంలో సఫలీకృతులయ్యారు. ప్రజలకు అత్యంత చేరువగా వుండే రెవెన్యూ శాఖను బహుముఖ రీతిన ముఖ్యమంత్రి తీర్చిదిద్దాలని కంకణం కట్టుకున్నారు. ప్రజలకు వెసులుబాటు కలిగేవిధంగా పలు చర్యలను రెవెన్యూ సేవలు అందుబాటులోకి వచ్చేందుకు వెసులుబాటు కలిగింది. సేవా సంబంధిత కార్యక్రమాలు, వివిధ కార్యక్రమాలకు భూముల కేటాయింపు వంటి కార్యకలాపాలను సైతం కొనసాగిస్తోంది.

ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో తాజాగా రెవెన్యూ శాఖలో లెక్కకు మిక్కిలి కార్యకలాపాలు అందుబాటులోకి వచ్చాయి. గతంలోకన్నా భిన్నంగా బోగస్ రుణాలను అరికట్టే క్రమంలో ప్రభుత్వం లోన్ చార్జ్ క్రియేషన్ మోడ్యూల్ (ఎల్‌సిసిఎం) విధానానికి శ్రీకారం చుట్టడం విప్లవాత్మకమైన చర్యగా భావిస్తున్నారు. గతేడాదే రికార్డ్ ఆఫ్ రైట్స్ చట్టానికి తాజా పరిస్థితులకు అనుగుణంగా సవరణ చేయడం జరిగింది. మీభూమి పోర్టల్‌ద్వారా భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ కం పిపిబి ను పొందే వీలును కల్పించారు. కేవలం 15 నిమిషాలలోనే మీసేవ ద్వారా టైటిల్ డీడ్‌ను పొందడం , మ్యుటేషన్, వెబ్‌లాండ్ ప్రారంభం, ల్యాండ్ హబ్‌ను ఏర్పాటు చేయడం, సింగిల్‌విండో ద్వారా భూబదలాయింపు, ఆధార్ సీడింగ్, రెండున్నర లక్షల మందికి ఇళ్ళ పట్టాలపంపిణీ, రాష్ట్ర డాటెడ్ ల్యాండ్ చట్ట సవరణ, పరిశ్రమలకు భూముల కేటాయింపు, విద్యార్థులకు వివిధ రకాలైన సర్టిఫికెట్ల పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వ భూముల డేటాను కంప్యూటరీకరణ చేయడం, రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన డేటాను రెవెన్యూ శాఖతో అనుసంధానం చేయడం కూడా ఒక రికార్డుగా భావిస్తున్నారు. గత డిసెంబర్ 16న జరిగిన మంత్రివర్గ సమావేశంలో తొమ్మిది రెవెన్యూ మండలాలను మంజూరు చేయడం జరిగింది. భారత ప్రభుత్వ అప్రూవల్‌తో డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడర్నైజేషన్ ప్రోగ్రాంకి శ్రీకారం చుడుతోంది. నెల్లూరు, వైఎస్సార్ కడప, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం వంటి జిల్లాలను మినహాయిస్తే తొమ్మిది చోట్ల డిజిపిఎస్ మెషిన్లను సమీకరించుకోవడం జరిగింది.

ఉపముఖ్యమంత్రి దిశా నిర్దేశం

ఉప ముఖ్యమంత్రి(రెవెన్యూ) కేఈ కృష్ణమూర్తి నేడు ఇక్కడ 'ఆంధ్రప్రభ'తో మాట్లాడుతూ ముఖ్యమంత్రి విజన్‌తో ప్రజలకు మెరుగైన సేవలు అందించే క్రమంలో టెక్నాలజీని అందిపుచ్చుకోవడమే కాకుండా, దేశంలోనే ఎక్కడా లేని విధంగా కొత్త విధానాలకు అంకురార్పణ జరిగిందని ఆయన వివరించారు. డేటాను అనుసంధానం చేయడం, అన్ని స్థాయిలలో దానిని నిక్షిప్తం చేయడం విశేషమేనని చెప్పారు. రెవెన్యూ శాఖకు ఐ.టి. హంగులతో కొత్త శోభ సంతరించుకుందని ఆయన గుర్తు చేశారు.

యజ్ఞఫలంతో పేదరిక నిర్మూలన

- ప్రపంచంలోనే ఉత్తమ నగరంగా అమరావతి
- మేధస్సుకు టెక్నాలజీని జోడిస్తే తిరుగులేని అభివృద్ధి
- సాఫ్ట్‌వేర్ రంగంలో మనవాళ్లదే కీలకపాత్ర: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రపంచంలోని ఐదు అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా ప్రజారాజధాని అమరావతిని తీర్చిదిద్దాలని సంకల్పించానని, అందుకు అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞ ఫలం తగిన శక్తి సామర్థ్యాలను పెంపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. మంగళగిరిలోని ఎన్ఆర్ఐ వైద్య కళాశాల ప్రాంగణంలో శాంతి కుంజ్, హరిద్వార్ శ్రీ వేద మాత గాయత్రీ ట్రస్టు ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం ముగింపు వేడుకలకు ఆయన సోమవారం ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ట్రస్టు వైస్ ఛాన్సలర్ చిన్మయ్ పాండ్యా, దక్షిణ భారత హెడ్ బ్రాడ్జి మోహన్ గౌడ్‌జీలు వేద మంత్రాలతో, గాయత్రి మంత్రోపదేశంతో ముఖ్యమంత్రిని సత్కరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ గాయత్రీ ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా 42 యజ్ఞాలు జరిగాయని, 43వ యజ్ఞాన్ని జనవరి 5వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు అమరావతి వేదికగా నిర్వహించడం అదృష్టమన్నారు. కొత్తగా ఏర్పడిన నవ్యాంధ్ర అభివృద్ధికి యజ్ఞ, యాగాదుల ఫలం ఎంతో అవసరమని, ఇటువంటి మహాయజ్ఞాల వలన జ్ఞానంతో కూడిన శక్తి సొంతమవుతుందన్నారు. 11 వేల కలశాలు, 24 వేల దీపాలతో జరుగుతున్న గాయత్రీ మహాయజ్ఞం ద్వారా పేదరిక నిర్మూలన జరిగి, రాష్ట్రాభివృద్ధితోపాటు ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా, సంతోషంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పత్తిపాటి పుల్లారావు, ఆనందబాబు, ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్, కలెక్టర్ కోన శశిధర్, అర్బన్ ఎస్పీ విజయరావు, ఎన్ఆర్ఐ వైద్య కళాశాల అప్పారావు, ట్రస్టు నిర్వాహకులు అశ్వనీ సుబ్బారావు, ఏ.వేణుగోపాల్ రెడ్డి, బోజనపల్లి ప్రసాద్, పేర్ల వెంకటేశ్వర్లు, జె.రాఘవయ్య, సీతారం శర్మ, మాజినేని శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి ఆధ్యాత్మిక శోభ

సంక్రాంతి పర్వదినాల సమయంలో నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో గాయత్రీ పరివార్ నిర్వహించిన అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నాలుగు రోజులపాటు జరిగిన యాగాలు, ప్రత్యేక పూజలు, భగవన్నామ సంకీర్తనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలతో భక్తజనం పులకించిపోయింది. పవిత్ర గాయత్రీ మంత్రోచ్చారణతో రాజధాని ప్రాంతంలో భక్తిభావం పరిడమిల్లింది. ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్ శాంతికుంజ్ అఖిల భారత గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో జరిగిన అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞానికి దేశవిదేశాల నుంచి భక్తులు వేలాదిగా హాజరయ్యారు. నాలుగు రోజులపాటు ఉ. యాగాది కార్యక్రమాలు, సా. ధార్మిక, ఆధ్యాత్మిక ప్రసంగాలు, భజనలు, సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రాంగణంలో ఛాయాచిత్ర, పుస్తక ప్రదర్శన, సంస్కార శాలలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పూర్ణాహుతికి వచ్చిన భక్తులకు నిర్వాహ కులు లక్ష తులసి మొక్కలను పంపిణీ చేశారు. ఈ బృహత్తర కార్యక్రమానికి దక్షిణ భారత గాయత్రీ పరివార్ కన్వీనర్ బీసీహెచ్ సుబ్బారావు (అశ్వని) సారథ్యం వహించారు.


ప్రకృతితో మమేకం అయినప్పుడే మెరుగైన జీవనం



ప్రకృతితో మమేకం అయినపుడే మెరుగైన జీవనం సొంతమవుతుందని సీఎం చంద్రబాబు తెలియజేశారు. ప్రకృతిని గౌరవించాలని, కాపాడుకోవాలని, రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి ఏరువాక, నీటి పరిరక్షణకు జలసిరి, గోదావరి, కృష్ణా పుష్కరాల సందర్భంగా నదీమ తల్లులకు పవిత్ర హారతి చేపడుతున్నామని, అలాగే మానవాళి మనుగడకు మూలమైన సూర్య భగవానుడిని స్మరించుకునేందుకు త్వరలో సూర్య ఆరాధన కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. యజ్ఞ యాగాదుల ఫలంతో భారతీయులు సహజసిద్ధమైన జ్ఞానం, శక్తి కలిగి ఉంటారని, దీనితో ప్రపంచ వ్యాప్తంగా వారి మేదస్సును వినియోగిస్తున్నారని చెప్పారు. ఎన్ఆర్ఐలు అమెరికా దేశ ప్రగతికి ఎంతో తోడ్పాటును అందిస్తున్నారని, సాఫ్ట్‌వేర్ రంగంలో మనవాళ్లదే కీలకపాత్ర అని గుర్తు చేశారు. వేద మంత్రాలు, హోమ గుండాల పూజలతో నిర్వహించే యజ్ఞంతో సహనం, జ్ఞానం, శక్తి లభిస్తుందని, ఈ విధంగా లభించే మేదస్సుకు టెక్నాలజీని జోడిస్తే మెరుగైన జీవన ప్రమాణాలతో జీవించవచ్చన్నారు. నవ్యాంధ్ర నూతన రాజధాని అమరావతిలో దక్షిణ భారత కేంద్రాన్ని గాయత్రీ పరివార్ ఏర్పాటు చేయదలిస్తే అందుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తున్నానని హామీ ఇచ్చారు.

సమాజంలో సమూల మార్పుల
పవిత్ర యజ్ఞం జన్మభూమి

• 3 రోజుల్లో 3వ విడత రుణమాఫీ • ఉమ్మడి కుటుంబంపై చైతన్యం తేవాలి • పాడి పరిశ్రమ ద్వారా రాబడి లక్షల కోట్లలో పెరగాలి • నిత్యావసరాల ధరలకు కళ్ళెం వేయండి • 19న జన్మభూమి రాష్ట్రస్థాయి సత్కార సభ • ప్రగతి టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: సమాజంలో సమూల మార్పులు తెచ్చే ఒక పవిత్ర యజ్ఞం జన్మభూమి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఇప్పటి వరకు జరిగిన 7రోజుల గ్రామసభలు ఎంతో విజయ వంతమయ్యాయని, ఇదే స్ఫూర్తితో మిగిలిన మూడు రోజులు పనిచేయాలని అధికార యంత్రాంగాన్ని కోరారు. సమాజంలో సంపద ఎంత ముఖ్యమో సఖ్యత, ఐక్యత కూడా అంతే ముఖ్యమని, ఉమ్మడి కుటుంబంతోనే ఇది సాధ్యమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి కుటుంబ ప్రాధాన్యత, లబ్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మభూమి - మాఊరు, నీరు - ప్రగతి కార్యక్రమాలపై జిల్లాల్లో ఉన్న నివాసం నుండి అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంపై మక్కువ పెంపొందేవిధంగా ఏరువాక వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలకు జలవనరుల ప్రాధాన్యతను వివరించేందుకే జలసిరికి హారతికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రకృతితో మమేకమయ్యేందుకు వనం - మనం, సూర్య ఆరాధన కార్యక్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు సన్ రైజింగ్ స్టేట్‌గా ఉన్న నామకార్థాన్ని సార్థకం చేసేందుకే సోలార్ విద్యుత్ ఉత్పాదనను పెద్ద ఎత్తున చేస్తున్నామన్నారు.

3రోజుల్లో 3వ విడత రుణమాఫీ..

రాష్ట్ర రైతాంగానికి 3రోజుల్లోగా 3వ విడత రుణమాఫీ పూర్తిగా అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఇప్పటి వరకు పంపిణీ చేయగా మిగిలిన రూ. 400 కోట్లను తక్షణమే రైతుల ఖాతాల్లో జమచేయాలని స్పష్టం చేశారు. రబీ సీజన్‌కు పెట్టుబడిగా ఈ నిధులు రైతులకు ఉపయోగపడతాయని అన్నారు. రైతు సాధికార సంస్థకు వచ్చిన ఫిర్యాదులన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రబీ పంటరుణాల పంపిణీ ఇప్పటి వరకు 50శాతమే జరిగిందని, కర్నూలు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో దీనిని మరింత వేగవంతం చేయాలని సూచించారు. అనంతపురం జిల్లాలో కౌలు రైతులకు మరిన్ని రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుబాటులో ఉన్నజలవనరులను సద్వినియోగం చేసుకుని తక్కువ నీటితో ఎక్కువ సేద్యం జరిగేలా చూడాలన్నారు. అంతేకాకుండా అంతర్జాతీయ స్థాయిలో ఉత్పాదకత ఉండాలని ముఖ్యమంత్రి మార్గదర్శకం చేశారు. కిడ్డాపురం ఎత్తిపోతల పథకం ప్రారంభించడం ఒకచరిత్ర అని, బ్రిటిష్ హయాంలో వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించిన ఈ పథకం ప్రస్తుతం 25వేల ఎకరాలకు విస్తరించిందని చెప్పారు.

పాడి పరిశ్రమ ద్వారా రాబడి లక్షల కోట్లలో పెరగాలి..

ప్రస్తుతం రాష్ట్రంలో పాడిపరిశ్రమ ద్వారా రూ. 60వేల కోట్లు రాబడి ఉండని, ఇది 2022 నాటికి రూ. లక్షకోట్లకు పెరిగేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయంగా తలసరి పాలలభ్యత 168 గ్రాములు ఉండగా, మన దేశంలో 352 గ్రాములు ఉందని తెలిపారు. మన రాష్ట్రంలో 522గ్రాములు ఉండడం విశేషమన్నారు. జీవీడీపీలో పాడిపరిశ్రమ వాటా 12శాతం నుండి 20శాతంకు పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డిమాండ్ ఆధారంగా పంటల సాగు చేయాలని, ఉత్పాదకత కూడాఅంతర్జాతీయ స్థాయిలో ఉండాలనే ఆకాంక్షను ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు. పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెరగాలని, ఉద్యాన రంగం ద్వారా ప్రస్తుత రాబడి 18శాతం ఉందని, దీనిని 30శాతానికి పెంపొందించేలా చూడాలని కోరారు.

నిత్యావసరాల ధరలకు కళ్ళెం వేయండి..

ఉల్లి, చింతపండు లాంటి నిత్యావసరాల ధరలకు కళ్ళెం వేయడంతో పాటు దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలని, ధరల పెరుగుదల అంశంపై సమీక్షించి సోమవారం సాయంత్రంలోగా నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌ను ఆదేశించారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా రైతు బజార్లలో అన్ని సరుకులు, నిత్యావసరాలు ప్రజలకు చౌకధరలకు లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు, వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో రైతు బజార్ల వ్యవస్థను ఏర్పాటు చేశామని, దళారీలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. తల్లి, బిడ్డ ఆరోగ్య సమస్యలకు సామూహిక సీమంతాలు, బేబీ షోలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం నివారించాలన్న లక్ష్యంతో అన్న అమృత హస్తం, గిరి గోరు ముద్దల పథకాలకు అంకురార్పణ చేశామన్నారు. ఆహార భద్రత కింద రేషన్ దుకాణాల్లో ఒక్కో వ్యక్తికి ఇచ్చే 4కిలోల బియ్యాన్ని 5కిలోలకు పెంచామని చెప్పారు.

19న జన్మభూమి రాష్ట్రస్థాయి సత్కార సభ

జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులను సన్మానించేందుకు ఈ నెల 19న రాష్ట్ర స్థాయిలో ఒక సత్కార సభను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. మండల, జిల్లా స్థాయిల్లో 11,12 తేదీల్లో సత్కార సభలు జరుగుతాయని తెలిపారు. జన్మభూమి - మా ఊరు ముగింపు సందర్భంగా ఈ నెల 11న తేదిన బ్యాంక్ లింకేజీ రుణాల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని కోరారు. గ్రామసభల్లో వచ్చిన ఫిర్యాదులను శాఖల వారీగా విశ్లేషించి శాఖల వారీగా రానున్న బడ్జెట్లో కేటాయింపులు పెంచాలని సూచించారు. ఇతర ఆర్థికేతర ఫిర్యాదులను తక్షణమే పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సి. కుటుంబరావు, 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ సాంబశివరావు, వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి బి. రాజశేఖర్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రామాంజనేయులు, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు హరిజవహర్‌లాల్, రామ్‌శంకర్ నాయక్, ప్రణాళికా సంఘం ఉన్నతాధికారి సంజయ్ గుప్తా, రియల్ టైమ్ గవర్నెన్స్ సీఈవో బాబు.ఎ, వివిధ జిల్లాల కలెక్టర్లు, జన్మభూమి నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి
పెద్ద ఎత్తున ప్రోత్సాహం

• 13వేల గ్రామాల్లో డిజిటల్ శిక్షణా తరగతులు • జూన్‌లో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు • ప్రకృతి వ్యవసాయ సలహాదారులు పాలేకర్‌తో భేటీలో సీఎం చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పెట్టుబడులు లేని ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సాహం ఇస్తుందని, దీనికి అవసరమైన సంపూర్ణ సహకారం అందించాలని ప్రఖ్యాత ప్రకృతి వ్యవసాయ సలహాదారులు సుభాష్ పాలేకర్‌ను సీఎం చంద్రబాబు నాయుడు కోరారు. దీని కోసం 13వేల గ్రామాల్లో ఫైబర్ నెట్ సాయంతో నెలకో సారి రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం సీఎం చంద్రబాబు నాయుడుతో ప్రముఖ ప్రకృతి వ్యవసాయ సలహాదారుడు సుభాష్ పాలేకర్ సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు గుంటూరులో పాలేకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై వర్క్‌షాప్ విజయ వంతం కావడం పట్ల అభినందనలు తెలిపారు. రానున్న జూన్‌లో పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై జాతీయ, అంతర్జాతీయ సదస్సులు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని, రైతులకు ఈ సేద్యంపై మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని పాలేకర్‌ను సీఎం కోరారు. వ్యవసా యంలో యాంత్రీకరణను విస్తృతంగా వినియోగించు కునేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో విలేజ్‌మాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను వినియోగదారులకు రైతులే నేరుగా విక్రయించుకునేలా చూస్తామన్నారు. రైతులపై ఏమాత్రం పెట్టుబడి భారం లేకుండా నాణ్యమైన, ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులను సాధించాలన్నదే తన సంకల్పమని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమానికి తన వంతు సహాయ సహకారాలు తప్పనిసరిగా అందిస్తానని సుభాష్ పాలేకర్ ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు బ్రాండింగ్ తీసుకురావడంతో పాటు పెద్ద ఎత్తున విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. రైతుబజార్లలో మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఇదేనా పాలనానుభవం?

• టీటీడీ, కాణిపాకం పాలకమండలి ఎక్కడ? • చెరకు రైతుల వెతలు పట్టవా? • అన్నింటా లంచాలే • పాదయాత్రలో ప్రభుత్వంపై జగన్ ధ్వజం



తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: పరిపాలనలో తనకు ఉన్న అనుభవం ఎవరికీ లేదని చెప్పుకునే చంద్రబాబు నాయుడు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన టీటీడీ ధర్మకర్తల మండలి గడువు ముగిసి 8 నెలలైనా భర్తీ చేయలేని దుస్థితిలో ఉన్నారని వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. చిత్తూరు జిల్లాలో జగన్ సోమవారం ప్రజాసంకల్ప పాదయాత్రను ఉదయం నుంచి సాయంత్రం వరకు పూతలపట్టు శాసనసభా నియోజకవర్గ పరిధిలో కొనసాగించారు. సాయంత్రం పూతలపట్టులో చిత్తూరు లోక్‌సభ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి జంగాలపల్లె శ్రీనివాసులు, శాసనసభ్యుడు డాక్టర్ సునీల్‌కుమార్‌ల అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో జగన్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు చిత్తూరు జిల్లాలో తన పరిపాలనానుభవాన్ని సహకార చక్కెర పరిశ్రమలను ఎలా మూయించాలో, తన హెరిటేజ్ కోసం చిత్తూరు డెయిరీని దెబ్బ తీయాలో అనే అంశాలపైనే దృష్టిని సారించినట్టుగా ఉందన్నారు. అటు సహకారచక్కెర ఫ్యాక్టరీలను మూసివేసి ఇటు నల్లబెల్లం తయారీపై నిషేధాలు విధిస్తే చెరకు రైతులు ఎలా జీవించాలని ప్రశ్నించారు. జిల్లాగుండా సాగే జాతీయ రహదారుల్లో వందలాదిమంది ప్రమాదాల్లో మరణిస్తున్నా విస్తృతంగా వైద్యులను నియమించి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను బలోపేతం చేయలేక పోతున్నారన్నారు. చివరకు ప్రపంచ స్థాయి హిందూ క్షేత్రమైన తిరుమల పరిపాలనను చూసే ధర్మకర్తల మండలి పదవీకాలం ముగిసి 8 నెలలు ముగిసినా భర్తీ చేయలేకపోతున్నారని, మరో పవిత్ర పుణ్యక్షేత్రం కాణిపాకం దేవస్థానానికి మూడేళ్లుగా పాలక మండలి లేకపోయినా పట్టించుకోవడం లేదని అంటూ ఇదంతా చంద్రబాబు పరిపాలనానుభవానికి సాక్షాలేనంటూ ఎద్దేవా చేశారు. ఆయన పరిపాలన అలా ఉండగా, పింఛన్లు, రేషన్‌కార్డులు, మరుగు దొడ్లులకు కూడా లంచాలు తీసుకునే జన్మభూమి మాఫియా కమిటీలు జనాన్ని దోచుకుంటున్నాయన్నారు. త్వరలో ధనవంతులకు సామాన్య ప్రజలను మరింత దోచుకోడానికి అవకాశమిచ్చే విలేజ్ మాల్స్ పేర ుతో ముందుకు రానున్నారన్నారు. జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో పోసే పెట్రోలు ధరలకు సరిహద్దుల్లోని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని బంకుల ధరలకు రూ. 5 నుంచి 8 వరకు తేడా కూడా చంద్రబాబు నాయుడు పరిపాలనానుభవానికి ప్రతిరూపాలేనా అని ప్రశ్నించారు. విద్యుత్ పరమైన నియంత్రణ లేకపోవడం వల్ల ఉపాధి అవకాశాలు పెంచే గ్రానైట్ పరిశ్రమ కునారిల్లుతోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని అంశాలను పరిశీలించి అధ్యయనం చేసి సమగ్రంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉదయం కొండారెడ్డిపల్లె క్రాస్‌లో మొదలెట్టిన జగన్ పాదయాత్ర తలుపులపల్లె, తిమ్మిరెడ్డిపలలె, తూటాపు, టి రంగంపేట, పూతలపట్టు, సమనత్తం గుండా అనంతపురం వరకు సొనసాగించారు. దారిలో బెంగుళూరు నుంచి పలమనేరు, చిత్తూరు ప్రాంతాలనుంచి వచ్చిన వివిధ సంఘాల ప్రతినిధులతో కలిసి వారి సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించి తమ ప్రభుత్వ హయాంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తిమ్మిరెడ్డిపల్లె వద్దకు విశాఖపట్టణం జిల్లా అరకు శాసనసభ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభారవి నేతృత్వంలో తరలివచ్చిన 62 మంది సర్పంచ్‌లు, 26 మంది ఎంపిటిసిసభ్యులు, 45 మంది మాజీ సర్పంచ్‌లతో పాటు 400 మంది గిరిజనులను జగన్ పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. 56వ రోజు పాదయాత్రలో భాగంగా జిల్లాలో దాదాపు 15 కిలోమీటర్ల నడిచిన జగన్ మంగళవారం గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పాదయాత్రను కొనసాగించారు.

కరవు రహిత ఆంధ్రప్రదేశ్
సీఎం చంద్రబాబు లక్ష్యం

ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు : రాష్ట్ర అటవీ శాఖ మంత్రి శిద్దా రాఘవరావు



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌ను కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని, దీనికి ప్రతీ ఒక్కరు సహకారం అందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖా మంత్రి శిద్ధారాఘవరావు పిలుపునిచ్చారు. రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 5వ విడత జన్మభూమి-మాఊరు ఏడవ రోజు కార్యక్రమంలో భాగంగా గుంటూరుజిల్లా పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని ధరణికోట గ్రామంలో జరిగిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ పేద వ్యక్తికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించాలనే సంకల్పంతో నూతన పథకాలను ప్రభుత్వం ప్రవేశపెడుతుందన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజల సాదక, బాదకాలను తీర్చేందుకు జన్మభూమి - మా ఊరు కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. విభజన అనంతరం 16వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన నడిపిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. రైతు, డ్వాక్రా రుణమాఫీ చేసిన తొలి ప్రభుత్వంగా రికార్డులోకి ఎక్కామని పేర్కొన్నారు. చంద్రన్న భీమా, పెళ్లి కానుక, విలేజ్ మాల్స్, రూ. 149కే ఫైబర్ నెట్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ చమన్, ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేక విమర్శలు


రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు



అమరావతి, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి చంద్రబాబు చేపడుతున్న అద్భుతమైన సంస్కరణల ఫలితంగా నవ్యాంధ్ర ప్రదేశ్ అభివృద్ధిపథంలో దూసుకుపోతోందని, దీనిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు దిగజారుడు విమర్శలు చేస్తున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలియజేశారు. ఈ మేరకు ఆయన సోమవారం గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. 13 జిల్లాల సర్వతోముఖాభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి ఫలాలు అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతాంగ సంక్షేమానికి కట్టుబడి గత మూడున్నరేళ్లలో సాగునీటి ప్రాజెక్టులపై రూ.47,375.49 కోట్లను ఖర్చు చేసిన ఘనత చంద్రబాబు ప్రభుత్వసొంతమన్నారు. అధికారకాంక్ష తప్ప మరే ధ్యాసలేని వైసీపీ నేతలు రాజకీయ మనుగడ కోసం రైతులు, గిరిజనులను రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నారని, ఇకనైనా తీరు మార్చుకోకపోతే 2014లో పట్టిన గతే రానున్న ఎన్నికల్లో కూడా పడుతుందని హెచ్చరించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు

టీడీపీ ప్రభుత్వ పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పాలకొల్లు టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామా నాయుడు తెలియజేశారు. మిగులు బడ్జెట్‌తో ఉన్నప్పటికీ గత వైఎస్ ప్రభుత్వంలో బోగస్ పింఛన్లపోగా 35 లక్షల మందికి మాత్రమే పింఛన్లను ఇచ్చేవారన్నారు. కానీ రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ పేదల సంక్షేమానికి కట్టుబడిన చంద్రబాబు ప్రభుత్వం 46 లక్షల మందికి నెలకు వెయ్యి రూపాయల చొప్పున పింఛన్లు ఇవ్వడం జరుగుతోందన్నారు. తాజాగా జరుగుతున్న ఐదవ విడత జన్మభూమి కార్యక్రమం ద్వారా నూతనం మరో 4.5 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని, కొత్తగా హిజ్రాలకు కూడా రూ.1,500 పింఛన్ అందజేస్తున్నామని తెలిపారు. అవినీతి కేసుల్లో ముద్దాయిలు, ప్రజాధనం లూటీ చేసిన వారితో నిండిన ప్రతిపక్ష పార్టీ సభ్యులు టీడీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక అబద్ధపు ఆరోపణలు, విమర్శలకు దిగడం పరిపాటిగా మారిందని విమర్శించారు. ఇకనైనా తీరు మార్చుకొని తల్లి, పిల్ల కాంగ్రెస్ నేతలు అభివృద్ధి, సంక్షేమంలో నిర్మాణాత్మక పాత్రను పోషిస్తే కనీసం ప్రజా గౌరవం దక్కుతుందని సూచించారు.



బాబువన్నీ అబద్ధాలే

వైకాపా నేత బొత్స

హైదరాబాద్, ఆంధ్ర ప్రభ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నోరు తెరిస్తే అబద్ధాలేనని, నీటి ప్రాజెక్టులపైరూ. 50వేల కోట్లు ఖర్చు చేశానని చెప్పడానికి అది నాలుకా...తాటి మట్టా అని వైసీపి నేత బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై రూ. 22వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఇందులో కూడా రూ. 16వేల కోట్లు పనులపై ఖర్చు చేసి మిగిలిందంతా అంచనాల పెంపుతో కాజేశారని ధ్వజమెత్తారు. కర్నూలు సభలో సీఎం ప్రాజెక్టులపై రూ. 50వేల కోట్లు ఖర్చు చేశామని అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. తమ పార్టీ నేత అంబటి రాంబాబును అక్రమంగా అరెస్టు చేశారన్నారు. చంద్రబాబు మైండ్ సెట్ ఎలాంటిదంటే ఆయన చిన్నప్పుడు చదువుకున్న పాఠశాలకు నేటికీ సున్నం కూడా వేయించలేని దౌర్భాగ్యం నెలకొని ఉందన్నారు. ఇప్పటికైనా అబద్ధాలు కట్టిపెట్టి వాస్తవాలపై సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలని బొత్స డిమాండ్ చేశారు.

గంగవరం పోర్టు చీఫ్ సెక్యూరిటీ అధికారిగా
నండూరి సాంబశివరావు



విశాఖ క్రైం, ప్రభ న్యూస్: విశాఖపట్నం గంగవరం పోర్టు చీఫ్ సెక్యూరిటీ అధికారిగా నండూరి సాంబశివరావు నియమితులయ్యారు. ఇటీవల రాష్ట్ర డీజీపీగా ఆయన పదవీ విరమణ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఆయన తీసుకున్న సాహసోపేత నిర్ణయాలతో డేరింగ్ పోలీస్ అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, ఉత్తమ విలువలు, మానవతావాది కావడంతో ఆయనకు పోలీసులే కాకుండా ఇతర డిపార్టుమెంట్‌లలో పనిచేసే అధికారులు కూడా ఈయనకు అభిమానులుగా మారిపోయారు. ఆయనతో విశాఖకు ఎక్కువ అనుబంధం ఉంది.

గతంలో ఇక్కడ పోలీస్ కమిషనర్‌గా పనిచేశారు. విశాఖలో శాంతిభద్రతలను కట్టుదిట్టం చేసి పోలీసులు ప్రజల మధ్య స్నేహ భావాన్ని పెంపొందించారు. అనంతరం ఆయన రాష్ట్ర ఆర్టీసీ ఎండిగా కూడా బాధ్యతలు చేపట్టి ఆర్టీసీ అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేశారు. తరువాత ఆయన డీజీపీగా బాధ్యతలు స్వీకరించి ఒకబాధ్యత గల పోలీస్ అధికారిగా రాష్ట్రానికి విశేష సేవలందించి ప్రభుత్వంచే మన్ననలు పొందారు. పదవీ విరమణ అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎప్పుడైనా తన సేవలను స్వీకరించవచ్చని చెప్పారు. రాష్ట్రప్రభుత్వానికి అవసరమైతే ఎలాంటి సేవలు చేసేందుకు అయినా తాను సిద్ధంగా ఉన్నట్లు తెలియజేసారు.

గతంలో విశాఖతో ఎంతో అనుబంధం ఉన్న ఆయన తిరిగి విశాఖకు రావడం పట్ల చాలా మంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన సేవలను గంగవరం పోర్టుకు ఎంతో అవసరమని పేర్కొంటున్నారు. పోలీసు ఉన్నతాధికారులు, ఆయన శ్రేయోభిలాషులు ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

ఏపీ అంశాలు చర్చకు వచ్చేనా?

నేడు ప్రధానితో గవర్నర్ భేటీ

అమరావతి, ఆంధ్రప్రభ: త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన జరపనున్న నేపథ్యంలో నాలుగు రోజుల ముందుగానే తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ సోమవారం ఢిల్లీ వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నెల 9వ తేదిన మంగళవారం గవర్నర్ భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీని కలుసుకోనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి కూడా పలు అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ప్రధాన మంత్రితో చర్చించడంతో పాటు ఒకనివేదికను కూడా నరసింహన్ ప్రధానికి సమర్పించనున్నారు. ఈసందర్భంగా పోలవరం వ్యవహారంతో పాటు ప్రత్యేక హోదా విద్యాసంస్థల విభజన, హైదరాబాద్‌లోని ఏపీ సచివాలయ కార్యాలయాల అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. తాజాగా చర్చనీయాంశంగా మారిన విజయవాడ కనకదుర్గ గుడి అంశం కూడా ప్రధాని, గవర్నర్‌ల మధ్య ప్రస్తావనకు రానున్నాయి. గతంలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య తలెత్తిన పలు వివాదాలను పరిష్కరించే బాధ్యతను కేంద్రం గవర్నర్ నరసింహన్‌పై ఉంచింది.

అయితే రెండు రాష్ట్రాల మధ్య సామరస్య పూర్వకమైన వాతావరణం నెలకొల్పడంలో కొంత మేరకు నరసింహన్ సఫలీకృతులయ్యారు. అయినప్పటికీ ఇంకా కొన్ని సంస్థల విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతుంది. ఉద్యోగుల విభజన విషయం కూడా ఇంకా కొలిక్కి రావాల్సి ఉంది. దీంతో రాష్ట్ర విభజన అంశంతో పాటు సాధారణ పద్ధతిలో శాంతిభద్రతల అంశం, కోడి పందాలపై వివాదం, అమరావతిరాజధాని వ్యవహారంపై కూడా చర్చించే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. మరో వైపు ఈ నెల 12న ముఖ్యమంత్రి కూడా ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి నరేంద్రమోడీని కలుసుకునే అవకాశాలు ఉన్నాయి. ఈలోగానే గవర్నర్ చర్చించే కొన్ని అంశాలు మాత్రం ప్రాధాన్యతను సంతరించుకోబోతున్నాయి. ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం, అమరావతి రాజధాని వంటి ఇతర పలు అంశాలపై ప్రధానితో పాటు కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి కలవబోతున్నారు. ఈలోగానే గవర్నర్ ప్రధానితో భేటీ సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి చర్చించే అంశాలపై ఆసక్తి నెలకొంది.

ఐపీఎస్‌ల పదోన్నతులకు స్క్రీనింగ్ కమిటీ

అమరావతి, ఆంధ్రప్రభ: ఐపీఎస్ అధికారుల పదోన్నతుల పరిష్కారం, వేతనాలు నిర్ణయించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా స్క్రీనింగ్ కమి టీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి దినేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో ప్రభు త్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, పోలీసు డైరెక్టర్ జనరల్(డీజీపీ) సభ్యులుగా ఉంటారని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ కమిటీ అదనపు డైరెక్టర్ జనరల్, డైరెక్టర్ జనరల్ వేతన స్కేలు నిర్ణయిస్తుంది.

'అజ్ఞాతవాసి'
అర్ధరాత్రి ప్రదర్శనలకు అనుమతి

అమరావతి, ఆంధ్రప్రభ: పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన అజ్ఞాతవాసి సినిమాకు రాష్ట్రంలోని సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్‌లలో అర్ధరాత్రి 1గంట నుంచి ఉదయం 10గంటల మధ్య ప్రత్యేక ప్రదర్శనలకు హోంశాఖ అనుమతిచ్చింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.ఆర్.అనురాధ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏర్పడే రద్దీ, శాంతి భద్రతల సమస్య, టిక్కెట్ల బ్లాక్ మార్కెటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని అనుమతిచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని ఆమె తెలిపారు. ఆటల ప్రదర్శనలు మినహా ఇతర నిబంధనలు యధాతదంగా అమలులో ఉంటాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
మంగళవారం 9 జనవరి 2018

వాక్ స్వేచ్ఛ అంటే ఇదేనా?

వాక్ స్వేచ్ఛకూ, పత్రికా స్వేచ్ఛకూ తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆధార్ కార్డుల గోప్యత వివాదంపై సమాధానమిస్తూ హామీ ఇచ్చిన రోజునే, ఢిల్లీలో దళిత నాయకుడు జిగ్నేష్ మేవానీ బహిరంగ సభకు అనుమతి ఇవ్వకపోవడం ప్రభుత్వ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. ప్రధానమంత్రి మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దళితులందరినీ సంఘటిత పరిచిన జిగ్నేష్ నాయకత్వంలో తమ కోర్కెలు సాధించుకోవాలని దేశంలోని పలుప్రాంతాల్లో దళితులు ముందుకు వస్తున్నారు. మహారాష్ట్రలోని పూణే సమీపంలో కోరేగావ్‌లో ఇటీవల జరిగిన ఆందోళన సందర్భంగా ఆయనను ఆహ్వానించారు. బాధితుల వద్దకు తనను వెళ్ళనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారని జిగ్నేష్ ఆరోపించారు. తన వద్ద ఎటువంటి ఆయుధాలు లేనప్పటికీ, తనను అరెస్టు చేయడాన్ని తన వాక్ స్వేచ్ఛను ప్రభుత్వం హరిస్తోందనడానికి ఇది నిదర్శనమని జిగ్నేష్ సోదాహరణంగా పేర్కొన్నారు. జిగ్నేష్ దళితుల తరఫున పోరాడుతున్న మాట నిజమే కానీ, కేవలం కులం ముద్ర వేయకుండా, సమాజంలో ఇప్పటికీ కొనసాగుతున్న అంటరానితనం, అన్యాయాలకు వ్యతిరేకంగా సాగిస్తున్న పోరాటంగానే అతడి ఉద్యమాన్ని చూడాల్సిఉంటుంది. గుజరాత్ ఎన్నికల సందర్భంగా సౌరాష్ట్ర, దక్షిణ గుజరాత్ ప్రాంతాల్లో బీజేపీ బాగా దెబ్బతినడానికి కుల సమీకరణలు కూడా కారణం కావచ్చు కానీ, అవే ప్రధాన కారణం కాదు. సమాజంలో అంతరాలు పెరుగుతున్న వాస్తవాన్ని పాలకవర్గాలు గుర్తించకపోతే అట్టడుగు వర్గాల్లో అసంతృప్తి ఎన్నికల సమయంలో వ్యక్తం అవుతూ ఉంటుంది. ప్రధానమంత్రి మోడీకి ఈ విషయం తెలుసు కనుకనే, దళితులు, వృత్తిపరమైన వర్గాలకు అనేక రాయితీలు ప్రకటించారు. అయితే, ఆర్థిక తోడ్పాటు, పథకాల ద్వారా ప్రయోజనం కన్నా, సామాజికంగా తమకు గుర్తింపు, గౌరవం కోసం అట్టడుగువర్గాలు పోరాటం సాగిస్తున్న వాస్తవాన్ని పాలకవర్గాలు గుర్తించాలి. ఇంతవరకూ దేశంలో దళితుల తరఫున జరిగిన ఉద్యమాలు వేరు, ఇప్పుడు జిగ్నేష్ నేతృత్వంలో సాగుతున్న ఉద్యమం వేరు. అట్టడుగు వర్గాల్లో విద్యావంతులు ఇప్పుడు నాయకత్వ బాధ్యతలను స్వీకరిస్తున్నారు. వారి ప్రతినిధే జిగ్నేష్. ముంబాయిలో కూడా ఆయన పాల్గొనే ర్యాలీకి అక్కడి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఇప్పుడు ఢిల్లీలో పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం వల్ల తమ పట్ల వివక్షకు ఇదే నిదర్శనమన్న అట్టడుగువర్గాల వాదనకు బలం చేకూరుతుంది. ఢిల్లీ, ముంబాయిలలో ఇప్పట్లో ఎన్నికలు ఏమీ లేవు. జిగ్నేష్ ర్యాలీల వల్ల బీజేపీకి వచ్చే తక్షణ నష్టం ఏమీ లేదు. అటువంటప్పుడు ర్యాలీలకు అనుమతి ఇవ్వకపోవడం ఉద్దేశ్య పూర్వకంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్న అపవాదుకు ఆధారం అవుతుంది. రెండేళ్ళ క్రితం సరిగ్గా జనవరిలోనే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్య జరిగిన నాటి నుంచి యూనివర్సిటీల్లో విద్యార్థులు తరచూ ర్యాలీలు నిర్వహిస్తూ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఏ పాలనలో పెరుగుతున్న అసహన ధోరణులను ఎండగడుతున్నారు. జిగ్నేష్ కూడా తమ రాష్ట్రంలో గోరక్షకుల దాడుల్లో దెబ్బతిన్న దళితులను సమీకరించడం ద్వారానే ఎమ్మెల్యే అయ్యాడు. ఇప్పుడు జాతీయ స్థాయికి ఎదిగేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఆయన పిలుపునకు దళితులు ఏమేరకు స్పందిస్తారో, ఎంతమంది ఆయన వెంటనడుస్తారో తెలియదు. అప్పుడే ఆయన పై ఆంక్షలు విధించడంవల్ల మరో నాయకుడు దేశ రాజకీయాల్లో తయారు కావడానికి కారణం అవుతుందే తప్ప వెంటనే ఒరిగే ప్రయోజనం ఏమీ ఉండదు. రోహిత్ వేముల ఆత్మహత్య పర్యవసానంగా ఢిల్లీ యూనివర్శిటీలో విద్యార్థుల ర్యాలీలకు ఆంక్షలు విధించడం వల్ల కన్హయ్ కుమార్, ఒమర్ ఖలీద్ వంటి నాయకులు జాతీయ స్థాయిలో ప్రాచుర్యాన్ని సంపాదించుకున్నారు. తొక్కిపట్టే ధోరణుల వల్ల ఆవలి వ్యక్తులకు మరింత బలం చేకూరుతుందే తప్ప వేరే ప్రయోజనం ఉండదు. పైగా, ప్రభుత్వం వాక్ స్వేచ్ఛను హరిస్తోందనే అపవాదును మూటగట్టుకోవల్సి వస్తుంది. ఢిల్లీ, ముంబాయిలలో ప్రస్తుతం ఎటువంటి ఉద్రిక్తతలూ లేవు. జిగ్నేష్ ర్యాలీవల్ల వాతావరణం ఒక్కసారిగా మారిపోయే అవకాశం ఏమీలేదు. ఢిల్లీలో శాంతి భద్రతల అంశం కేంద్రం పరిధిలోనే ఉన్న దృష్ట్యా, జిగ్నేష్ ర్యాలీకి కేంద్రమే మోకాలడ్డుతోందని ఆయన అనుచరులు ఆరోపిస్తున్నారు. వాక్ స్వేచ్ఛను అరికట్టేందుకు గతంలో ప్రయత్నించిన ప్రభుత్వాలు చేతులు కాల్చుకోవల్సి వచ్చిందన్న వాస్తవాన్ని మరువకూడదు.

తలాఖ్‌లో దిద్దుబాట్లు తప్పవ్!



విశ్లేషణ

అనితా సలూజా
సీనియర్ పాత్రికేయురాలు

ముమ్మారు తలాఖ్ హీనమైనదని అత్యున్నత న్యాయస్థానం ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్ తలాఖ్‌ను నిషేధించింది. అప్పటికప్పుడు మూడుసార్లు తలాఖ్ చెప్పి విడాకులు తీసుకోవడం ఇకపై చెల్లదని పేర్కొంది. 2017 ముస్లి మహిళల బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు రాజ్యసభలో చిక్కకుపోయింది. ప్రతిపక్షానికి అక్కడ ఆధిక్యత ఉండడమే దీనికి కారణం. జనవరి 29నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలలో దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదింపజేసుకోవాలని భారతీయ జనతా పార్టీ కృతనిశ్చయంతో ఉంది. ట్రిపుల్ తలాఖ్‌ను నేరపూరితమైన చర్యగానే కాకుండా, మూడేళ్ళవరకూ జైలు శిక్ష కూడా పడే అవకాశమున్న ఈ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు ప్రభుత్వం మరోమారు ప్రయత్నిస్తుంది.

వాస్తవానికి తలాఖ్ అనేది రెండు బిల్లు కథ. 1986లో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ది ముస్లిం ఉమెన్(ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ ఆన్ డైవోర్స్) బిల్లును తెచ్చారు. షాబానో కేసులో అత్యున్నత న్యాయస్థానం తీర్పును రద్దుచేయడానికి ఆయనీ చర్యకు పూనుకున్నారు. ఈ కేసులో షాబానోకు జీవితాంత భరణం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. అప్పట్లో 60ఏళ్ళ మహిళ షాబానో తాను జీవించి ఉన్నంతకాలం విడాకులిచ్చిన భర్తనుంచి భరణం ఇప్పించాలని ఆమె కోర్టును కోరింది. సిపిసి 125 కిందషీబానో భరణాన్ని పొందడానికి అర్హురాలని ఆదేశాలిచ్చింది. ముస్లిం ఉలేమాల నుంచి వచ్చిన నిరసనల కారణంగా సుప్రీం తీర్పును రద్దుచేయడానికి రాజీవ్ గాంధీ బిల్లును తెచ్చారు. మూడూ దశాబ్దాల అనంతరం 2017లో షాయరా బానో కేసు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతికి ట్రిగర్‌ను అందించింది. ది ముస్లిం ఉమెన్(వివాహ హక్కుల పరిరక్షణ)బిల్లు 2017ను తెచ్చేందుకు దోహదపడింది. షాయరా బానో సోషియాలజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. పెళ్ళయ్యిన 13ఏళ్ళ అనంతరం ఇద్దరు పిల్లలున్న ఆమెకు భర్త రిజ్వాన్ అహ్మద్ స్పీడ్ పోస్టు ద్వారా 2015లో తలాక్ చెప్పి, విడాకులు తీసకున్నాడు. ఈ అంశంపై షాయరా సుప్రీం కోర్టు తలుపు తట్టింది. ట్రిపుల్ తలాఖ్‌ను రద్దు చేయాలని కోరింది. ఈ కేసులో ఆమె తొలి పిటిషనర్. నోటితో కానీ, టెలిఫోన్‌లో గానీ, రాతపూర్వగా గానీ, వాట్సాప్‌లో గానీ, ఎస్ఎమ్ఎస్ ద్వారా గానీ తలాఖ్ చెప్పడం చట్ట విరుద్ధమూ, హీనమైనది ప్రకటించింది సుప్రీం కోర్టు. ఈ ఉత్తర్వులను ధిక్కరించిన వారు జైలు శిక్షకు అర్హులు.

ట్రిపుల్ తలాఖ్‌ను రద్దు చేస్తామని ఉత్తర ప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో భారతీయ జనతా పార్టీ ఓటర్లను హామీ ఇచ్చింది. ఆ హామీకి బీజేపీ కట్టుబడింది. ఇందులో రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ చిక్కుకుపోయింది. ఈ అంశంలో బీజేపీని సమర్థించడానికి కాంగ్రెస్ సిద్ధంగా లేదు. అలాగని వ్యతిరేకించటమూ లేదు. ఈ బిల్లుపై ముస్లిం మహిళల నుంచి వెల్లువెత్తుతున్న స్పందన కాంగ్రెస్‌కు పచ్చి వెలక్కాయ గొంతులో పడినట్టుగా మారింది. లోక్ సభలో తమ బలం తెలుసు కాబట్టి, బిల్లును కాంగ్రెస్ సభ్యులు అభ్యంతర పెట్టడానికి పరిమితమయ్యారు. రాజ్యసభలో



అధికార పక్షానికి ఆధిక్యత లేదు కాబట్టి, కాంగ్రెస్ నిద్రలేచింది. ప్రతిపక్షాన్ని కూడగట్టింది. బీజేపీకి మిత్రపక్షాలైన టీడీపీ, ఏఐఏడీఎమ్‌కె, తటస్థంగా ఉండే బీజేడీ పార్టీలు కూడా ప్రతిపక్షంతో చేతులు కలిపాయి. మొత్తం 17పార్టీలు బిల్లును ఇప్పుడున్న రీతిన ఆమోదించడానికి అభ్యంతరం చెబుతున్నాయి. కాంగ్రెస్‌కు ఈ అంశం ఆయుధాన్ని చేతికిచ్చింది. షాబానో కేసు అనుభవంతో కాంగ్రెస్ ప్రస్తుత బిల్లును పూర్తిస్థాయిలో వ్యతిరేకించలేదు. ఎందుకంటే అది మిగిలి ప్రతిపక్షాల భుజాలను అధికారపక్షంపై దాడికి వాడుకుంటోంది కాబట్టి. అన్ని ప్రతిపక్ష పార్టీలు బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేస్తున్నాయి. అక్కడ చర్చించి, లోపాల్ని సవరించవచ్చని ప్రతిపక్షాల అభిప్రాయం. ఒక నెలలోపల సెలెక్ట్ కమిటీ ట్రిపుల్ తలాఖ్ బిల్లుపై అభిప్రాయాన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టవచ్చని కూడా ప్రతిపక్షం పేర్కొంది. జనవరి 29 నుంచి బడ్జెట్ సెషన్ ప్రారంభమవుతోంది. ఈ నేపథ్యంలో సరిదిద్దిన బిల్లును రాజ్యసభలో ఎప్పుడు ప్రవేశపెట్టాలి? బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికీ, బీజేపీ నాయకత్వంలో సమైక్యమైన ప్రతిపక్షానికీ బిల్లు ప్రతిష్ఠాత్మకంగా తయారైంది. రెండు వర్గాలూ ముందు స్పందించదలచుకోలేదు. అలాగని పట్టు వీడదల్చుకోనూ లేదు. బిల్లులోని అంశాలను నీరు గార్చడం బీజేపీకి సుతరామూ ఇష్టం లేదు. అందుకే బిల్లును అది సెలెక్ట్ కమిటీకి పంపదలచుకోలేదు. అక్కడ కూడా ప్రతిపక్షానికే ఆధిక్యత ఉండడమే దీనికి కారణం.

తలాక్ రద్దు బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. అక్కడ మాత్రమే ఆ బిల్లుకు తాము కొన్ని సవరణలను ప్రతిపాదించగలమన్నది వాటి నిశ్చితాభిప్రాయం. ఎటువంటి వివక్ష లేకుండా అందరికీ న్యాయం చేకూరుతుందని కాంగ్రెస్, ప్రతిపక్షాలు వాదించాయి. ఈ బిల్లుకు సంబంధించి కొన్ని అంశాలను లోతుగా పరిశీలించాల్సి ఉంది. ఉదాహరణకు ఇస్లాం మతంలో పెళ్ళి అనేది భార్యా,భర్తలు కుదుర్చుకునే సివిల్ కాంట్రాక్ట్. అప్పటికప్పుడు తలాక్ ద్వారా విడాకులు తీసుకుంటే, నేరంగా ఎందుకు పరిగణించి, చర్య తీసుకోవాలన్నది ప్రశ్న. విడాకులిచ్చిన భర్త జైలుకి వెళ్ళడమనేది ఏ మతంలోనూ లేదు. ఇస్లాంలోనే ఎందుకు? ఇది ప్రతిబంధకంగా ఉన్న మాట నిజమేనని బీజేపీ కూడా పేర్కొంటోంది. కక్ష సాధింపు రాజకీయాలకు ఇది తెరలేపుతుందని కాంగ్రెస్ భావిస్తోంది.

ముమ్మారు తలాక్ చెప్పే పద్ధతి చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పుడు భర్తను అరెస్టు చేయడం ఎందుకు? జైలులో పెట్టడం ఎందుకు? కుటుంబంలో ఆదాయం తెచ్చే వ్యక్తి జైలుకి వెళ్తే ఆ కుటుంబాన్ని ఎవరు పోషించాలి, ఆ కుటుంబం ఎలా గడుస్తుంది? అనే ప్రశ్నలు సమాధానం లేనివిగా మిగిలిపోతున్నాయి. ఇది శిక్షార్హమైన నేరం కనుక, ఫిర్యాదు భార్య నుంచే కాకుండా, మూడో వ్యక్తి ఎవరి నుంచైనా రావచ్చు. దీనిని బట్టి ముస్లిం వ్యక్తితో అమీతుమీ తేల్చుకోవడానికి ఎవరైనా అతడిని జైల్లో పెట్టవచ్చునని విమర్శకులు పేర్కొంటున్నారు.

మన దేశంలో ముఖ్యమైన మతాలకు వ్యక్తిగత చట్టాలు దేనివి దానికి ఉన్నాయి. ఈ చట్టాల ప్రకారమే పెళ్ళిళ్ళు, విడాకులు, వారసత్వ వివాదాలు, దత్తతలు, భరణాలు మొదలైనవి నిర్వహిస్తుంటారు.

ఈ బిల్లు విషయంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం తగిన హోం వర్క్ చేయలేదని విమర్శకులు పేర్కొంటున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అజెండా ప్రకారమే దీనిన రూపొందించారన్నది వారి వాదన. పర్సనల్ లా పేరిట ప్రాథమిక హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముమ్మారు తలాక్‌ని రద్దు చేస్తూ గత సంవత్సరం ఆగస్టులో సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మకమైన తీర్పుపై అందరూ హర్షం ప్రకటించారు. ఇందుకు సంబంధించి తగిన చట్టాన్ని రూపొందించాల్సిందిగా సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. బ్రిటిష్ పాలకులు తలాక్ చట్టాన్ని తెచ్చినప్పుడు, స్వతంత్ర భారత దేశంలో ఇందుకు పరిష్కారాలను సూచిస్తూ ప్రజాస్వామ్య ప్రభుత్వం ఎందుకు కొత్త బిల్లును తేకూడదన్న వాదన సహేతుకంగానే ఉంది.

సుప్రీం కోర్టు తన తీర్పులో తలాక్‌కి బదులు సరైన శాసనాన్ని తీసుకుని రావాలని కేంద్రాన్ని ఆదేశిస్తున్నామని పేర్కొంది. కొత్త శాసనాన్ని తీసుకుని వచ్చేటప్పుడు ముస్లిం పర్సనల్ లా--షరియత్‌ని కూడా పరిగణనలోకి తీసుకుంటారని ఆశిస్తున్నామని సుప్రీంకోర్టు పేర్కొంది. షరియత్‌ని ఇతర దేశాల్లో ఎలాగైతే దిద్దుబాటు చేశారో అలాగే మన దేశంలో చేస్తారని ఆశిస్తున్నామని సుప్రీంకోర్టు పేర్కొంది. ముస్లింల కోసం బ్రిటిష్ పాలకులు తెచ్చిన ఈ చట్టంలో ఇతర ఇస్లామిక్ దేశాల్లో దిద్దుబాటు చర్యలు తీసుకున్నప్పుడు మనం ఎందుకు వెనుకాడాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. మన దేశంలో కూడా ఈ చట్టాన్ని క్షుణ్ణంగా పరిశీలించి లోపాలు ఏమైనా ఉంటే దిద్దుబాటు చేసుకోవడం అత్యవసరం.

ముమ్మారు తలాక్ ద్వారా విడాకులు ఇచ్చే సంప్రదాయం వల్ల బాధలకు గురవుతున్న ముస్లిం మహిళలకు విముక్తి కలిగించేందుకు మోడీ ప్రభుత్వంఈ కొత్త బిల్లును తెచ్చినప్పటికీ, ఇలాంటి వివాదాస్పద అంశాలపై అందర్నీ సంప్రదించి ఏకాభిప్రాయాన్ని సాధించడం ప్రజాస్వామ్యంలో అత్యవసరం. ఈ బిల్లును ఏకపక్షంగా ఆమోదింపజేయకుండా, అందరినీ కలుపుకుని పోవడం ఎంతైనా అవసరం. బడ్జెట్ సమావేశాల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టకూ, పంతాలకూ పోకుండా, చరిత్రాత్మకమైన సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఏ విధంగా తీసుకుని రావాలనేదానిపై దృష్టిని సారిస్తాయని ఆశిద్దాం.

జోన్ జోల పాటేనా?

రైల్వే జోన్.. ఆంధ్రుల చిరకాల వాంఛ - ఇక చిరు స్వప్నమేనా? మూడున్నరేళ్ళుగా ఎన్నికల హామీగానే మిగులుతోంది. ఒట్టి బూటకమని సకల జనులు పెదవి విరిచే దాకా వచ్చింది. మన ప్రాంతం... మన రైలు అంటూ ఆంధ్రులెల్లరూ కలలు కంటూనే ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ విభజనానంతరం రైల్వేజోన్ ప్రధాన హామీగా, అపరిష్కృతంగానే మిగిలిపోయింది. ఎప్పుడో గుర్తొచ్చినప్పుడు రాజకీయ నాయకులు, చోటా మోటా నేతలు జెండాలు పట్టి ఆరంభశూరత్వంలా రైల్వేజోన్... రైల్వేజోన్... ఎక్కడా అంటూ అరచి గీపెట్టడం మినహా ఒరిగిందేమీ లేదు. రైల్వేజోన్ అనేది రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రవాసుల డిమాండ్లతో పైకెగసింది. ఇంతకీ విశాఖ కేంద్రంగా లేదా విజయవాడ స్థానంగా ఈ రైల్వే జోన్ ఏర్పాటవుతుందా? కేంద్రం అసలు ఏర్పాటుకు నడుం కడుతుందా? ఈ రాజ్యాలు అంటే కేంద్రం, రాష్ట్రా ల మధ్య రాజకీయ ఆటకు ఆలంబనగానే ఉంటుందా! అన్నదే నేటి ప్రశ్న. రాష్ట్రానికి సంబంధించి ఢిల్లీ స్థాయిలో ఎప్పుడు సమావేశాలు జరిగినా లేదా కేంద్రమంత్రులు ఎప్పుడు భేటి అయినా, రాష్ట్రానికొచ్చినప్పుడల్లా అడపాదడపా చర్చల్లో నిలుస్తుంది. చూస్తాం, చేస్తాం. ఇదీ చర్చల సారాంశమవుతోంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ మూడున్నర ఏళ్ళలో దాన్ని పట్టించుకున్న దాఖలాలేవీ? ఇక పాలనాధికారం మిగిలింది దాదాపు ఏడాదిన్నర మాత్రమే. దీన్ని జనమంతా గమనిస్తూనే ఉన్నారు. గుర్తుచేస్తూనే ఉన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ఈ కోరికను కేంద్రం తీరుస్తుందా! ఎప్పుడు? ఇంకెప్పుడు? పుణ్యకాలం కాస్తా ముంచుకొస్తోంది. రాజకీయ పార్టీలకు తోడు ఉద్యమ సంఘాలు లేదా నేతలు చాలాకాలం నుంచి రైల్వేజోన్ మాటే ఎత్తడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు వీలుచిక్కినప్పుడల్లా ఢిల్లీలో మకాం వేసినప్పుడూ తన పాటపాడుతూనే ఉన్నారు. తొలుత విశాఖలో కావాలని అందరూ కోరారు. ఆ పిమ్మట విజయవాడలో ఉండాలంటూ డిమాండ్లు పుట్టుకొచ్చాయి. పోనీ ఎక్కడో చోట రైల్వేజోన్ అంటూ రావాలని ఆంధ్రులు సర్దుకున్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక విజయవాడ (అమరావతి) రాజధాని కేంద్రమయింది. విశాఖ అందులో అంతర్భాగమైంది. దేశంలోని దక్షిణ, ఈశాన్య ప్రాంతాలను కలుపుతూ, ప్రధాన నగరాలైన విశాఖ, విజయవాడలను చుట్టుకుంటూ రైల్వేజోన్ ఉంది. సరకు రవాణాతో పాటు వివిధ నౌకాశ్రయాలు, పొడవైన తీర ప్రాంతం విస్తరించి ఉన్న ఈ ప్రాంతంలో రైల్వేజోన్ ఏర్పాటుకు కేంద్రం ఎందుకో మీనమేషాలు లెక్కపెడుతోంది. ఇక ప్రయాణికుల అవసరాలు తీర్చడంతో పాటు, ఆదాయపరంగాను ప్రస్తుతం ఉన్న వాల్తేరు డివిజన్, సౌత్, ఈస్టర్న్ రైల్వేజోన్‌లో భాగమై ఉంది. రోజూ వేలాదిమంది అటు ఇటూ పయనిస్తుంటారు,

జనాభా పెరుగుదలకు తోడు రైలు ప్రయాణ అవసరాలు ఎప్పటికప్పుడు మితిమీరుతున్నాయి. అంతెందుకు... ఈ ప్రాంతం గుండా పయనించే రైళ్ళు ఎప్పుడూ కిక్కిరిసే ఉంటాయి. మనం లోతుగా పరిశీలిస్తే ఈ మార్గంలో అంటే చెన్నై నుంచి గౌహతి, కోల్‌కతా తదితర చోట్లకు వెళ్ళే రైళ్ళన్నీ ఎప్పుడూ కిటకిటే. రిజర్వేషన్ ప్రయాణికులతోపాటు సాధారణ ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతం. ప్రస్తుత పండుగల సీజన్లో ఈ రైల్వే లెక్కలు తీస్తే అబ్బో అనిపించక మానదు. ప్రతిసీజన్లో ప్రయాణికులకు ముందస్తు ప్రయాణ ప్రణాళికలు తప్పనిసరవుతున్నాయి. ప్రతి ఏడాది ఒక్క వాల్తేరు డివిజన్ ఆదాయమే దాదాపు 7000 కోట్లుగా ఉంటోంది. ఇక అన్నిటికి ఆయువు పట్టులా మార్గ మధ్యంలో ఉన్న విజయవాడ సంగతి సరేసరి. ఆదాయం చూస్తే జాస్తి, రోజువారీ ట్రాఫిక్, వాణిజ్య అవసరాలూ లెక్కలు మిక్కిలిగా ఉన్నాయి. రాజధానిగా విజయవాడ రూపుదిద్దుకున్నాక సహజంగానే ప్రజావసరాలు పెరుగుతాయని చెప్పనక్కర్లేదు. విశాఖ డివిజన్‌ను నిశితంగా పరిశీలిస్తే, చాలా మటుకు సౌత్ ఈస్టర్న్ రైల్వేజోన్‌లో ఉంది. రాష్ట్రంలో ఈ ఒక్క ప్రాంతాన్ని మినహాయిస్తే మిగతాదంతా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉంది. రాష్ట్రం విడివడిగా సింహభాగం ఇంకా సికింద్రాబాద్ కేంద్ర స్థానంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనే ఉంది. రాష్ట్రాన్ని విడదీసినప్పుడు విభజన ప్రాంతానికి రైల్వేజోన్ అక్కర్లేదా? సువిశాల భారతంలో దక్షిణ దిక్కున ఉన్న పెద్ద రాష్ట్రమైన ఏపీలో మరి రైల్వే జోన్ ఇవ్వటానికి కేంద్రానికొచ్చిన సమస్య ఏమిటి! అని ఇక్కడి వారు ప్రశ్నించడం సహేతుకంగానే అనిపిస్తుంది. విశాఖ రైల్వేజోన్ అంశంలో స్థానిక బీజేపీ ఎంపీ ఆయన స్థాయిలో ఆయన వీలు దొరికినప్పుడల్లా సంగతేమైందంటూ అడిగినా అటు నుంచి స్పందన లేదు. చివరికి ఆ ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఎంపీ పార్లమెంటులో ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టేందుకు అనుమతి కోరారు. దరిమిలా మళ్లీ ఈ డిమాండు మొగ్గతొడిగింది.

రైల్వే జోన్ ఏర్పాటుపై కేంద్రం ఓ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నివేదిక కేంద్రానికి అందిందన్న సమాచారమయితే ఉంది. అందులో ఏముందో ఇంకా బయటకు రాలేదు. అసలు అవసరం ఉందా? లేదా? ఎప్పుడు మొదలెట్టాలన్నదైనా చెప్పి ఉండాలి కదా? అయితే దీనిపై స్పష్టత మచ్చుకైనా లేదు. ఇంతకాలంగా ఒరిస్సా ప్రభుత్వం అడ్డు చెప్తోందని విమర్శలు కూడా వచ్చాయి. అయితే ఇది కేవలం సాకు మాత్రమేనని రైల్వే వర్గాలు ఇటీవలే కుండ బద్దలు కొట్టాయి. మరెవరు కారకులు? కారణాలేమిటి? అన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న.

విశాఖ జోన్ విషయం అటుంచితే ఇటీవలే కాకినాడ - పిఠాపురం రైల్వే లైను అంశం తెరమీదకొచ్చింది. అసలే లేదు అంటుంటే పుండు మీద కారం జల్లిన చందాన ఈ రైలు మార్గం విస్తరణను కూడా రైల్వే శాఖ విరమించుకుంది. కాకినాడ, విశాఖ రేవుల మధ్య జల రవాణా అనుసంధానత పేర్కొనదగినది. ఈ రెండు చోట్ల నుంచి ముడిసరుకు, దేశంలోని వివిధ స్టేషన్లకు, ప్రాంతాలకు చేర్చాలంటే పిఠాపురం లైన్ ద్వారా అనివార్యమౌతుంది. పిఠాపురం దగ్గర్నుంచి ప్రధాన లైనుకు కలపడం వల్ల రవాణా ఖర్చు కలిసొస్తుంది. మరి ఈ కాకినాడ - పిఠాపురం రైలు మార్గం ప్రతిపాదన కార్యరూపానికి నోచుకోకపోతే ఈ ప్రాంతం ప్రజల ఆగ్రహం అధికారంలోని కేంద్రానికి, కాస్తో కూస్తో రాష్ట్రానికి తగలడం ఖాయమన్న వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. ఈ లైను ఏర్పాటు ఎన్నికల హామీల్లో ఉండటం వల్ల రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా తయారైంది. బంతి కేంద్రం దగ్గర ఉండటంతో చివరి యత్నంగా రాష్ట్రం లేఖ ద్వారానిరసన తెలిపింది. ఈ మార్గం ఆర్థికంగా లాభదాయకం కాదని కేంద్రమే భావిస్తోందని పత్రికల్లో ఊహాగానాలు, విశ్లేషణలు వస్తున్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన రైలు ప్రాజెక్టులను పరిశీలిస్తే వాటికీ అతీగతీ లేదు. అమలులో ఉన్న ప్రాజెక్టులకు సైతం అరకొర కేటాయింపులే. పోనీ ఆ కేటాయింపులైనా పరిపూర్ణంగా జరిగాయా అంటే సాక్ష్యాల్లేవు. కొన్నయితే అసలు పనులే మొదలెట్టలేదు. 10కి పైగా ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ వర్గాలే పేర్కొనడం ఈ సందర్భంగా గమనార్హం. విజయవాడకు రైల్ ఫ్రైట్ కారిడార్స్, గుంటూరు - గుంతకల్ లైన్ డబ్లింగ్, నడికుడి - శ్రీకాళహస్తి కొత్తరైల్వే లైను ఇత్యాది ప్రధానమైనవి ఈ ప్రాంత రైలు ప్రయాణికుల, వాణిజ్య అవసరాలు తీరుస్తాయని ఈప్రాంత ప్రజలు గంపెడాశతో ఉన్నారు. అయితే ఈ ప్రాజెక్టులు మొదలు పెట్టడం నుంచి ఎప్పుడు పూర్తి అవుతాయోనన్నదే ఇప్పటి సందేహం. పైన పేర్కొన్న వాటితో పాటు చిన్నా చితకా ప్రాజెక్టులు, లైను సర్వే పనులూ నత్తనడకనే తలపిస్తున్నాయి.

విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుకు ప్రధానంగా ఒరిస్సా, ఆపైన కొంత వరకు తెలంగాణ కూడా సుముఖంగా లేవని విమర్శలొస్తున్నాయి. దీనివల్ల సౌత్ ఈస్టర్న్ రైల్వేకు, దక్షిణ మధ్య రైల్వేకు కొంత నష్టం వాటిల్లుతుందని ఆ కారణంగానే కేంద్రం వెనకడుగు వేస్తోందని అంటున్నారు. ఏది ఏమైనా రైల్వే జోన్ అంశం కేంద్రం,రాష్ట్రా ల నడుమ రాజకీయ జగడానికి దారి తీయొచ్చేమోనని పార్టీల నేతలు భయపడుతున్నారు కూడా. ఈ వ్యవహారం భాజపా, తెలుగుదేశం ప్రభుత్వాలు, పార్టీలపై ప్రభావం చూపుతుందని, రాబోయే సాధారణ ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద చర్చకు దారి తీస్తుందని అన్ని పార్టీల అంతర్గత విశ్లేషణగా ఉంది. రాష్ట్ర విభజన బిల్లులో రైల్వేజోన్ ఏర్పాటు స్పష్టంగా పేర్కొంటూ పార్లమెంటు ఆమోదం పొంది ఉండటం ఈ సందర్భంగా గమనార్హం. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో, చర్చల్లో అయినా జోన్‌పై ఎంతో కొంత పురోగతి... అంటే కదలిక వస్తే కొంగొత్త రాష్ట్ర ప్రజానీకం సంతసిస్తుంది. లేకుంటే ఈ సెగ ఎవరికి తగులుతుందో, ఎవరు నష్టపోతారోనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సత్వర పరిష్కారం దిశగా, సకల జనుల అభిమతంగా మేలు జరుగుతుందని అందరం ఆశిద్దాం!

● చెన్నుపాటి రామారావు, 9959021483

అనుత్పాదక రాయితీలతో ముప్పు

ఏ ప్రభుత్వమైనా అనుత్పాదక రాయితీలు ఎక్కువగా ఇవ్వడం మంచిదికాదు. వీటి వల్ల భవిష్యత్తులో సామాజిక, ఆర్థిక వ్యవస్థల కు నష్టం వాటిల్లుతుంది. రాష్ట్రంలోని పేదలకు తిండి, గుడ్డ, గూడు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. ఆ బాధ్యత నిర్వర్తించడంలో భాగంగా ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, వివిధ పథకాల ద్వారా ఓటర్లను ఆకర్షించడానికి ఒక స్థాయి వరకు ఇటువంటి పథకాలను అనుమతించవచ్చు. సంక్షేమ పథకాల పేరిట స్థాయికి మించి అశాస్త్రీయంగా వస్తువులు, నగదు పంపిణీ చేయడం ప్రభుత్వ ఆర్థిక స్థితిని దెబ్బతీయడమేకాక సమాజానికి చెడు సంకేతాలనిస్తుంది. ఇటువంటి పథకాలు ప్రవేశపెట్టడంలో తమిళనాడు ముందుంటుంది. రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవడంతోపాటు పేదలకు ఉపాధి అవకాశాలు, వారి జీవనం మెరుగుకు ఉత్పత్తితో కూడిన రాయితీలివ్వడం అన్ని విధాల మంచిది. వారికి వివిధ రకాల పనులు కల్పించి వస్తు ఉత్పత్తిని పెంచడం ద్వారా ఆర్థిక వ్యవస్థ పటిష్టపడటంతోపాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలి. దీనివల్ల పని లభిస్తుంది. శ్రమ విలువ తెలుస్తుంది. వస్తు ఉత్పత్తి పెరుగుతుంది. ఇటువంటి పథకాలను గతంలో అమలు చేశారు. ఇప్పుడూ అమలు చేస్తున్నారు. వాటినే విస్తృత స్థాయిలో మరిన్ని ప్రవేశపెట్టాలి గానీ, ప్రజాకర్షణ, ఓట్ల కోసం తక్కువ వయసుకే పెన్షన్ లాంటి హామీలు ఇవ్వడం మంచి పద్ధతికాదు. తగిన కారణాలు చూపకుండా అందరినీ ఒకేగాటన కట్టివేసి ఏదో ఒక పేరుతో ప్రభుత్వం ప్రజలకు డబ్బు ఇవ్వడం అంటే వారికి సోమరితనం నేర్పినట్లే అవుతుంది. కష్టపడి పని చేయడం ద్వారా డబ్బు సంపాదించాలనే తత్వం వారికి నేర్పాలి. ఉపాధికి అనేక మార్గాలు ఉన్నాయి. ఉపాధి కల్పించే అంశాలలో, వారికి సంపాదన మార్గాలు చూపించడంలో ప్రభుత్వం సహాయపడాలేగానీ, వేలం వెర్రిగా, విచ్చలవిడిగా సంక్షేమం పేరుతో అధికంగా పథకాలు, కార్యక్రమాలు చేపట్టడం వల్ల ప్రయోజనం ఉండదు. కొన్ని సందర్భాలలో వాటి పేర్లు అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా చెప్పలేనన్ని ప్రవేశపెడుతుంటారు.

ఉదాహరణకు చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించడం, సబ్సిడీ ఇవ్వడం వంటి చర్యల వల్ల వాటి అమ్మకాలతోపాటు డిమాండ్ పెరుగుతుంది. తద్వారా ఉత్పత్తి ప్రక్రియ పెరిగి చేనేత కార్మికులకు ఉపాధి లభిస్తుంది. చేనేత అంటే దానికి అనుబంధంగా 10- 15 రకాల వృత్తుల వారు ఉపాధి పొందే అవకాశం ఉంది. పత్తి పంట ద్వారా వ్యవసాయదారులు, నూలు వడకడం, ఆసు తోడటం, పడుగులు చేయడం, రంగుల అద్దకం, కుంచెలు, లాకలు తయారు చేసేవారు, మగ్గాలు, రాట్నాలు వంటివి తయారుచేసే వడ్రంగులు, చివరకు వస్త్రాల అమ్మకం ఇలా అనేకమందికి ఉపాధి దొరుకుతుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ రోడ్లు, అంగన్ వాడీ భవనాల వంటి వాటి నిర్మాణం, పాఠశాలలు, శ్మశానాలు, చెరువులు, కాలువలు వంటి వాటి మరమ్మతులు చేపడుతున్నారు. ఈ పథకం ద్వారా ఒక పక్క గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. మరో పక్క ఉపాధి లభిస్తోంది. గ్రామీణ చిన్నతరహా పరిశ్రమలతోపాటు బుట్టలకు, తట్టలకు, చీపుర్లకు, కొవ్వొత్తులకు, చాక్‌పీస్‌లకు సబ్సిడీ ఇచ్చినా అక్కడ ఉత్పత్తి ప్రక్రియ జరుగుతుంది. ఉపాధి లభిస్తుంది. ప్రజాకర్షణ పేరుతో ఒకరికొకరు పోటీపడి ప్రజలకు డబ్బు ఇచ్చే పథకాలు ప్రవేశపెట్టడం ఎంతమాత్రం మంచిదికాదు. దానికి బదులు ఓ పలుగు, పార ఇవ్వండి. మట్టి తవ్వే పని చేసుకొని బతుకుతారు. గతంలో ఆదరణ



పేరుతో కుల వృత్తులు, చేతి వృత్తి పనులకు సంబంధించిన పరికరాలు ఇచ్చారు. ఇస్త్రీ పెట్టె, బార్బర్ షాపు సామాగ్రి, సన్నాయి, డోలు, చేపలు పట్టే వలలు, కొలివి సామాను, కుండలు, బొమ్మలు తయారు చేసే సామాగ్రి లాంటి వాటిని ఇచ్చారు. ఇప్పుడు సామాజిక పరిస్థితులలో మార్పులు వచ్చాయి. డ్రైక్లీనర్, బార్బర్, గాజులు, ఫ్యాన్సీ షాపులు, బ్యూటీ పార్లర్, హోటళ్లు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడానికి, కుటీర పరిశ్రమలకు విస్తృతస్థాయిలో రుణాలు ఇవ్వవచ్చు. చేసే వ్యాపారం, ఉత్పత్తి ఆధారంగా రూ.10 వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణాలు, సబ్సిడీలు ఇవ్వడం ద్వారా లక్షల మందికి ఉపాధి కల్పించవచ్చు. ఆ ఇచ్చే రుణాలు ప్రచారార్భాటంగా కాకుండా ఆచరణలో సాధ్యమయ్యే విధంగా ఉండాలి. బ్యాంకుల ఇష్టానికి వదిలివేస్తే మంజూరు చేసినవాటిలో సగం కూడా ఇవ్వరు. కొన్ని బ్యాంకులు 30 శాతం కూడా ఇవ్వవు. అలా కాకుండా ప్రభుత్వమే హామీ ఉండి రుణాలు ఇప్పిస్తే ప్రయోజనం ఉంటుంది. బ్యాంకుల ద్వారా రుణాలు పొందడానికి పేదలు పడే పాట్లు తగ్గించవలసిన అవసరం ఉంది. వృత్తుల పరమైన వాటికి అతి తక్కువ మొత్తంలో రుణాలు ఇవ్వడం ద్వారా లక్షల మందికి ఉపాధి కల్పించవచ్చు.

భూస్వాములు, వ్యాపారవేత్తలు, అప్పులపాలైన పేద రైతులను ఒకే గాటన కట్టి రుణమాఫీ చేయడం కూడా సరైన చర్య కాదు. ఇటువంటి చర్యల వల్ల ప్రభుత్వ (ప్రజల) ధనం అధికంగా వ్యయమై పేద రైతులతోపాటు ధనవంతులు కూడా లబ్ధిపొందుతారు. ఇటువంటి చర్యలు సమసమాజ నిర్మాణానికి విఘాతం కలిగిస్తాయి. ప్రభుత్వ ఏ ఆశయంతో ఆ పథకం ప్రవేశపెట్టిందో అది నెరవేదరు. ఇటువంటి పథకాలు ప్రవేశపెట్టేటప్పుడు పేదలకు, అట్టడుగు వర్గాలకు మాత్రమే ప్రయోజనం కలిగేవిధంగా విధివిధానాలు రూపొందించాలి. దానికంటే వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించే విధంగా చర్యలు తీసుకుంటే రైతులకు మేలు చేసినవారవుతారు. వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి సమయంలో ధరలు పూర్తిగా పడిపోవడం వల్ల రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. ఉదాహరణకు టమోటాలు ప్రస్తుతం కిలో రూ.3 లకు రైతులు అమ్ముకోవలసి వస్తోంది. కోత కూలి పోతే రైతుకు ఎంత మిగులుతుందో అందరికీ తెలిసిందే. అదే టమోటాను ప్రాసెసింగ్ కు మళ్లిస్తే ధరలు అంతగా పడిపోవు. ప్రస్తుత ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేయడానికి, ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి అధిక ప్రాధ్యానత ఇస్తోంది. ఈ రంగంలో పెట్టుబడులు ఆకర్షించడానికి అనేక రాయితీలు ఇస్తోంది. ఇటువంటి చర్యల వల్ల రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. పేద విద్యార్థులు కూడా ఉన్నత చదువుల ద్వారా ఉపాధి అవకాశాలు పొందాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం ద్వారా గతంలో కార్పొరేట్ కాలేజీలు బాగా లబ్ధి పొందారు. ఇటువంటి వాటికి అడ్డుకట్టవేయవలసిన అవసరం ఉంది. పండుగల సందర్భంలో పలురకాల వస్తువులతో ఓ సంచి ఇస్తున్నారు. సంక్రాంతికి కూడా కానుక అంటూ ఇస్తున్నారు. దీనిని దృష్టిలోపెట్టుకొని మరో పార్టీ వారు సరుకులతో కూడిన సంచులు కాకుండా సంక్రాంతికి ఇంటింటికీ ఏకంగా అరిశల ప్యాకెట్ ఇస్తామని హామీ ఇచ్చే ప్రమాదం ఉంది. ఇవి అంత అవసరమా? ఆలోచించడం. మన రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన 32 కులాలలో యాచక వృత్తి చేసుకునేవారు కూడా ఉన్నారు. సామాజికంగా, ఆర్థికంగా ఆ కులాల వారి బతుకు దుర్భరంగా ఉంది. తమకు రూ.25 వేల నుంచి రూ.లక్షల వరకు అప్పు ఇప్పిస్తే చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని బతుకుతామని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమావేశంలోనే వారు అధికారులను అడిగారు. ఈ కులాల వారితోపాటు అలా బతకాడానికి ముందుకు వచ్చేవారికి చిన్న చిన్న వ్యాపారాలు, చేతివృత్తుల ద్వారా జీవించడానికి ఏ ప్రభుత్వమైనా నిజాయితీగా అవకాశం కల్పించడం వల్ల రాష్ట్ర ఆర్థికాభివృద్ధితో పాటు వారి జీవన ప్రమాణ స్థాయి పెరగడానికి అవకాశం ఏర్పడుతుంది. ప్రభుత్వం, సమాజ శ్రేయస్సు దృష్ట్యా అశాస్త్రీయ రుణ మాఫీలను, ఉచితంగా ఇచ్చేవాటిని తగ్గించవలసిన అవసరాన్ని అందరూ ఆలోచించవలసిన అవసరం ఉంది.

● శిరందాసు నాగార్జున, 9440222914

ఎన్నికల బాండ్లకు పన్ను పరీక్ష?

● అసంబద్ధ విధానాలు తగవంటున్న ట్యాక్స్ నిపుణులు ● ఎన్నికల విరాళాల సంస్కరణల్లో మార్పులకు డిమాండ్లు
● ట్రస్టుల ద్వారా ఇచ్చే విరాళాలకు పరిమితి ఎత్తివేయాలి: పారిశ్రామిక వర్గాలు



న్యూఢిల్లీ: ఎన్నికల్లో నల్లధన ప్రవాహాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం కీలక సంస్కరణలు చేపట్టింది. రాజకీయ పార్టీల విరాళాల సేకరణ పారదర్శకంగా ఉండాలని నిర్ణయించింది. ఇందుకోసం ఎలక్టోరల్ బాండ్స్, ఎలక్టోరల్ ట్రస్టు విధానాలను కేంద్రం తెరపైకి తెచ్చింది. గతేడాది బడ్జెట్ ప్రసంగంలో మొదటిసారి జైట్లీ ఎలక్టోరల్‌బాండ్స్ అంశాన్ని ప్రస్తావించారు. నూతన సంస్కరణల పథంలో 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టం, 2013 కంపెనీల చట్టాల్లో కొద్దిమేర సవరణలు కూడా చేశారు. ఎలక్టోరల్ బాండ్ల విక్రయం కోసం రిజర్వు బ్యాంకు సహాయ పాత్ర పోషించేలా విధివిధానాలు సిద్ధం చేయడం జరిగింది.రాజకీయ పార్టీల విరాళాలకు సంబంధించిన ఈ సంస్కరణలను నిపుణులు, మేధావులు స్వాగతిస్తున్నారు. అదే సమయంలో కొన్ని సందేహాలను లేవనెత్తున్నారు. పన్నులతో ముడిపడిన అంశాలపై స్పష్టత కొరవడటమే ఇందుకు ప్రధాన కారణం. ఎలక్టోరల్ బాండ్స్, ఎలక్టోరల్ ట్రస్టులకు పన్ను రిబేటు నిబంధనలు భిన్నంగా ఉండటం కొత్త చిక్కులను తెచ్చిపెడుతోంది. స్వచ్ఛందంగా విరాళాలు చెల్లించే వారి పట్ల ద్వంద్వ ప్రమాణాలు ఏంటని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం ఏర్పడిన ఎలక్టోరల్ ట్రస్టులకు విరాళాలిచ్చే వారికొక రూలు, బ్యాంకుల నుంచి నేరుగా ఎలక్టోరల్ బాండ్లు చెల్లించే దాతలకొక రూలు ఏమాత్రం సమంజసం కాదన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ట్రస్టులకు చెల్లించే విరాళాలకు ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 80జీజీబీ లేదా 80 జీజీసీ కింద పన్ను మినహాయింపు ఇస్తున్న ప్రభుత్వం, బాండ్ల కొనుగోలు దాతలకు మినహాయింపు ఇస్తుందా? లేదా? అన్న దానిపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. బాండ్ల కొనుగోలు దాతలకు ఒరిగేదేమీ ఉండకపోవచ్చని డెమొక్రటిక్ రిఫార్మ్స్ అసోసియేషన్ అధినేత అనిల్ వర్మ చెప్పుకొచ్చారు. పన్ను గణింపు నిపుణులదీ ఇదే మాట. బాండ్లకు కూడా మినహాయింపు ఇవ్వాలని సూచిస్తున్నారు.

'ప్రస్తుతానికి ఎలక్టోరల్ బాండ్లకు పన్ను మినహాయింపు లేదు.' అని శార్దూల్ అమర్చంద్ మాగ్నల్‌దాస్ కంపెనీ భాగస్వామి అమిత్ సింఘానియా చెప్పుకొచ్చారు. బాండ్లు కొనే, సంస్థలు, కంపెనీలకు తాజా నిబంధనల మూలంగా పన్నులతో ఎదురయ్యే చిక్కుల్లో ఎలాంటి మార్పు ఉండటం లేదని నితీశ్‌దేశాయ్ అసోసియేట్స్ పేర్కొంది. ఇలాంటి అసంబద్ధ విధానాలు ఎలక్టోరల్ బాండ్ల పట్ల విముఖతకు కారణం అయ్యే ప్రమాదం ఉందని, తద్వారా బృహత్తర లక్ష్యం నీరుగా రిపోతుందని ఐటీ నిపుణులు సూచిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఎలక్టోరల్ ట్రస్టులు రాజకీయ పార్టీలకు విరాళాల సమీకరణ వాహకాలుగా వ్యవహరిస్తూ వస్తున్నాయి. ఇప్పటిదాకా ఎన్నికల కమిషన్ వద్ద 18 ట్రస్టులు రిజిస్టర్ అయి ఉన్నాయి. వీటి ద్వారా పలు సంస్థలకు, కార్పొరేట్ కంపెనీలకు రాజకీయ ఒత్తిళ్లు, వేధింపులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ట్రస్టుల ద్వారా విరాళాలు అందించేందుకు చాలా మంది అనాసక్తిగా ఉన్నారు. స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చేందుకు గల మార్గాలను సరళతరం చేయాలని కోరుతున్నారు. ఈ క్రమంలో ఎలక్టోరల్ బాండ్ల ప్రతిపాదన బాగుందని, అయితే పన్ను మినహాయింపు లేకపోవడమే తీవ్ర నిరుత్సాహానికి గురిచేస్తున్నదని వాపోతున్నారు. పార్టీలకు రికార్డులు నిర్వహించుకునే అవసరంలేని, దాతలకు వ్యక్తిగత వివరాలు వెల్లడించే సమస్య లేని ఎలక్టోరల్ బాండ్లను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కార్పొరేట్ వర్గాలు కోరుతున్నాయి. ట్రస్టులకు అవకాశం కల్పించిన మాదిరిగానే బాండ్లకూ పన్ను మినహాయింపులు కల్పించేలా చొరవ తీసుకోవాలని కోరుతున్నాయి. అదేవిధంగా విరాళాల పరిమితులపైనా భిన్నకోణాలు లేకుండా చూడాలని చెబుతున్నారు.

సుప్రీం తీర్పుపై ఉత్కంఠ?

విలక్షణ విధానాలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా సుప్రీంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ప్రస్తుతం ఇది సర్వోన్నత ధర్మాసనం ముందు ఉంది. చీఫ్ జస్టిస్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని పరిశీలిస్తోంది. 'ఇది చాలా ఆసక్తికరమైన సమస్యలా ఉంది' అని చీఫ్ జస్టిస్ వ్యాఖ్యానించడం కొసమెరుపు. మరి తుది తీర్పు ఏవిధంగా ఉంటుందన్నదే ఆసక్తిగా మారింది. ఐటీ నిపుణులు, చార్టెడ్ అకౌంటంట్లు మాత్రం పన్ను పరీక్షను బాండ్లు అధిగమించలేవని అభిప్రాయపడుతున్నారు.

ఎలక్టోరల్ ట్రస్టులు


- లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థ.
- వ్యక్తులు లేదా సంస్థల నుంచి విరాళాలు సేకరిస్తుంది.
- దాతల వివరాలు ఇక్కడ బహిర్గతంగా ఉంటాయి.
- సంస్థల లాభాల్లో 7.5శాతం వరకు పార్టీలకు విరాళాలుగా ఇవ్వొచ్చు. అయితే, లాభనష్టాలతో సంబంధం లేకుండా ఎంతమొత్తాన్నైనా విరాళంగా ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని కంపెనీలు కోరుతున్నాయి.
- సేకరించిన మొత్తంలో 95 శాతాన్ని ఆయా పార్టీలకు ట్రస్టులు చేరవేస్తాయి. ☛ అదనంగా ఉన్న మొత్తాన్ని మరుసటి ఎన్నికల కాలానికి సర్దుబాటు చేస్తుంది.
- ట్రస్టులకు చెల్లించే విరాళాలపై నూరు శాతం పన్ను మినహాయింపు ఉంటుంది.

ఎలక్టోరల్ బాండ్లు

- ఎంపిక చేసిన బ్యాంకుల ద్వారా రిజర్వు బ్యాంకువీటిని విక్రయిస్తుంది.
- వ్యక్తులు లేదా సంస్థలు వీటిని కొనుగోలు చేయవచ్చు
- దాతల వివరాల (కేవైసీ)ను బ్యాంకులు డిమాండ్ చేయవు.
- దీంతో విరాళాలు ఎవరు? ఎవరికి ఇస్తున్నారన్న అంశం అప్రస్తుతంగానే ఉంటుంది. కాకుంటే, కొనుగోలు చేసేబాండ్ల మొత్తానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడే సమస్య ఉత్పన్నం అవుతున్నది.
- విరాళాల రూపంలో వచ్చిన బాండ్లను పార్టీలు నిర్దిష్ట గడువులోగా నగదుగా మార్చుకుంటాయి.

నా తొలి ప్రేమను గెలవలేకపోయా

సూపర్‌స్టార్ రజనీకాంత్



చెన్నై: సూపర్‌స్టార్ రజనీకాంత్ తన తొలి ప్రేమ గురించి విఫలమైనట్టు తెలిపారు. తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన్ను టీనేజ్ లవ్ గురించి ప్రశ్నించగా... దీనిపై తలైవా స్పందిస్తూ... 'నాకూ తొలి ప్రేమ ఉంది. నేను హైస్కూల్‌లో ఉన్నప్పుడు ప్రేమలో పడ్డాను. చాలా మంది తమ తొలిప్రేమను గెలవగలిగారు. కానీ నేను ఆమె హృదయాన్ని గెలుచుకోలేకపోయాను' అని చెప్పారు. అనంతరం ఆమె పేరు చెప్పాల్సిందిగా కోరగా, చెప్పడానికి ఆయన నిరాకరించారు. ఆ తర్వాత 'మీ చిన్న, పెద్ద కోరికలు ఏంటి?' అని ప్రశ్నించగా, 'ఒక స్కూటర్, ఓ చిన్న ఇల్లుకట్టుకుని మధ్యతరగతి కుటుంబంలా జీవించాలన్నది నా చిన్న కోరిక, ఇక నా సినిమాల ద్వారా ప్రజలు, అభిమానులకు మంచి సందేశాలు అందిస్తూ వారి ముఖాల్లో చిరునవ్వు చూడాలి అనుకోవడమే నా పెద్ద కోరిక' అని రజనీ అన్నారు.

25న 'పద్మావత్' విడుదల

న్యూఢిల్లీ: 'పద్మావత్' నీరీక్షణకు ఎట్ట కేలకు తెరపడింది. వివాదాస్పద చిత్రం పద్మావతిని పద్మావత్‌గా మార్చిన అనంతరం ఈ నెల 25న విడు దల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తుంది. ఆందోళనలు, అనిశ్చితులు, ఎడతెగని జాప్యం అనంతరం పద్మావత్ విడుదలకు నోచుకుంది. కొన్ని సవరణలు తర్వాత సెన్సార్ బోర్డు ఈ చిత్రం విడుదలకు అంగీకరించింది. సవరణల్లో భాగంగా చిత్రం పేరును పద్మావతి నుంచి పద్మావత్‌గా మార్చారు. అదేవిధంగా చరిత్రను వక్రీకరించే దృశ్యాలను తొలగింపునకు చిత్ర బృందం అంగీ కరించింది. వివాదాల్లో చిక్కుకుని విడు దల విషయం సందిగ్ధంగా మారిన నేపథ్యంలో సినిమా విడుదలకు మార్గం సుగమం అవటంతో బాలీవుడ్‌లో పలువురు నటులు, టెక్నిషియన్లు హర్షం వ్యక్తం చేశారు.ఈ నెల 25న పద్మావత్ ప్రేక్షకుల ముందు సందడి చేయనుంది. దీపికా పదుకొనే, రణ్‌వీర్ సింగ్, షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంజయ్‌లీలాబన్సాలీ దర్శకత్వ బాధ్యతలు నెరవేర్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమా గతేడాది డిసెంబర్లోనే విడుదల కావలసి ఉండగా రాజ్‌పుత్‌ల ఆందోళన నేపథ్యంలో వాయిదా పడింది.

బహ్రెయిన్‌లో రాహుల్ పర్యటన

ఎన్ఆర్‌లతో ప్రత్యేక సమావేశం



బహ్రెయిన్: ఏఐసీసీ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తరువాత రాహుల్ మొట్టమొదటి సారిగా విదేశీ పర్యటన చేశారు. బహ్రెయిన్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్ ఆర్ఐలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆఫ్ పీపుల్ ఆఫ్ ఇండియా ఆర్జిన్ నిర్వహించిన సదస్సులో రాహుల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదేవిధంగా బహ్రెయిన్ ప్రధాని, రాజు అయిన సల్మాన్ బిన్ హమస్-అల్-ఖలీఫాను అల్ వడీ ప్యాలెస్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సదస్సుకు సుమారు 50 దేశాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్ నుండి వెళ్లి బహ్రెయిన్‌లో స్థిరపడి వ్యాపారాలు చేస్తున్న వారితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అమెరికా, బర్కిలీ, ప్రిన్సన్‌లోని యూనైటెడ్ స్టేట్ యూనివర్సిటీలను చివరిసారిగా రాహుల్ సందర్శించినట్టు తెలిపారు. ఆ సమయంలో ప్రతీ ఒక్కరు రాహుల్ కాంగ్రెస్ చీఫ్‌గా రావాలని కోరుకున్నట్టు పార్టీ వర్గాలు ఈ సందర్భంగా వివరించాయి. బహ్రెయిన్ రాజుతో రాహుల్ క్రీడల విషయమై చర్చించారు. అదేవిధంగా క్రికెట్‌తో పాటు ఇతరాత్ర క్రీడలపై ఇరువురు చర్చించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

బెంగళూర్ బార్‌లో అగ్ని ప్రమాదం

ఐదుగురి సజీవ దహనం




బెంగళూరు : కలాసీపాల్యా ప్రాంతంలోని కుంభార సంఘ్ బిల్డింగ్‌లో కొనసాగుతున్న బార్ కం రెస్టారెంట్‌లో సోమవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. మృతులంతా బార్ కం రెస్టారెంట్‌లో పనిచేస్తున్న వారే. గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. 70 ఏళ్ల క్రితం నిర్మించిన ఓ పురాత భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఈ రెస్టారెంట్ కొనసాగుతున్నది. విషయం తెలుసుకున్న ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన వారిని స్వామి (23), ప్రసాద్ (20), మహేశ్ (35)గా గుర్తించారు. వీరంతా టుంకుర్ వాస్తవ్యులు. మంజునాథ్ (45), కీర్తి (24) హసన్, మాండ్యా వాసులుగా పోలీసులు గుర్తించారు. రెస్టారెంట్ అంతా పొగతో నిండిపోవడంతో స్థానికులు ఉదయం 2.30 నిమిషాలకు గుర్తించారు. అనంతరం అగ్ని మాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. పోలీసులు యజమాని ఆర్‌వీ దయాశంజర్‌కు తెలియజేసేందుకు చూడగా అతను అందుబాటులోకి రాలేదు. ఉదయం 4 గంటల సమయంలో ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా వస్తున్నట్టు చెప్పి సెల్ స్విచ్ ఆఫ్ చేసినట్టు తెలిపారు. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేజే జార్జ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బెంగుళూరు మేయర్ ఆర్ సంపత్ రాజ్ ఉన్నారు. మృతులకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందివ్వనున్నట్టు ప్రకటించారు. రెస్టారెంట్ నిర్వాహకులు అగ్నిమాపక నియంత్రణ పరికరాలు ఉపయోగించకపోవడంతోనే ప్రాణనష్టం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారులు వివరించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా అన్నీ బార్లు, రెస్టారెంట్లకు నోటీసులు అందజేస్తామని తెలిపారు. యజమానిపై ఐపీసీ సెక్షన్ 304 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్ కమిషనర్ టి. సునీల్ కుమార్ తెలిపారు. ఘటనకు కారణమైన ఎవరినీ వదిలిపెట్టేది లేదని కర్నాటక హోంమంత్రి రామలింగరెడ్డి తెలిపారు.

12న అంతరిక్షంలో 31 ఉపగ్రహాలు

బెంగళూరు : జనవరి 12న 31 ఉపగ్రహాలు అంతరిక్షంలో పంపించడానికి ఇస్రో సన్నద్ధం అవుతున్నది. అంతరిక్షభూపరిశీలన కార్టోసాట్ సైతం అందులో ఉన్నదని శాస్త్రవేత్తలు తెలిపారు. 10న పంపించాల్సిన ఉపగ్రహాలు కొన్ని కారణాలతో జనవరి 12కు వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. అమెరికాకు చెందిన 28 శాటిలైట్‌లతో పాటు మరికొన్ని దేశాలకు చెందిన ఉపగ్రహాలు సైతం పంపించనున్నట్టు తెలిపారు. జనవరి 12న ఉదయం 9.30 నిమిషాలకు ఇస్రో అంతరిక్షంలోకి పంపనున్నట్టు డైరెక్టర్ దేవి ప్రసాద్ కార్మిక్ తెలిపారు. ఇక ఎలాంటి మార్పు ఉండబోదని ఆయన ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరి కోట నుండి ప్రయోగించనున్నట్టు తెలిపారు. ఆగస్టు 31న ప్రయోగించిన పీఎస్ఎల్‌వీ-సీ40 ఫెయిల్ కావడంతో మరింత పటిష్టంగా దీన్ని ప్రయోగించనున్నట్టు తెలిపారు.

యువతపై బీజేపీ ఫోకస్

● మిలీనియం ఓటరు పేరుతో యువ ఓటర్ల నమోదు
● కాలేజీ కనెక్ట్‌తో కళాశాలల్లో కార్యక్రమాలకు సన్నాహాలు
● కుల రాజకీయాలకు వ్యతిరేకంగా అభివృద్ధిపై ప్రచారం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఎన్నికలకు మరో ఏడాదే ఉండడంతో బీజేపీ యువతపై దృష్టి పెట్టింది. ఈ మిలినీయం 2000వ సంవత్సరంలో పుట్టిన వారందరినీ ఓటరు జాబితాలో చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించింది. ఈ ఏడాదికి వారందరికీ 18 సంవత్సరాలు నిండుతుండడంతో వారందరినీ కలుసుకుని, బీజేపీ వైపు ఆకర్షించాలని ప్రణాళిక రచించింది. ఈ మేరకు పెద్ద ఎత్తున కాలేజీల్లో వెళ్లాలని నిర్ణయించారు. కాలేజ్ కనెక్ట్ పేరుతో వివిధ కళాశాలల్లో ఓటరు నమోదుకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టనున్నారు. అలాగే జనవరి 12 స్వామివివేకానంద జయంతి రోజున దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో రక్త దాన శిబిరాలను నిర్వహించనున్నారు. ఇందుకోసం రక్తదాల వివరాలతో జాబితాలు తయారు చేస్తున్నారు. జనవరి 23వ తేదీన నేతాజీ సుభాష్ చంద్రబోస్ శతజయంతి పూర్తవుతుండడంతో అప్పటివరకు వరకు ఈ రక్తదాన శిబిరాలను కొనసాగించనున్నారు.

ప్రధానంగా రెండువేల సంవత్సరంలో పుట్టిన వారిని మిలినీయం ఓటర్స్ పేరుతో వారిని భారీ సంఖ్యలో ఓటర్ల జాబితాలో చేర్పించాలని లక్ష్యం గా పెట్టుకున్నారు. దీని కోసం ప్రత్యేకంగా ఓ మొబైల్ యాప్‌ను కూడా తయారుచేశారు. క్షేత్రస్థాయి కి వెళ్లి యువకులను కలుసుకుని ఈ యాప్‌లో వారి వివరాలు నమోదు చేయిస్తారు. వీటితో పాటు కాలేజీ కనెక్ట్ పేరుతో యువమోర్చా భారీ సంఖ్యలో కళాశాలల్లో వివిధ కార్యక్రమాలను చేపట్టనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ విజన్ న్యూ ఇండియా అనే యువకుల్లోకి తీసుకువెళ్లి వారిని పార్టీ వైపును తిప్పుకునే విధంగా ప్రణాళిక రచించారు. ప్రతి పోలింగ్ బూత్ కమిటీలోనూ కనీసం పదిమంది యువకులు ఉండే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా బూత్ కనెక్ట్ ప్రోగ్రామ్‌తో వారిని ఒకే వేదికపై తీసుకురావాలని యువమోర్చా కార్యక్రమాన్ని రూపొందించింది.

ప్రధానమంత్రి నరేంద్రమోడీ న్యూ ఇండియా లక్ష్య సాధనలో యువకులే కీలకం కావడంతో ఆ వర్గాలను ఆకర్షించేందుకు పెద్ద ఎత్తున వినూత్న కార్యక్రమాలను తీసుకువెళ్లనున్నారు. మన్ కీ బాత్‌లో సైతం ప్రధానమంత్రి అనేక సార్లు యువకులే జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. దాంతో బీజేపీ యువమోర్చా యువకులను పార్టీలో చేర్పించేందుకు ఈ ప్రయత్నాలు ప్రారంభించింది. వచ్చే లోక్‌సభ ఎన్నికలు 2019 నాటికి భారీ సంఖ్యలో యువకులను తమ బ్రిగేడ్‌లో చేర్చుకోవాలని ముమ్మరయత్నాలు చేస్తున్నారు.

గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ ముగ్గురు యువ నాయకులను తమ వైపు తిప్పుకుని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. దళిత నేత జిగ్నేష్ మేవానీ, ఓబీసీ నేత అల్పేష్ ఠాకూర్, పటేళ్ల నేత హర్దిక్ పటేళ్లు పెద్ద ఎత్తున బీజేపీకి వ్యతిరేకంగా ఎన్నికల ప్రచారాన్ని చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఆయా రాష్ట్రాల్లో ఇదే రకమైన వ్యూహాన్ని అనుసరిస్తుందని బీజేపీ నాయకులు అంచనావేస్తున్నారు.

గాంధీ హత్యపై విచారణ అనవసరం

సుప్రీంకు నివేదిక అందజేసిన అమరేందర్

న్యూఢిల్లీ : జాతిపిత మహాత్మా గాంధీ హత్య కేసు పునర్విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు అమికస్ క్యూరీ (కోర్టు సహాయకుడు)గా సీనియర్ న్యాయవాది అమరేందర్ శరణ్ నియమించిన విషయం తెలిసిందే. ఈ అంశంలో సుదీర్ఘ పరిశీలన చేపట్టిన ఆయన సోమవారం తన నివేదికను సుప్రీం కోర్టుకు అందజేశారు. మహాత్మా గాంధీని గాడ్సేనే హతమార్చాడని.. ఇందులో విదేశీ నిఘా సంస్థల వ్యక్తుల ప్రమేయం లేదని అమికస్ క్యూరీ స్పష్టం చేశారు. కేసును పునర్విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ అర్కైవ్స్ నుంచి అవసరమైన పత్రాలు, నివేదిక క్షుణ్ణంగా పరిశీలించాకే ఈ నివేదికను రూపొందించినట్టు అమరేందర్ వెల్లడించారు. నాలుగో బుల్లెట్ గాంధీ ప్రాణం తీసిందన్న అంశం ఉత్తదేనని ఆయన తేల్చేశారు. కాగా గాంధీ హత్య కేసులో పలు అనుమానాలు ఉన్నాయని, దర్యాప్తును తిరిగి ప్రారంభించాలని కోరుతూ ముంబైకి చెందిన పరిశోధకుడు, అభినవ్ భారత్ సంస్థ ట్రస్టీ పంకజ్ ఫడ్నవీస్ సుప్రీం కోర్టులో పిల్ దాఖలు చేశారు. అయితే ఈ వాదనను గాంధీ మునిమనువడు తుషార్ గాంధీ ఖండించారు.

సల్మాన్.. పెళ్లి చేసుకోకు..

పిల్లల్ని మాత్రం కను: రాణి ముఖర్జీ

ముంబై: సుమారు దశాబ్ద కాలం నుంచి సల్మాన్ ఖాన్ పెళ్లి విషయమై వార్తలు వింటూనే ఉన్నాం. ఎప్పుడు పెళ్లి చేసుకుంటాడా అని ఎదురు చూస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది కానీ జవాబు మాత్రం దొరకడం లేదని కొంత మంది సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, తాజాగా సల్మాన్ పెళ్లి గురించి బాలీవుడ్ వెటరన్ హీరోయిన్ రాణి ముఖర్జీ ఆసక్తికరంగా స్పందించింది. తన తాజా చిత్రం 'హిచ్‌కీ' ప్రచారం కోసం సల్మాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'బిగ్ బాస్-11'కి రాణి ముఖర్జీ వచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సల్మాన్ పెళ్లి గురించి ఒకసలహా ఇచ్చింది.

'సల్మాన్ పెళ్లి చేసుకోకూడదు. అయితే, పిల్లల్ని మాత్రం కనాలి. అప్పుడే నా కూతురు అదీరా ఆడుకోవడానికి తోడుదొరుకుతుంది. అలాగే సల్మాన్‌కు పెట్టబోయే పిల్లలు అచ్చం నాన్నలాగానే అందంగా ఉండాల'ని ముఖర్జీ సలహా చెప్పింది.

ప్రచారానికి వెళ్లిన బీజేపీ నేతకు చెప్పుల దండ

మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో ఘటన

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ధార్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రచారానికి వెళ్లిన బీజేపీ నేతకు చేదు అనుభవం ఎదురైంది. స్థానికులు చెప్పుల దండ వేసి అవమానించారు. ధార్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. దినేశ్ శర్మ అనే బీజేపీ నేత ధామ్నోద్ ప్రాంతంలో ఇంటింటి ప్రచారానికి వెళ్లగా ఓ వ్యక్తి చెప్పుల దండ వేశారు. ఓ వ్యక్తి చెప్పుల దండ చేత్తో తీసుకుని వస్తుండగా దినేశ్ శర్మ పక్కకు తప్పుకునే ప్రయత్నం చేశారు. కానీ ఆ వ్యక్తిని ఆ దండ వేయనిచ్చినట్టు వీడియోలో కనిపించింది. 'నా వలన అతనికి ఏదో అసంతృప్తి కలిగి ఉంటుంది. అందుకే అలా ప్రవర్తించి ఉంటారు. నేను వాళ్ల బిడ్డలాంటి వాడిని. అన్ని విషయాలు కూర్చుని చర్చిద్దా'మని దినేశ్ ఆ ఘటన అనంతరం అన్నారు. తమ ప్రాంతంలో తీవ్రంగా ఉన్న నీటి సమస్యను ఎత్తిచూపేందుకు ఇలా చేసినట్లు చెప్పుల దండ వేసిన వ్యక్తి వెల్లడించినట్టు సమాచారం. తమ ప్రాంతంలోని మహిళలు గతంలో ఉన్న చైర్మన్‌కు నీటి సమస్యపై ఫిర్యాదు చేశారని, కానీ మహిళలపై ఫిర్యాదు నమోదు చేసి ఇబ్బంది పెట్టారని, అందువల్లనే ఇలా చేశానని ఓ మీడియాకు తెలిపినట్టు తెలిసింది.

స్వలింగ సంపర్కం చట్ట సమ్మతమా..? నేరమా..?

● మరోసారి తెరపైకి స్వలింగ వివాదం
● 2013 తీర్పుపై సుప్రీంకోర్టు పున:విచారణ



న్యూఢిల్లీ: స్వలింగ సంపర్కం నేరమా..కాదా.. అనే అంశాన్ని పునఃపరిశీలించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి అప్పగించింది. స్వలింగ సంపర్కానికి సంబంధించిన సెక్షన్ 377 రాజ్యాంగబద్ధతపై చర్చించాల్సిన అవసరముందని స్పష్టం చేసింది.2009లో ఢిల్లీ హైకోర్టు స్వలింగ సంపర్కం నేరం కాదన్న తీర్పును 2013లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. లెసిబియన్స్,గే, బై సెక్సువల్,ట్రాన్స్ జెండర్,క్వీర్ మొదలైన స్వలింగ సంపర్కాలు నేరమని సుప్రీంకోర్టు స్పష్టం చేయడంతో ఆయా వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇది మానవహక్కుల ఉల్లంఘనే అంటూ పలువురు ఆందోళనబాటపట్టారు. తాజాగా సుప్రీంకోర్టులో ఐదుగురు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ప్రకృతి విరుద్ధమైన లైంగిక చర్యలను నేరంగా పరిగణించడం అనే విషయం కొందరికి నేరం అనిపిస్తే..మరికొందరికి అలా అనిపించకపోవచ్చని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

సెక్షన్ 377 ఏం చెబుతోంది..?

భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 377 1862 నుంచి అమలులోకి వచ్చింది. ఈ సెక్షన్ ప్రకృతి విరుద్ధమైన చర్యలను నేరంగా పరిగణిస్తుంది. ఏవ్యక్తి అయిన స్వచ్ఛందంగా ప్రకృతి నియమాలకు విరుద్ధంగా ఇతర పురుష,స్త్రీ, జంతువులతో శారీరక సంబంధాలు కలిగి ఉండటం నేరం. అందుకు గరిష్ఠం జీవితకాల శిక్షవేయవచ్చు. లేక 10ఏళ్ల వరకు జైలు శిక్ష పొడిగించవచ్చు. జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించవచ్చు.

స్వలింగ సంపర్కంపై ఢిల్లీ హైకోర్టులో దాఖలైన పిటిషన్ పై 2009 విచారణ జరిగిన న్యాయస్థానం కీలక తీర్పును వెలువరించింది... స్వలింగ సంపర్కం నేరం కాదని..ఐపీసీ 377 సెక్షన్ సవరణ అవసరమని స్పష్టం చేసింది. ఈ తీర్పును వెలువరిస్తూ నాటి ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ షా, జస్టిస్ ఎస్. మురళీధర్ నేతృత్వంలోని ధర్మాసనం దేశ ప్రథమ ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ సమానత్వంపై చెప్పిన మాటలను ఉటంకించింది. సమానత్వమనే అంశాన్ని పైపైనే చూడకూడదని... దాన్ని నిజమైన స్ఫూర్తితో చూడాలని నెహ్రూ అన్నట్లు నాటి బెంచ్ తెలిపింది.స్వలింగ సంపర్కంపై సుప్రీంకోర్టులో 2013లో పిటీషన్ దాఖలైన సందర్భంలో న్యాయస్థానం సంచలన తీర్పును వెలువరించింది. 2009 లో ఢిల్లీ హైకోర్టు ఇచ్చినతీర్పును కొట్టివేస్తూ స్వలింగ సంపర్కం నేరమని స్పష్టం చేసింది. ఈ కేసుపై విచారణ జరిపిన జస్టిస్ జీఎస్ సింఘ్వీ, జస్టిస్ ఎస్ జే ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ధర్మాసనం స్వలింగ సంపర్కానికి సంబంధించి చట్టాల్లో మార్పులు తేవాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. చట్టాల్లో మార్పులు చట్టసభలకే వీలౌతుందని స్పష్టం చేసింది. గత 150 ఏళ్లలో సెక్షన్ 377 కింద నేరం చేసిన దాదాపు 200 మంది స్వలింగ సంపర్కులను విచారించామని తెలిపింది.

గతేడాది ఆగస్టులో గోప్యతా హక్కుపై సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. గోప్యతా హక్కు ప్రాథమిక హక్కు అని న్యాయస్థానం స్పష్టం చేయడం ఎల్‌జీబీటీ కమ్యూనిటీకి దారి చూపించినట్లైంది. గోప్యతా అనేది వ్యక్తుల వ్యక్తిగత విషయాలకు సంబంధించిందని..లైంగిక ధోరణి ఆధారంగా వ్యక్తులపై వివక్షతగదని ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో స్వలింగ సంపర్కులు మరోసారి తమకు న్యాయం చేయాలనిసుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ గోప్యతా హక్కును హరిస్తున్న సెక్షన్ 377 పై 2013 తీర్పును పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

స్వలింగ సంపర్కంపై దాఖలైన రిట్ పిటిషన్ పై తమ స్పందనను తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. స్వలింగ సంపర్కంపై పోలీసుల బెదిరింపులకు తాము భయంభయంగా బతుకుతున్నామని పిటిషనర్లు న్యాయస్థానానికి వివరించారు. స్వలింగసంపర్కుల విషయంలో కేంద్రం వైఖరిని వెల్లడించాలని న్యాయస్థానం కోరింది.

Andhraprabha business 2018
బిజినెస్ BUSINESS

శ్రీవారి సేవలో రతన్‌టాటా



తిరుమల, ప్రభ న్యూస్: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ టాటా గ్రూప్ చైర్మన్ రతన్ టాటా సోమవారం ఉదయం దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయంలో ఆయనకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాస రాజులు సాదర స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్న అనంతరం ఆయనకు రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలుకగ ఈవో, జేఈవోలు నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ, తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఆయనతో పాటు ప్రస్తుత టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

జెబీ డెటా నుంచి బ్లాక్ చైన్ బాబు మునగాల



హైదరాబాద్, ఆంధ్రప్రభ: జెబీ డేటా ఇండియా సెక్యూరిటీ సొల్యూషన్స్‌లో సరికొత్త టెక్నాలజీతో జెబీ చైన్‌ను ఆవిష్కరించింది. సాఫ్ట్‌వేర్ డేటాకు పూర్తిస్థాయి రక్షణ కల్పించే ఈ చైన్‌ను బ్లాక్ చైన్ ఆధారంగా రూపొందించినట్లు ఈ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాబు మునగాల సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. తమ సంస్థ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని లక్ష భూ రికార్డులకు బ్లాక్ చైన్ ఆధారంగా బిగ్ డేటా సొల్యూషన్స్ అందిస్తున్నామని ఆయన చెప్పారు. రెగ్యులర్ సాఫ్ట్‌వేర్ డేటాను హ్యాక్ చేసేందుకు అవకాశం ఉందని, బ్లాక్‌చైన్ ఆధారంగా ఉన్న ఈ టెక్నాలజీ ద్వారా ఎలాంటి హ్యాకింగ్ అవకాశం లేదని ఆయన చెప్పారు. బ్యాంకులు, ఏజెన్సీలతో పాటు వ్యక్తులకు కూడా జెబీ చైన్ సొల్యూషన్స్ అందిస్తామని ఆయన చెప్పారు. బ్లాక్ చైన్ టెక్నాలజీ కంపెనీలు బ్యాంకులకే సేవలు అందిస్తున్నాయనీ, కానీ తమ సంస్థ అనేక డేటాలకు సంబంధించి సర్వీసులు ఇస్తుందన్నారు. తమ సంస్థ వైజాగ్‌లో డవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందనీ, ప్రస్తుతం దేశీయ మార్కెట్‌పైనే దృష్టిసారించామని ఆయన చెప్పారు.

ప్రాపర్టీ, విద్యాసంస్థలు, ఉద్యోగులు, హెల్త్‌కేర్, పెద్ద మొత్తంలో చేసే లావాదేవీలకు సంబంధించిన రికార్డులను తమ టెక్నాలజీ ద్వారా భద్రత కల్పిస్తామని చెప్పారు. అలాగే క్రెడిట్ స్కోరింగ్, వ్యక్తిగత ప్రాడక్ట్ క్రియేషన్, అవకతవకలు, అక్రమాల పరిశోధనలు, వినియోగదారుల రుణాలకు సంబంధించి సర్వీసులు అందిస్తామని బాబు మునగాల తెలిపారు.

జీఎస్టీ వసూళ్లు తగ్గినందుకు..

అనూహ్య నిర్ణయాలొద్దు

• కేంద్రానికి అసోచామ్ విన్నపం



అసోచామ్ అధ్యక్షుడు సందీప్ జజోడియా

హైదరాబాద్ / ముంబై : వస్తు సేవల పన్ను (జీఎస్టి) అమల్లోకి తెచ్చిన తర్వాత ప్రభుత్వానికి జీఎస్టి వసూళ్లు తగ్గిపోవడంతో కేంద్రప్రభుత్వం రెవెన్యూ పెంచుకోవడానికి అనూహ్యమైన నిర్ణయాలు తీసుకోరాదని పారిశ్రామిక మండలి అసోచామ్ ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం జీఎస్టి అమల్లోకి వచ్చింది.. కొత్త పన్ను వ్యవస్థ గాడిన పడుతోంది.. కొత్త వ్యవస్థలోని ఇబ్బందులపై దృష్టి పెడితే రెవెన్యూ క్రమంగా పెరుగుతుందని పేర్కొంది.

కాగా జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత వరుసగా రెండో నెల జీఎస్టి వసూళ్లు తగ్గముఖం పట్టాయి. నవంబర్‌లో రూ.80,808 కోట్లకు దిగిరాగా.. అంతకు ముందు నెలలో రూ.83,000 కోట్ల వరకు నమోదయ్యాయి. అసోచామ్ అధ్యక్షుడు సందీప్ జజోడియా ఇక్కడ మాట్లాడుతూ... జీఎస్టి అమల్లో వస్తున్న ఇబ్బందులతో పాటు ... జీఎస్టి అమలు పట్ల నిఘా పెంచాలని అన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వం పన్ను రెవెన్యూ తగ్గిపోతోందని అనూహ్యమైన నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన కోరారు. ప్రభుత్వం జీఎస్టి అమల్లో ఎక్కడైతే లోపాలున్నాయో వాటిపై దృష్టి పెడితే రెవెన్యూ వసూళ్లు పెరుగుతాయని జజోడియా చెప్పారు.

ఫిబ్రవరి 1వ తేదీన ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రవేశపెడుతోంది. భారత కార్పొరేట్ రంగం తరఫున తాము కోరేది.. ప్రభుత్వం బ్యాంకుల్లో పేరుకుపోతున్న మొండిబకాయిల ఇబ్బందులపై దృష్టి పెట్టాలని.. బ్యాంకుల్లో పెరిగిపోతున్న మొండిబకాయిల వల్ల బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లు బలహీనపడతాయన్నారు. డిమాండ్‌కు తగ్గట్లు బ్యాంకుల్లో పెద్ద మొత్తంలో రుణాలు ఇస్తే.. దేశ ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడినపడుతుందని ఆయన పేర్కొన్నారు.

మిగిలిన అంశాల విషయానికి వస్తే ప్రైవేట్ పెట్టుబడులు ప్రోత్సహించాలని కోరారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రైవేట్ పెట్టుబడులు జోలికి ప్రభుత్వం పోలేదన్నారు. పెట్టుబడులపై వ్యయం తగ్గించడానికి వడ్డీరేట్లను తగ్గించాలని.. కొన్ని రంగాల్లో ప్రైవేట్ రంగాన్ని కూడా అనుమతించాలని.. ఉదాహరణకు రైల్వే పనులన్నీ ప్రభుత్వమే చేపడుతోందని... ప్రైవేట్ రంగానికి కూడా అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఇక్కడ ప్రైవేట్ రంగాన్ని భాగస్వాములుగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ మార్కెటింగ్, ప్రాసెసింగ్ అంశాల్లో ప్రైవేట్ రంగాన్ని భాగస్వాములుగా చేసుకోవాలని ఆయన వివరించారు.

2019 వృద్ధిరేటు 7.6 శాతం
క్రిసిల్ రేటింగ్ అంచనా

పెద్దనోట్ల రద్దు, జీఎస్టి అమలు, వ్యవసాయరంగం బలహీనపడ్డంతో ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు మందగిస్తుందని ఇప్పటికే పలు రేటింగ్ ఏజెన్సీలతో పాటు ఆర్థికవేత్తలు ముందస్తు అంచనాలు వేశారు. అయితే క్రిసిల్ రేటింగ్ మాత్రం వచ్చే ఆర్థికసంవత్సరం 2018-19లో జీడీపీ వృద్ధిరేటు 7.6శాతానికి ఎగబాకుతుందని సోమవారం నాడు విడుదల చేసిన ఒక నివేదికలో పేర్కొంది.

కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ) శుక్రవారం నాడు ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీవృద్ధిరేటు 6.5 శాతానికి దిగివస్తుందని, నాలుగు సంవత్సరాల కనిష్ఠానికి దిగివస్తుందని అంచనా వేసిన తర్వాత క్రిసిల్ తాజాగా నోట్ విడుదల చేయడం గమనార్హం. వచ్చే ఆర్థికసంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7.6 శాతానికి ఎగబాకుతుందని.. దీనికి ప్రధాన కారణం ఈ ఆర్థిక సంవత్సరం 2018లో లో బేస్ అని స్పష్టం చేసింది. లో బేస్‌తో పాటు జీఎస్టి అమల్లో ఉన్న ఇబ్బందులన్నీ తొలగిపోతాయని.. ప్రైవేట్ వినియోగం కూడా పుంజుకుంటుంది కాబట్టి వచ్చే ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటు 7.6 శాతానికి ఎగబాకుతుందని అంచనా వేస్తున్నామని తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రైవేట్ వినియోగం 6.3 శాతానికి చేరితే ... 2017లో హై బేస్‌తో 8.7 శాతం వృద్ధిరేటు సాధించిందని..జీడీపీలో ప్రైవేట్ వినియోగం 55.7 శాతం ఆక్రమించిదని నివేదికలో పేర్కొంది. (లో బేస్ అంటే... పెద్దనోట్ల రద్దుతో చిన్న చితకా వ్యాపారాలు బాగా దెబ్బతిన్నాయి.. అటు తర్వాత జీఎస్టి అమల్లోకి వచ్చింది. దాని ప్రభావం కూడా చిన్న వ్యాపారాలపై కనిపించింది. ప్రస్తుతం.. పెద్దనోట్ల రద్దు సమస్య తీరిపోయింది. జీఎస్టి గాడిలో పడింది.. కాబట్టి జీడీపీ వృద్ధిరేటు పెరగడానికి చిన్న చితకా వ్యాపారాలు కూడా తమ వంతు చేయూతనిస్తాయని చెప్పుకోవచ్చు). వచ్చే ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు వినియోగం ఆధారితంగా ఉంటుందని .. ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుంది. అదే సమయంలో ఇవి వృద్ధిరేటు పెరగడానికి తోడ్పడతాయని.. దీంతో పాటు వడ్డీరేట్లు కూడా అందుబాటులో ఉంటాయని, ప్రభుత్వం ఏడవ వేతన కమిషన్ సిఫారసులను తమ ఉద్యోగులకు అమలు చేస్తే వృద్ధిరేటు పెరగడానికి దారి తీస్తుందని, ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై దృష్టిపెట్టి పెద్దమొత్తంలో వ్యయంచేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా గాడిన పడుతుందని నివేదికలో వివరించింది. దీంతో పాటు కేంద్రప్రభుత్వం బ్యాంకులకు రూ.2.11లక్షల కోట్ల మూలధనం సమకూరస్తామని ప్రకటించడం కూడా వృద్ధిరేటు పుంజుకోవడానికి చేయూతనిచ్చినట్లవుతుందని క్రిసిల్ నివేదికలో వివరించింది.

బాండ్ల ద్వారా రెండు బి.డాలర్ల సేకరణ




న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగానికి చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విదేశాల్లో వ్యాపార కార్యకలపాలను విస్తరించుకునేందుకు బాండ్లతో పాటు ఇతర కన్వెర్టబుల్ కరెన్సీ బాండ్లను జారీ చేసి వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల్లో రెండు బిలియన్ డాలర్లు లేదా రూ.12,600 కోట్లు సేకరిస్తుంది. బ్యాంకు ఎగ్జిక్యూటివ్ కమిటితో పాటు సెంట్రల్ బోర్డు దీర్ఘకాలిక ప్రాతిపదికన ఒకసారి / లేదా పలు మార్లు రెండుబిలియన్ డాలర్లు సేకరించడానికి అనుమతించిందని ఎస్‌బీఐ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఎస్‌బీఐ బాసిల్-3 మూలధనం నిబంధనలకోసం వివిధ మార్గాల ద్వారా నిధులు సేకరిస్తోంది. గత నెలలో బ్యాంకు బోర్డు రూ.8వేల కోట్లు సేకరించడానికి అనుమతించింది. వాటిలో మసాలా బాండ్లు కూడా ఉన్నాయి. కాగా ఈ నిధులు మార్చి 2018 వరకు సేకరించడానికి సమయం ఉంద ని తెలిపింది. బీఎస్ఈలో దీని షేరు 0.44 శాతం పెరిగి రూ.307.55 వద్ద ముగిసింది. కాగా బ్యాంకులన్నీ మార్చి 2019 నాటికి బాసిల్ -3 నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో ఈ ప్రమాణాలనే పాటిస్తున్నాయి.

జీడీపీ వృద్ధిలో భాగస్వామ్యులు కావాలి

• ఐటీ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జీడిపి 8శాతం వృద్ధిలో ఎటువంటి తడబాట్లు లేకుండా ఉండేందుకు పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య పెట్టుబడులను ఆకర్శించంతోపాటు అధిక సామర్థ్యంతో సేవలను అందించే ప్రమాణాలను పెంచు కోవాలని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. ఆర్థిక వ్యవస్థకు పి పిపి ప్రాజెక్టులు చాలా ఖరీదైనవని, పేదలకు అందుబాటులో ఉండవని తొలుత భావించారని, కానీ బహిరంగ బిడ్డింగ్ పోటీలలో పిపిపి ప్రాజె క్టులుఎంపిక చేయబడుతున్నాయని, ప్రజల ప్రయోజనాలను కాపాడుకునేందుకు ప్రభుత్వం నిర్మాణాత్మక పర్యవేక్షణతో పనిచేయాలని ఆయన సూచించారు. సోమవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులకు పిపిపిపై శిక్షణా కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. పారదర్శకతతో ప్రాజె క్టుల రూపకల్పన, నైపుణ్యంతో నిర్మాణాలు, ప్ర భుత్వ ప్రాజెక్టు లు విజయవంతంగా తీరం చేరతాయని, ఇందుకు పిపిపి విధా నం మెరుగైందని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబా ద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు, హైటెక్ సిటీ, కన్వెన్షన్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్, మైండ్ స్పేస్ ఐటీ పార్కు, హైదరాబాద్ మెట్రో రైల్ వంటి అనేక ప్రాజెక్టులను ఇరు తెలుగు రాష్ట్రాలు అద్భుతంగా సొంతం చేసుకున్నాయన్నారు. పిపి పి ప్రాజెక్టులను చేపట్టేందుకు అటవీ, పర్యావరణ రంగాల్లో భారీ సామర్థ్యం ఉందని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేసన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, ఎండీ చందర్ మిత్రా అన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ గౌతమ్ పింగ్లే, అసోసియేట్ ప్రొఫెసర్ గోవింద్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీవీకేకి నవీముంబై ఎయిర్‌పోర్ట్

• నిర్మాణం ఒప్పందంపై సంతకాలు



ముంబై : నవీముంబైలో రూ.16వేల కోట్లతో నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టుకు జీవీకె పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (జీవీకెపీఐఎల్) .. సోమవారం నాడు సిటి అండ్ ఇండస్ట్రియల్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్‌తో సోమవారం నాడు కన్సెషన్ ఒప్పందం కుదుర్చుకుందని అధికారులు తెలియజేశారు. ఈ ఒప్పందం ప్రకారం నవీముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్ఎంఐఎఎల్).. సిడ్కోతో ప్రత్యేకంగా స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రాజెక్టు ఎలా అమలు జరుగుతుందో మహారాష్ట్రప్రభుత్వంఆధ్వర్యంలోని ఈ నోడల్ అథారిటీ చూస్తుంది. ఆ ప్రాజెక్టులో జీవీకెపీఐఎల్‌కు చెందిన అనుబంధ సంస్థ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 74 శాతం మిగిలిన 26 శాతం వాటా సిడ్కోకు లభిస్తుంది. ప్రారంభంలో కన్సెషన్ గడువు 30 సంవత్సరాలపాటు ఉంటుంది. అటు తర్వాత దీన్ని మరో పది సంవత్సరాల పాటు పొడిగిస్తారు. ఈ ప్రాజెక్టు ఒప్పందాలు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఎంఐఎల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జీవీకె రెడ్డితో పాటు సిడ్కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భూషన్ గగ్రాణిలో సమక్షంలో జరిగాయి. ఈ సందర్భంగా రెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు జీవీకెకు దక్కడం పట్ల రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికే ముంబై ఎయిర్‌పోర్టు నిర్మించి పలు అవార్డు దక్కించుకుందన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, సిడ్కోతో పాటు ఇతర భాగస్వాముల మద్దతుతో కంపెనీ ముంబై, నవీముంబై అవసరాలకు తగ్గట్లు అత్యాధునిక విమానాశ్రమయం నిర్మించి ఇస్తామని రెడ్డి చెప్పారు. జీవీకెపిఐఎల్ అనుబంధం సంస్థ ఎంఐఎల్ నవీముంబై అంతర్జా తీయ విమానశ్రయం ప్రాజెక్టు ఫిబ్రవరి 2017లో జరిగిన బిడ్డింగ్‌లో విజేతగా నిలిచింది. కాగా సిడ్కోనుంచి గతేడాది అక్టోబర్ 25న లెటర్ ఆఫ్ అవార్డును జీవీకె ఐపీఎల్‌కు అప్పగించింది. కాగా ఎన్ఐఎంఐఎల్ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు నవీ ముంబైలో 1,160 హెక్టార్లలో నిర్మించనున్న ఈ విమానాశ్రయం పీపీపీ పద్ధతిలో నిర్మిస్తారు. కాగా ఈ ప్రాజెక్టు ముందుస్తు అభివృద్ధి పనులకు గాను అయ్యే వ్యయాలను సిడ్కో వెచ్చిస్తుంది. తర్వాత వాటిని జీవీకే నుంచి రాబట్టుకుం టుంది. దీంతో పాటు ఈ మెగా ప్రాజెక్టుపై వచ్చే వార్షిక రెవెన్యూలో 12.6 శాతం వరకు సిడ్కోకు వాటా లభిస్తుంది. ప్రస్తుతం జీవీకె ముంబై ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్టు లిమిటె డ్‌ను నిర్వహిస్తోంది. ఈ ప్రాజెక్టు దక్కించుకోడానికి ప్రధాన కారణం. వార్షిక రెవెన్యూ పంపకంలో జీవీకె 12.6 శాతం వాటా ఇస్తామని ముందుకొస్తే.. జీఎంఆర్ 10.44 శాతం కోట్ చేయడమే. ప్రస్తుతం జీవీకె చేతిలో రెండు అతి పెద్ద విమానాశ్రయ ప్రాజెక్టు లున్నాయి. కాగా జీవీకె రెడ్డి తమ ఎయిర్ పోర్ట్ వ్యాపారాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళతామని ఈ సందర్భంగా అన్నారు.

ఆటో ఎక్స్‌పో - 2018
ఫిబ్రవరి 9-14 వరకు



• మారుతి టాటామోటర్స్ కార్ల ప్రదర్శన

న్యూఢిల్లీ : వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న ఆటో ఎక్స్‌పోలో దేశంలోని ఆటో కంపెనీలు తమ తమ ప్రాడక్టులను ప్రదర్శనకు ఉంచుతాయి. దేశంలోని అతి పెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి కాంపాక్ట్ కార్లను ఎస్‌యూవీ మోడల్స్‌గా తీసుకొచ్చి ప్రదర్శనకు ఉంచుతామని చెబుతోంది. కొత్తగా దీనికి కాన్సెప్ట్ ఫ్యూచర్ ఎస్ పేరుతో కొత్త కాన్సెప్ట్‌తో తీసుకొస్తుంది. ఈ కారు మొత్తానికి ఎస్‌యూవీ లాగానే ఉంటుంది. దీని ఫీచర్లు కస్టమర్లకు బాగా ఆకర్షిస్తాయని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. దీని గురించి మారుతి సుజుకి ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజినీరింగ్)సీవీ రామన్ వివరిస్తూ.. యుటిలిటి వాహనాలకు రోజు రోజుకు డిమాండ్ పెరుగుతోందని.. దీన్ని డిజైన్‌ను మరింత ఆకర్షణీయంగా తయారు చేయడానికి తమ బృందం అధ్యయనం చేస్తోందన్నారు. భవిష్యత్తులో కాంపాక్ట్ కార్లను యూవీ కార్లుగా తీర్చుదిద్దుతామని ఆయన అన్నారు. సంప్రదాయ కాంపాక్ట్ కారుస్థానంలో కాన్సెప్ట్ ఫ్యూచర్ ఎస్ కార్లు వస్తాయన్నారు. ఎత్తైన సీట్లు, గ్రౌండ్ క్లియరెన్స్ తదితర అంశాలపై దృష్టిపెడతామని ఆయన వివరించారు. మారుతి సుజుకికి చెందిన కాంపాక్ట్ ఎస్‌యూవీలు బ్రెజ్జా విజయం సాధించడంతో పాటు రెనో ఎంట్రీ లెవెల్ కారు క్విడ్ విజయం సాధించడంతో మరింత ఉత్సాహంతో కొత్త యుటిలిటి వాహనాలపై దృష్టి పెడుతున్నామని రామన్ అన్నారు.

టాటామోటార్స్ నుంచి 26 వాహనాలు ప్రదర్శనకు

దేశీయ ఆటో దిగ్గజం టాటామోటార్స్ కూడా వచ్చే ఆటో ఎక్స్‌పోలో మొత్తం 26 వాహనాలను అవి ప్యాసింజర్ కార్లతో పాటువాణిజ్య వాహనాలను ప్రదర్శనకు ఉంచుతామంటోంది. ఈ ప్రదర్శనలో గ్లోబల్ ప్రిమియర్ మోడల్స్‌తో పాటు కొత్తగా డిజైన్ చేసిన ప్యాసింజర్, వాణిజ్య వాహనాలను ప్రదర్శనకు ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్రప్రభుత్వం స్మార్ట్ సిటిలకుపెద్దపీట వేస్తున్నందున దానికి తగ్గట్లు వాహనాలను రూపుదిద్ది అందుబాటులో ఉంచుతామని పేర్కొంది.

టాటామోటార్స్ సీఈవో, ఎండీ గుంటేర్ బట్స్‌చెక్ మాట్లాడుతూ గత ఏడ దశాబ్దాల నుంచి కంపెనీ గ్లోబల్ మార్కెట్లోఅందుబాటులో కొచ్చిన వినూత్నమైన కార్లను దేశీయ కస్టమర్లకు అందించామన్నారు. ప్రభుత్వం స్మార్ట్‌సిటి కాన్సెప్ట్‌కు మద్దతు ఇస్తూ.. ఆటో ఎక్స్‌పోలో తాము కూడా స్మార్ట్ మొబిలిటి.. స్మార్ట్ సిటీస్ పేరుతో స్టాల్‌ను ఏర్పాటు చేసి కస్టమర్లకు భవిష్యత్తులో టాటామోటార్స్ నుంచి రానున్న వాహనాలపై అవగాహన కలిగిస్తామని ఆయన చెప్పారు. ప్యాసింజర్ విభాగంలో ఇంఫాక్ట్ డిజైన్ 2.0తో పాటు వాణిజ్య వాహనాల విషయానికి వస్తే ..కొత్త డిజైన్‌తో పాటు బలమైన, నాణ్యమైన వాహనాలను ప్రదర్శనకు ఉంచుతామని ఆయన అన్నారు.

మళ్లీ నంబర్ వన్ బెంజ్!

• 2017లో 15,330 యూనిట్లు విక్రయం



న్యూఢిల్లీ: దేశీయ లగ్జరీ కార్ల విక్రయాల్లో మెర్సిడెజ్ బెంజ్ 2017లో కూడా తన హవాను కొనసాగించింది. వరుసగా మూడో సంవత్సరం తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మార్కెట్లో దీనికి పోటీ కంపెనీలైన బీఎండబ్ల్యు, ఆడిలను వెనక్కి నెట్టింది. మొత్తానికి గతేడాది మెర్క్ 15,330 యూనిట్లు విక్రయించి మళ్లీ నెంబర్‌వన్‌గా నిలిచింది. 2016లో 13,231 యూనిట్లు విక్రయించింది.... దీంతో పోల్చుకుంటే గతేడాది అమ్మకాలు 15.86 శాతం పెరిగాయి. కంపెనీ పెద్దమొత్తంలో కొత్త మోడల్స్‌ను మార్కెట్లో తేవడంతో అమ్మకాలు పెంచుకోవాడానికి వీలైంది. లేదంటే అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉండవేని ఆటో రంగానికి చెందిన వారు చెబుతున్నారు.

బీఎండబ్ల్యు గ్రూపు 2017లో 9,800 యూనిట్లు విక్రయిస్తే 2016లో 7,861 యూనిట్లు విక్రయించింది. ఇక ఆడి విషయానికి వస్తే గతేడాది 7,876 యూనిట్లు విక్రయిస్తే.. అంతకు ముందు ఏడాది 7,720 యూనిట్లు విక్రయించింది. అమ్మకాల్లో కేవలంరెండు శాతం మాత్రం వృద్ధి కనిపించింది. టాటామోటార్స్‌కు చెందిన జాగ్వార్ అండ్ ల్యాండ్ రోవర్ అమ్మకాలు గతేడాది 3,954 యూనిట్లు కాగా.. 2016లో 2,653 యూనిట్లు, అమ్మకాల్లో 49శాతం వృద్ధి కనిపించింది. గతేడాది ఆటో పరిశ్రమకు గడ్డుకాలమని, మంచి అవకాశాలు కూడా కోల్పోయామని, అయినా 15,330 యూనిట్లు విక్రయించి రికార్డు సాధించామని మెర్సిడెజ్ బెంజ్ ఇండిమా మేనేజింగ్ డైరెక్టర్ సీఈవో రోలాండ ఫోల్గార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జీఎస్టి అమల్లోకి తెచ్చిన తర్వాత లగ్జరీ కార్లపై పలు మార్లు పన్ను రేట్లు మార్చుతూపోయిందన్నారు. జీఎస్టి అమల్లోకి తెచ్చిన తర్వాత లగ్జరీ కార్లపై 28 శాతంతోపాటు 15 శాతం సుంకంగా నిర్ణయించారు. తర్వాత సుంకాన్ని సవరించి మరో 5 శాతం 7 శాతం సెప్టెంబర్‌లో పెంచారన్నారు. గతేడాది జులై, ఆగస్టులో పన్నులు తగ్గించడం వల్ల అమ్మకాలు పెంచుకున్నామని ఫోల్గార్ అన్నారు. లగ్జరీ కార్ల మార్కెట్‌లో మెర్క్ 40 శాతం వాటా దక్కించుకుందన్నారు. మర్సెడెజ్‌కు చెందిన అన్నీ కార్ల విభాగాలు వాటిలో ఎస్‌యూవీల నుంచి ఎఎంజీ వరకు అమ్మకాలు రెండంకెలు దాటాయని ఆయన అన్నారు. కొత్తగా పెద్ద చక్రాల ఈ - క్లాస్‌కు మంచి స్పందన లభించిందన్నారు. సీ- క్లాస్, ఈ-క్లాస్, ఎస్‌యూవీల అమ్మకాలు జోరుందుకున్నాయని ఆయన వివరించారు. ఈ ఏడాది కూడా అమ్మకాలు బాగుంటాయని ఆశిస్తున్నానన్నారు. వచ్చే నెల ఢిల్లీలో జరగబోయే ఆటోఎక్స్‌పోలో మెర్సిడెజ్ మేబాచ్ ఎస్ 650 తో పాటు ఎఎంజీ ఫోర్టుపోలియోలోని కొత్త ప్రాడక్టులను ప్రదర్శనకు ఉంచుతామని ఫోల్గార్ వివరించారు.

ఇండిగో డిస్కౌంట్ ఆఫర్

• ప్రారంభ ధర రూ. 899



హైదరాబాద్ : చౌకరకం విమానయాన సంస్థ ఇండిగో ఎయిర్‌లైన్స్ ఎంపిక చేసిన రూట్లలో కొత్త సంవత్సరం కానుకగా మూడు రోజుల పాటు డిస్కౌంట్ సేల్‌ను అందుబాటులో ఉంచింది. సోమవారం నుంచి అమల్లోకి వస్తున్న ఈ స్కీం ద్వారా టిక్కెట్లు కొనుగోలు చేసిన వారు ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 15 మధ్యలో తమ ప్రయాణాలు ఉండేలా ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుందని కంపెనీ వెబ్‌సైట్‌లో పేర్కొంది. డిస్కౌంట్ సేల్ ద్వారా కొనుగోలు చేసిన టిక్కెట్లు తర్వాత రద్దుచేసుకుంటే రీఫండ్‌లు ఇవ్వరు. దీంతో పాటు గ్రూపు బుకింగ్‌లను అనుమతించరు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు క్రెడిట్‌కార్డుల ద్వారా టిక్కెట్లు కొనుగోలు చేస్తే 10 శాతం క్యాష్‌బ్యాక్ ఆఫర్ చేస్తోంది. గరిష్ఠంగా ఇది రూ.600 వరకు మాత్రమే. ఢిల్లీ - చండీఘడ్ టిక్కెటు ధర రూ.899, ఢిల్లీ - జైపూర్ టిక్కెల్లు రూ.999, ఢిల్లీ - అమృతసర్ టిక్కెట్ ధర రూ.1,099గా నిర్ణయించారు. ఆదివారం నాడు ఇండిగో తిరుపతి - హైదరాబాద్ విమానసర్వీసులు ప్రారంభించిన విషయం తెలిసిందే.

ఎన్ఎండీసీ షేరు రూ. 153.5కు విక్రయం

హైదరాబాద్ : కేంద్రప్రభుత్వం ఎన్ఎండీసీలో పెట్టుబడుల ఉపసహంరణకు శ్రీకారం చుట్టింది. మంగళవారం నాడు 1.5 శాతం వాటాలను విక్రయించనుంది. ఒక్కో షేరు రూ.153.5కు అందుబాటులో ఉంచింది. ఒక వేళ ఒవర్‌సబ్‌స్క్రైబ్ అయితే అదనపు సొమ్మును తమ వద్దనే ఉంచుకునే వెసులుబాటు కల్పించుకుంది. రెండు రోజుల పాటు జరిగే ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా మంగళవారం నాడు ఇన్సిస్టిట్యూషన్ ఇన్వెస్టర్లకు, బుధవారం నాడు రిటైల్ ఇన్వెస్టర్ల కోసం అందుబాటులో ఉంచుతారు. 1.5 శాతం వాటాలను విక్రయించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.750 కోట్లు సమకూరుతాయని ప్రభుత్వవర్గాలు తెలియజేశాయి. ఫ్లోర్ ధర రూ.153.50కి విక్రయిస్తే .. ప్రస్తుతం మార్కెట్లో రూ.161.85 వద్ద ట్రేడ్ అవుతోంది. సుమారు ఐదు శాతం వరకు డిస్కౌంట్‌కు షేర్లను ఆఫర్ చేస్తోంది. కాగా ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ఈ ఆర్థికసంవత్సరం రూ.72,500 కోట్లు సేకరించాలనుకుంది. అయితే ఇప్పటి వరకు రూ.52,500 కోట్లు సేకరించింది.

మార్కెట్లు రికార్డుల జోరు..!

• బడ్జెట్ అంచనాలపై మదుపరుల నజర్ • విదేశీ ఇన్వెస్టర్ల భారీ కొనుగోళ్లు

ముంబై : స్టాక్ మార్కెట్లు సోమవారం నాడు సరికొత్త రికార్డుకు చేరాయి. త్వరలోనే ప్రారంభం కాబోతున్న క్యూ3 ఫలితాలతో పాటు బడ్జెట్‌పై దృష్టిపెట్టిన మదుపరులు పెద్దెత్తున కొనుగోళ్లకు పాల్పడ్డారు, ముఖ్యంగా ఐటి, క్యాపిటల్‌గూడ్స్, హెల్త్‌కేర్, మెటల్ రంగానికి చెందిన షేర్లను దేశీయ, విదేశీ ఇన్వెస్టర్లు పెద్దెత్తున కొనుగోళ్లు చేయడంతో సూచి సరికొత్త రికార్డులను బద్దలు కొట్టింది. ఇంట్రాడేలో రికార్డు స్థాయికి 34,385.67 పాయింట్లకు ఎగబాకింది. గతంలోని రికార్డు 34,188.85 పాయింట్లను దాటిపోయింది. అయితే మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డంతో సూచి 198.44 పాయింట్లు లాభపడి 34,352.79 వద్ద స్థిరపడింది. మొత్తానికి ఇదే ఆల్‌టైం హైగా చెప్పుకోవచ్చు. నిఫ్టీ కూడా అదే స్థాయిలో జోరందుకుంది. 64.75 పాయింట్లు లాభపడి 10,623.60 వద్ద ముగిసింది. గత రికార్డు 10,558.85 రికార్డును బద్దలు కొట్టిందని చెప్పుకోవచ్చు. మొత్తానికి స్టాక్ మార్కెట్లు జోరందుకోవడానికి ప్రధాన కారణం రాబోయే క్యూ3 ఫలితాల సీజన్‌లో కార్పొరేట్ ఫలితాలు అనుకూలంగా ఉంటాయన్న అంచనా. కేంద్ర గణాంకాల కార్యాలయం ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ అంచనా తగ్గించినా దాని ప్రభావం మార్కెట్లపై కనిపించలేదు. విదేశీ ఫోర్టుపోలియో ఇన్వెస్టర్లు కొత్త సంవత్సరం నుంచి మార్కెట్లో పెద్దమొత్తంలో పెట్టుబడులు పెడుతున్నాయి. గత శుక్రవారం నాడు విదేశీ ఇన్వెస్టర్లు రూ.581.43 కోట్ల షేర్లను కొనుగోలు చేస్తే, దేశీయ ఇన్వెస్టర్లు రూ.243.13 కోట్ల షేర్లు కొనుగోలు చేశాయని స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఎల్‌అండ్‌టి 1.80 శాతం లాభపడింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి రూ.2,265 కోట్ల ఆర్డరు దక్కించుకుంది.


లాభపడిన ఇతర షేర్ల విషయానికి వస్తే హీరోమోటో కార్ప్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, ఐటీసీ లిమిటెడ్, హిందుస్తాన్ యూనీలీవర్, హెచ్‌డీఎఫ్ లిమిటెడ్, విప్రో, టాటామోటార్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంకు, ఎంఅండ్ఎం, కొటక్ బ్యాంకు, మారుతి సుజుకి, ఎస్ బ్యాంకు, పవర్ గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు 1.37 శాతం వరకు లాభపడిన వాటిలో ఉన్నాయి. వీటికి వ్యతిరేకంగా నష్టపోయిన షేర్లు భారతి ఎయిర్‌టెల్, ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐ, టాటాస్టీల్, అదానీ పోర్ట్స్, డాక్టర్ రెడ్డీస్ షేర్లపై మదుపరులు లాభాలస్వీకరణకు పాల్పడ్డంతో షేర్లు కిందికి దిగివచ్చాయి. అత్యధికంగా ఐటి సూచి 1.40 శాతం, క్యాపిటల్‌గూడ్స్ 1.22శాతం, హెల్త్‌కేర్ 1.20శాతం, రియల్టీ 0.87 శాతం, మెటల్ 0.78 శాతం, ఎఫ్ఎంసీజీ 0.78 శాతం, చమురు సహజవాయువు 0.67 శాతం, టెక్ 0.66 శాతం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 0.39 శాతం లాభపడిన వాటిలో ఉన్నాయి. టెలికం 2.64 శాతం నష్టాన్ని చవిచూసింది.





ఓ.డి.తో రాష్ట్ర బడ్జెట్ ఎన్నాళ్ళు ?

• ఆర్థిక క్రమశిక్షణ హుళక్కే
• రిజర్వు బ్యాంకు నిబంధనలూ ఖాతరు చేయరా? • ఆర్థికశాఖపై పీఏసీ మండిపాటు
• తీరు మార్చుకోవాలంటూ హెచ్చరిక



అమరావతి, ఆంధ్రప్రభ : గత మూడు సంవత్సరాలుగా రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, వరుసగా మూడు ఆర్థికసంవత్సరాలలోనూ లెక్కలు తెలపకుండా కాలయాపన చేస్తున్నారని ఏపీ శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ మండిపడింది. ఈ విషయమై పలుమార్లు అధికారులను ప్రశ్నించినప్పటికీ సరైన ఫలితం లేకుండా పోతోందని పేర్కొంది. పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ అధ్యక్షతన సోమవారం అసెంబ్లీ కమిటీ హాలులో సమావేశం జరిగింది. రాష్ట్ర ఆర్థికపరిస్థితిపై సమీక్షించింది. పీఏసీ సభ్యులతో పాటు కంప్ట్రోలర్ ఆఫ్ ఆడిట్ జనరల్, ఆర్థికశాఖ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో సంబంధిత అధికారుల నుంచి సరైన సమాధానాలు రాకపోవడాన్ని పీఏసీ గర్హించినట్టు సమాచారం. రాష్ట్రంలో ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిందేనని, ఇప్పటికైనా తీరు మార్చుకోవాల్సిందేనని సభ్యులు హెచ్చరించారు. నిత్యం రాష్ట్రం ఓ.డి.లతోనే కాలయాపన చేస్తుండటం విడ్డూరంగా వుందని పేర్కొన్న సభ్యులు ఇది ఇంకెంతో కాలం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 30,000 కోట్ల రూపాయల ఓ.డి. లో వుండటంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధంగా ఆర్థిక పరిస్థితి కొనసాగడం అనైతికమని కూడా వారు పేర్కొన్నారు. రిజర్వు బ్యాంక్ నిబంధనల ప్రకారం రోజూ రెండు కోట్ల రూపాయలకు తగ్గకుండా బ్యాంకులో నిల్వలు వుండాలని, కానీ 2015-16 వ ఆర్థిక సంవత్సరం నుంచి ఆ పరిస్థితి కొనసాగడం లేదని సభ్యులు మండిపడగా, ఆర్థిక శాఖ అధికారుల నుంచి సమాధానం లేకుండా పోయిందని సమాచారం. 267 రోజులపాటువరుసగా ఓవర్‌డ్రాఫ్ట్ వుండడాన్ని సభ్యులు ఆక్షేపించారు. జీరో ఆధారిత బడ్జెట్ అని చెబుతూనే పీడీ ఖాతాలలో దాదాపు 20,000 కోట్ల రూపాయలు మగ్గుతున్నా పట్టించుకోవడంలేదని పిఏసీ సభ్యులు వ్యాఖ్యానించారు. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్ర ఖర్చు, ఆదాయానికి సంబంధించిన వివరాలను ప్రవేశపెట్టడం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై మరిన్ని గడువులు ఇవ్వడుచుకోలేదని పేర్కొన్నారు. కాగ్ అధికారులు కూడా ఈసమావేశంలో ఆర్థికశాఖ అధికారులపై ప్రశ్నలను సంధించినప్పటికీ సరైన సమాధానం ఇవ్వలేదని తెలిసింది. ఒకవైపు బిజినెస్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, మరోవైపు కాగ్ అధికారులు నిలదీసిన నేపథ్యంలో ఆర్థిక శాఖ అధికారుల నుంచి నిర్దిష్టమైన సమాధానం రాకపోవడాన్ని సభ్యులు సైతం తీవ్రంగా పరిగణిస్తున్నారు.

హాజరు కాని ప్రిన్సిపల్ సెక్రెటరీ

పీఏసీ సమావేశానికి రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రవిచంద్ర హాజరు కాలేదు. జన్మభూమి కార్యక్రమాలలో పాల్గొంటుండటం వల్ల ఆయన ఈ సమావేశానికి రాలేకపోయారు. అదే విధంగా కార్యదర్శి హేమా మునివెంకటప్ప కూడా జన్మభూమి కార్యక్రమాల నేపథ్యంలో పాల్గొనలేదు.ముఖ్యమైన అధికారులు పాల్గొనకపోవడంతో కింది స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సమాధానం ఇవ్వలేకపోయారని సమాచారం. పిఏసి సభ్యులతో పాటు ఈసారి జరిగిన సమావేశంలో కాగ్ అధికారుల ప్రశ్నలతో ఆర్థిక శాఖ అధికారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారని తెలుస్తోంది. ఈ సమావేశంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు ఆదిమూలపు సురేష్, పిల్లి సుభాష్ చంద్రబోస్, కొండపల్లి అప్పలనాయుడు, దాడిశెట్టి రాజాతో పాటు కాగ్ అధికారులు, ఆర్థిక శాఖకుచెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సమావేశం

ఈ నెల 9వ తేదీన మంగళవారం ఉదయం 10.30 గంటలకు మునిసిపల్ శాఖలో జరిగిన అవకతవకలపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరుగుతుంది. బిఏసి చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ అధ్యక్షత విహిస్తారు. ఈ సందర్భంగా జరిగే సమావేశానికి ఆర్థిక శాఖతో పాటు మునిసిపల్ శాఖకు చెందిన అధికారులను సైతం ఆహ్వానించారు.

ఆర్థిక పరిపుష్టిలో ప్రభుత్వ రంగ సంస్థలే కీలకం

• ఎంపీ కంభంపాటి హరిబాబు

విశాఖపట్నం, ప్రభ న్యూస్: భారత దేశ సర్వతోముఖాభివృద్ధిలో ప్రభుత్వ రంగ సంస్థలు అత్యంత కీలకమైన భూమిక పోషిస్తున్నాయని విశాఖ పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు భావించారు. ఇక్కడి హెచ్‌పీసీఎల్ సహకారంతో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో పరిశ్రమల్లో స్వతంత్ర డైరెక్టర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి పనితీరు మెరుగుకు విశాఖపట్నంలో సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ హరిబాబు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మొత్తం 244 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నాయన్నారు. ఇవి గత ఏడాది రూ. లక్షా పదహేను వేల కోట్ల రూపాయల లాభాలను ఆర్జించాయని ఆయన వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న పరిశ్రమల అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తున్న వ్యక్తిగత సంచాలకులైన వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. వీరి పనితీరును ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవడం కోసం కేంద్ర భారీ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఇతర దేశాల్లో లెహమాన్ బ్రదర్స్, మన దేశంలో సత్యం కంప్యూటర్స్ సమస్యలు నెలకొన్న నేపథ్యంలో స్వతంత్ర డైరెక్టర్ల పాత్ర విశేషంగా చర్చ జరిగిందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలోనే స్వతంత్ర డైరెక్టర్ల పనితీరు మెరుగుకు వర్కుషాప్ నిర్వహణ ప్రధాన అంశం అయ్యిందన్నారు. మొత్తం 30 సంస్థలకు చెందిన 36 మంది ఇండిపెండెంట్ డైరెక్టర్లు కార్యక్రమంలో పాల్గొన్నట్లుగా ఎంపీ హరిబాబు వెల్లడించారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వమేనని ఈ సందర్భంగా హరిబాబు స్పష్టం చేశారు. లాభాల్లో ఉండే సంస్థలను ఎట్టిపరిస్థితుల్లోనూ కేంద్రం వదులుకోదని చెబుతూ అలాంటి సంస్థలకు ప్రయివేటీకరణ వర్తించదని అన్నారు. ప్రత్యేకహోదా గురించి ఆయన మాట్లాడుతూ ఇంకా ఆ అంశం చర్చల్లోనే ఉందన్నారు. ప్రత్యామ్నాయంగా ప్రత్యేక పాకేజీని కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని కూడా ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఈడీ ప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బందరు పోర్టు రైతులతో సీఎం భేటీ

• ఎనిమిది గ్రామల నుంచి సచివాలయం చేరుకున్న 250 మంది రైతులు



అమరావతి, ఆంధ్రప్రభ: పెండింగ్‌లో ఉన్న బందరు పోర్టు భూముల సమస్యను పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి 8 గ్రామాలకు చెందిన 250 మంది రైతులు ప్రత్యేక బస్సుల్లో రాత్రి 8 గంటలకు సచివాలయం చేరుకున్నారు. సచివాలయంలోని గ్రీవెన్స్ సెల్‌లో రాత్రి 9.30 ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బందరు పోర్టు భూములరైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. బందరు పోర్టుకు సమీపంలోని తిరువేయిపాలెం, గోపువరం, తపశిపూడి, మంగినపూడి, బుద్దాలపాలెం, చినకర అగ్రహారం, పెదకర అగ్రహారం, మేకవానిపాలెం గ్రామాలకు చెందిన రైతులు ఆరు ప్రత్యేక బస్సుల్లో సచివాలయం రావడం జరిగింది. యువజన క్రీడల సంక్షేమ శాఖామంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో వీరంతా సీఎంతో భేటీ అయ్యారు. పోర్టు భూముల వ్యవహారాలను పరిశీలిస్తే బందరు పోర్టు నిర్మాణానికి తొలుత 33 వేల ఎకరాలు భూమి కావాలని ప్రభుత్వం అంచనా వేసింది. దీనికోసం భూసేకరణ కింద నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో రైతులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పోర్టుకు 6 వేల ఎకరాలు సరిపోతుందని ప్రభుత్వం మరో ప్రకటన చేసింది. దీనిని రాజధాని తరహాలో భూసమీకరణ కింద రైతుల నుంచి సేకరించడానికి ప్యాకేజీని ప్రకటించింది. భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్) కింద రైతుల నుంచి స్పందన కనిపించలేదు. ఇప్పటి వరకు కేవలం 2 వేల ఎకరాలు మాత్రమే సేకరించగలిగారు. ఇంకా మిగిలిన భూమిని సేకరించడంలో జాప్యం జరిగింది. రైతులను ఒప్పించడంలో అధికారులు, నాయకులు విఫలం కావడంతో ముఖ్యమంత్రి స్వయంగా సమస్య పరిష్కరించేందుకు రైతులతో సోమవారం రాత్రి సచివాలయంలో భేటీ అయ్యారు. రైతుల్లో నెలకొన్న సందేహాలను తీర్చేవిధంగా పోర్టు భూముల సమస్యను పరిష్కరించేదిశగా ముఖ్యమంత్రి రైతులతో చర్చలు జరిపారు.

బందర్‌పోర్టుపై కొలిక్కి రాని చర్చలు..
మరోసారి భేటీ కావాలని నిర్ణయం..

అమరావతి, ఆంధ్రప్రభ: బందర్‌పోర్టుకు సంబంధించి ముఖ్యమంత్రితో సోమవారం రాత్రి జరిగిన చర్చలు వాయిదా పడ్డాయి. భూ సేకరణ విషయంలో రైతు ప్రతినిధులకు ముఖ్యమంత్రి మధ్య చర్చ జరిగింది. ఈ క్రమంలో ప్రభుత్వం భూములకు డబ్బులు చెల్లించాల్సిందిగా రైతులు కోరగా ముఖ్యమంత్రి సమ్మతించలేదు. ప్రభుత్వం వద్ద అంత డబ్బు లేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అయితే సగం ల్యాండ్ పూలింగ్, సగం డబ్బులు ఇచ్చే విధంగా ప్రాథమికంగా ఒక అంగీకారానికి రావడం జరిగింది. అయితే కారిడార్‌కు సంబంధించిన అధికారులు రాకపోవడంతో మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో సంక్రాంతి ఆహార పండగ

• ప్రత్యేక వంటకాలు వడ్డించనున్న పర్యాటక శాఖ

అమరావతి, ఆంధ్రప్రభ: సంక్రాంతి వేడుకల్లో భాగంగా సచివాలయం ఉద్యోగులకు ప్రత్యేక తెలుగు వంటకాలను అందిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సచివాలయం ఉద్యోగుల సహకార సంఘ పలహార శాల సహకారంతో నాలుగు రోజులపాటు ఆహార పండుగ జరుగుతుందన్నారు. ప్రతి రోజు ఒక విశేష వంటకం పర్యాటక శాఖ తరుపున భోజనంతో పాటు అందించనున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం రాగి సంకటి, వేరుశెనగ పచ్చడి, బుధవారం దంపుడు బియ్యం పలావ్, కుర్మా, గురువారం మెంతికూర టమాటా అన్నం, కుర్మా, శుక్రవారం బెల్లం పొంగలి, మషాలా వడ సచివాలయం పలహారశాలలో అందించనున్నట్లు తెలిపారు. పర్యాటక శాఖ తరుపున అందించే ఈ వంటకాలకు అదనపు చెల్లింపులు అవసరం లేదన్నారు. రాష్ట్రం ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్‌గా ఉండాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తొలిసారి ఈ తరహా కార్యక్రమాన్ని తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలుగు వంటకాల ప్రాచుర్యానికి పర్యాటక శాఖ చేపట్టిన ఈ అవకాశాన్ని ఉద్యోగులు వినియోగించుకొని సహకరించాలని మీనా కోరారు.

విదేశీయ వస్తువులు వినియోగించొద్దు

• గ్రామాల్లో చేతి వృత్తులను ప్రోత్సహించాల్సిందే
• కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖామంత్రి సంతోష్ గనగ్వర్



విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలంతా వినియోగించుకోవాలని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖామంత్రి సంతోష్ గనగ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం ఇక్కడ ఏయూ మైదానంలో క్రాఫ్ట్ మేళాను కేంద్రమంత్రి సందర్శించి ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. విదేశీయ వస్తువులను వినియోగించవద్దని, స్వదేశీయ వస్తువులను వినియోగించాలని కోరారు. కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలను చిన్న, మద్యతరహా వ్యాపారులు ఉపయోగించుకోవాలన్నారు. పారిశ్రామిక రంగంలో పనిచేస్తున్న ప్రసూతి మహిళలకు ఆరు నెలల పాటు ఇఎస్ఐ ద్వారా జీతాలు, మెటర్నిటి సెలవులు కల్పిస్తున్నామన్నారు. భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరరావు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా పురాతన హస్తకళలను ప్రజలకు చేరువ చేసేందుకు క్రాఫ్ట్ మేళాలు దోహదం చేస్తాయన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పురాతన హస్తకళలు కనుమరుగవుతున్నాయన్నారు. విశాఖ పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ గ్రామీణ కళలను ప్రోత్సహించడమే ధ్యేయంగా ఆయా కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించడమే లక్ష్యంగా క్రాఫ్ట్ మేళా ముఖ్య ఉద్దేశమన్నారు. భాజాపా శాసనసభా పక్షనేత విష్ణుకుమార్‌రాజు, నగర అధ్యక్షులు నాగేంద్ర, విశాఖ పోర్టు ట్రస్టు చైర్మన్ కృష్ణబాబు, హస్తకళల అధికారులు పాల్గొన్నారు.

సివిల్ కేసులో తలదూర్చిన నలుగురు పోలీసు ఆఫీసర్లకు రూ. 14 లక్షల జరిమానా

• తిరుపతి కోర్టు సంచలన తీర్పు

తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: భూ వివాదంలో తలదూర్చి అక్రమంగా కేసులు పెట్టి బాధితులను వేధింపులకు గురిచేసిన ఆరోపణలపై న్యాయస్థానం నలుగురు పోలీసు అధికారులకు 14 లక్షలు జరిమానా విధించంది. రిటైర్ ఏఎస్పీ తిమ్మప్ప, డీఎస్పీ శ్రీకాంత్, డీఎస్పీ నరసింహారెడ్డి, ఎఎస్ఐ బాలమురళి అనే నలుగురు అధికారులకు ఇదే భూ వివాదంలో 2009లో సత్యవేడు కోర్టు మూడు నెలలు జైలుశిక్ష జరిమానా విధించింది. వివరాల్లోకెళితే తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయితీ, ఓటేరు గ్రామంలోని సర్వేనెం. 377 లోని పలువురు రైతులకు చెందిన భూమిపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేశారు. ఈ విషయంలో బాధిత రైతులకు అండగా నిలిచిన న్యాయవాది ఎంఎస్ఎం ప్రసాద్, ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్‌నాయుడుపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి, వేధింపులకు గురిచేశారని వివాదం రేగింది. ఈ భూమిపై కన్నేసిన ప్రత్యర్ధులు ఒత్తిడి మేరకు 2004 అక్టోబర్ 2న రైతుల పక్షాన పోరాడుతున్న ఎంఎస్ఎం ప్రసాద్, చంద్రశేఖర్ నాయుడులపై తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారనే ప్రచారం జరిగింది. అప్పట్లో అధికారులు సివిల్ వివాదంలో జోక్యం చేసుకుని తమను చిత్రవధకు గురిచేశారని ఆరోపిస్తూ బాధితులు ఎంఎస్ఎం ప్రసాద్, చంద్రశేఖర్‌నాయుడులు నలుగురు పోలీసు అధికారులపై తిరుపతి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కోర్టు నలుగురు పోలీసు ఆఫీసర్లపైన వేర్వేరుగా సివిల్, క్రిమినల్ కేసులను నమోదు చేసింది. ఈ నలుగురు పోలీసు ఆఫీసర్లు తిరుపతిలో పనిచేస్తున్నందున తమకు న్యాయం జరగదని బాధితులు జిల్లా కోర్టును ఆశ్రయించగా, క్రిమినల్ కేసును సత్యవేడు కోర్టుకు బదిలీ చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం క్రిమినల్ కేసులో 2009 జూన్ 12వ తేదిన సత్యవేడు కోర్టు తీర్పు చెప్పింది. అప్పట్లో డీఎస్పీలుగా వున్న తిమ్మప్ప, సీఐ నర సింహారెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్, ఎఎస్ఐ బాలమురళిలకు మూడు నెలలు జైలుశిక్ష, రెండువేల రూపాయల చొప్పున అపరాదం విధించింది. ఇదిలా వుండగా సివిల్ కేసులో సోమవారం తిరుపతి సీనియర్ సివిల్ జడ్జి రామచంద్రయ్య, బాధితులు ఎంఎస్ఎం ప్రసాద్, చంద్రశేఖర్‌నాయుడులకు ఒక్కొక్క కేసులో 7 లక్షల చొప్పున రెండు కేసుల్లో 14 లక్షల రూ పాయల నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు. అప్పట్లో బాధిత రైతుల పక్షాన నిలబడి నమాజీ ఎమ్మెల్యే ఎస్పీవినాయుడు ఈ విషయాన్ని అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పోలీసు అధికారులపై ప్ర భుత్వం కూడా బదిలీ వేటు కూడా వేసింది. బాధితులు న్యాయ పోరాటం చేసి విజయం సాధించారు. ఈ కేసులో కోర్టు తీర్పు తిరుపతిలో సివిల్ కేసులలో తలదూర్చే పోలీసులకు హెచ్చరికకా నిలుస్తోంది.

దా'రుణం' ఉసురుతీసింది!

• కళ్యాణదుర్గంలో దంపతుల ఆత్మహత్య

కళ్యాణదుర్గం, ప్రభ న్యూస్: చిన్న చిన్న తగాదాలు, ఆర్థిక ఇబ్బందులు ఓ దంపతుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించింది. ఇరుగుపొరుగు వారు అందచేసిన సమాచారం మేరకు దంపతులు ఎప్పుడూ కలహించుకునేవారు. ఆర్థిక ఇబ్బందులే వారి ఆత్మహత్యకు చెబుతున్నారు. అనంతపురంజిల్లా, కళ్యాణదుర్గం పట్టణంలోని విద్యానగర్‌లో ప్రసన్నకుమార్ (49), భారతి (45) దంపతులు చిన్న చిన్న వ్యాపారాలతోపాటు పిండిమరను ఏర్పాటు చేసుకుని జీవనం సాగించేవారు. వారికి ఒకే ఒక కుమార్తె. ఆమెకు రెండు నెలల క్రితం వివాహం చేశారు. సోమవారం తెల్లవారు జామున కొందరు పిండిమరలో ధాన్యాన్ని వేయించుకునేందుకు వచ్చారు. ఎంత సేపు పిలిచినా సమాధానం రాకపోవడంతో అనుమానం వచ్చి కిటికి నుండి ఇంటిలోకి చూడగా, దంపతులు ఇద్దరు విగతజీవులై ఉండడాన్ని గమనించి, పోలీసులకు సమాచారం అందచేశారు. మృతదేహాలు పడి ఉన్న తీరును బట్టి భార్య భారతి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లు చుట్టూ చెల్లాచెదరుగా పడి ఉన్న మాత్రలను బట్టి తెలుస్తోంది. ప్రసన్నకుమార్ ఇంటి పైకప్పుకు తాడును కట్టి బలవర్మరణం చేసుకున్నాడు. గతంలో సైన్యంలో సిపాయిగా పనిచేసి పదవీ విరమణ చేశాడు. పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడే సీపీఎస్ దేశవ్యాప్త మహాధర్నా

అమరావతి, ఆంధ్రప్రభ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న నూతన పెన్షన్ విధానం సీపీఎస్‌ను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా ఉద్యోగులు, వివిధ ఉద్యోగ సంఘాలు మంగళవారం ధర్నాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో ఉద్యోగులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడానికి సన్నద్ధమయ్యారు. రాష్ట్రంలో జన్మభూమి కార్యక్రమం జరుగుతున్నప్పటికీ జన్మభూమిలో పాల్గొనే ఉద్యోగులు ఒక పూట సెలవు పెట్టి ధర్నాలో పాల్గొంటారని ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి.

రైతును పాతాళానికి నెట్టిన బాబు ప్రభుత్వం

వైసీపీ అధికార ప్రతినిధి కొలుసు పార్థసారథి

అమరావతి, ఆంధ్రప్రభ : రైతే రాజు.. రైతులకు రుణ మాఫీ చేస్తాం.. గిట్టుబాటుధర కల్పిస్తాం అని చెప్పిన ప్రభుత్వ పెద్దలు వీటిలో ఏ ఒక్క పనీ చేయకపోగా రైతును రోడ్డున పడేశారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, బందరు పార్లమెంటు అధ్యక్షులు కొలుసు పార్థసారథి అన్నారు. విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేకపోగా చివరకు రైతును అడుక్కుతినే పరిస్థితి తెచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఊరురా తిరుగుతూ రాష్ట్రంలోని ఏ ఒక్క రైతు బ్యాంకులకు పైసా కూడా రుణాలకు సంబంధించి చెల్లించవద్దని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కాగా ప్రభుత్వ పెద్దలేమో జన్మభూమిలో సోమవారం రైతేరాజు.. వ్యవసాయం, అనుబంధ విభాగాల అభివృద్ధి అంటూ కలర్ పేజీలలో ప్రకటనలిస్తూ రైతులను మాత్రం రోడ్డున పడేస్తున్నారన్నారు. ధాన్యం , మినుములు ఇలా అనేక పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడిపోతున్నారన్నారు. కొనుగోళ్లు చేసినా వారికి నగదు చెల్లింపులు సరైన రీతిలో లేక తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారని చెప్పారు. తెలుగుదేశం నేతలు విచ్చలవిడి దోపిడీకి పాల్పడుతున్నారనేందుకు ఉదాహరణంగా కృష్ణాజిల్లా గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామంలో ధాన్యం కొనుగోళ్ల పేరుతో వ్యవసాయ పరపతి సంఘంలో రూ. 9కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని కె. పార్థసారథి ఆరోపించారు. ముస్తాబాద్‌లో ఓ వ్యవసాయపరపతి సంఘంలో అసలు ధాన్యం కొనుగోలు చేయకుండానే చేసినట్లు, రైతుల పేరుతో పొలాల నుండి ధాన్యం రవాణా చేసినట్లుగా, బ్లాక్ లిస్ట్‌లో ఉన్న పల్లవి రైస్ మిల్లు పేరుతో ఈ కొనుగోళ్లు చేసి వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రూ. 9కోట్ల వ్యవహారం నడిచినట్లు కూడా తెలిసిందని వివరించారు.

జన్మభూమి పెన్షన్లు పక్షపాతంతో మంజూరు చేస్తూ వైకాపా వారి పెన్షన్లు తొలగిస్తున్నారు

జన్మభూమి సభలలో అడిగిన వారందరికీ పెన్షన్లు ఇస్తున్నారనేది పూర్తి అబద్ధమని పార్థసారథి చెప్పారు. అర్హులైన వారిని గుర్తించినప్పటికి వారిలో చాలా మందికి పెన్షన్లు మంజూరు చేయడం లేదనే వాదన వాస్తవమని తెలిపారు. ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నకు తన వద్ద ఉన్న సమాచారం ఇస్తున్నానని అధికారులతో చర్చించి అర్హులైన వారికి మంజూరు చేయిస్తే బాగుంటుందని తెలిపారు. అంబటి రాంబాబును ఛానల్స్ లైవ్‌లో కూడా పాల్గొనకుండా పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు.

యశోదా బెన్‌కు న్యాయం చేయాలంటూ..

8 రోజులుగా హైదరాబాద్ వైద్యురాలు దీక్ష, భగ్నం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రధాని నరేంద్ర మోడీ తన భార్య యశోదా బెన్(జశోదా బెన్)కు న్యాయం చేయాలంటూ నగరానికి చెందిన వైద్యురాలు పాలెపు సుశీల చేస్తున్న దీక్షను మియాపూర్ పోలీసులు భగ్నం చేశారు. యశోదాను మోడీ తన భార్యగా అంగీకరించి గౌరవించాలని, లేదంటే.. జెడ్ కేటగిరీ భద్రత తొలగించి ఆమెకు స్వేచ్ఛ ప్రసాదించాలని డిమాండ్ చేస్తూ గత ఎనిమిది రోజులుగా దీక్ష చేస్తోంది సుశీల. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాగా నీరసించిపోయిన ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందే ప్రయత్నం చేశారు. అయితే, తాను మాత్రం తన డిమాండ్లు పరిష్కారం అయ్యే దాకా దీక్ష విరమించబోనని సుశీల సోషల్ మీడియాలో స్పష్టం చేశారు. అఖండ భారత ఉద్యమ వ్యవస్థాపకురాలిగా ఉన్న డాక్టర్ పాలెపు సుశీల.. హైదరాబాద్ మియాపూర్‌లోని న్యా హాఫీజ్‌పేటలో క్లినిక్ నడుపుతున్నారు. హైందవ జీవన విధానంలో మహిళ పూజ్యనీయురాలని, స్త్రీల గౌరవాన్ని, స్వేచ్ఛను కాపాడటం కోసమే తాను దీక్షకు దిగినట్లు సుశీల తన ఫేస్‌బుక్ ఖాతాలో పేర్కొన్నారు. యశోదాబెన్‌కు న్యాయం చేయాలంటూ దీక్ష చేశారు.

కాగా, దీక్ష భగ్నం అనంతరం ప్రధానిని ఉద్దేశించి డాక్టర్ సుశీల ఘాటు వ్యాఖ్యలు చేశారు. న్యాయం కోసం పోరాడుతుంటే తనను ఇలా ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ చెప్పుకొచ్చారు. అంతేగాక మానవత్వమే లేని మనుషులకు దేశం మనుషులు పట్టని నాయకులకు బ్రిటీష్ వాళ్లే కరెక్ట్ సోషల్‌మీడియాలో అని వ్యాఖ్యానించారు.

కాగా, ఉగ్రవాదుల నుంచి ముప్పు పొంచి ఉన్నందునే యశోదాబెన్‌కు భద్రత కల్పిస్తున్నారని, ఈ విషయంలో దీక్షలు అవసరం లేదని నెటిజన్లు సుశీలకు హితవు పలుకుతున్నారు. కొందరైతే ప్రచారం కోసం ఇలాంటి పనులేంటని ప్రశ్నిస్తున్నారు.

అసత్యాలు ప్రచారం చేస్తున్న జగన్

• జగన్ అవినీతిలో కేవీపీకి వాటా
• టీడీపీ అధికార ప్రతినిధి లంకా దినకర్



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రతిపక్షనేత జగన్ పాదయాత్రలో అసత్యాలు ప్రచారం చేస్తున్నారని టీడీపీ అధికార ప్రతినిధి లంకాదినకర్ మండిపడ్డారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రశాంత్ కిషోర్ లాంటి పెయిడ్ ఆర్టిస్టులతో అబద్దాలు ప్రచారాలు చేయించడానికి వైసీపీ ఆపసోపాలు పడుతోందన్నారు. పేరూ ఊరు మార్చితే వాస్తవాలు అవాస్తవాలవుతాయా అంటూ ప్రశ్నించారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో వికలాంగుల పెన్షన్ అందుకునే వ్యక్తిని కడప జిల్లా ఇడుపులపాయకు తెప్పించి పెన్షన్ అందడం లేదని చెప్పించే ప్రయత్నం చేసి జగన్ అండ్ కో రెడ్‌హ్యాండెడ్‌గా బుక్కయ్యారన్నారు. సొంత కుటుంబంలో రుణమాఫీ ఫలాలు పులివెందుల ఆంధ్రా బ్యాంకులో అందుకుంటున్న వాస్తవాలను ఆ ఖాతాలతో సహా బహిర్గతపరచినా రుణమాఫీ అందడంలేదని ప్రచారం చేయబోయి అభాసుపాలయ్యారన్నారు. ఒక డ్వాక్రా మహిళతో 20సంవత్సరాలుగా రేషన్ కార్డు లేదని , నివసించడానికి ఇల్లు కూడా లేదని చెప్పించారని, అంటే వైయస్ హయాంలో ఆమెకు రేషన్ కార్డు, ఇల్లు మంజూరు చేయడంలో విఫలమయ్యారా లేకుంటే బోగస్ పేర్లతో మీరు బొక్కేశారా అని ప్రశ్నించారు. ఇప్పుడు అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు ఇవ్వడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ఈ 5వ విడత జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి కల సాకారం చేసేందుకు సీఎం బృహత్తర ప్రణాళికతో ముందుకెళ్తున్నారని చెప్పారు. వైఎస్ హయాంలో మంజూరు చేసిన ఇళ్లలో 14లక్షల ఇళ్లు అసలు కనిపించటంలేదని, పేదలకు అందాల్సిన ప్రజాధనం జగన్ జేబులోకి వెళ్లిందన్నారు. పోలవరం గురించి కొంతమంది యాత్రలు చేస్తున్నారని, కానీ రాజ్యసభలో బిల్లు పెట్టే సమయంలో కొంచెం జాగ్రత్తగా ఉన్నట్లయితే ఈసమస్యలు వచ్చి ఉండేవికావన్నారు. జగన్ అవినీతిలో రాజ్యసభసభ్యుడు కేవీపీ రామచంద్రరావు కూడా భాగం వుందని, వారిద్దరు ఒకరికొకరు లబ్ధి చేకూర్చుకున్నారని తెలిపారు. పోలవరం గురుంచి మాట్లాడకుండా నేడు అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా చంద్రబాబు పాలన చేస్తున్నారు.

ఆ రోజు అలా జరిగిపోయింది..

• తాగి వాహనం నడపొద్దని ప్రచారం చేస్తా..• కౌన్సిలింగ్ పూర్తియిన అనంతరం మీడియాతో యాంకర్ ప్రదీప్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నూతన సంవత్సర వేడుకల రోజున డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ యాంకర్ ప్రదీప్ ఎట్టకేలకు సోమవారం కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. ఆయన సోమవారం మధ్యాహ్నం సుమారు 3.35 గంటల సమయంలో గోషా మహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. బేగంపేట ట్రాఫిక్ పీఎస్‌కు హాజరవుతారని అందరూ భావిస్తూ వచ్చారు. ఆయన కోసం మీడియా, సామాన్యులు, పోలీసులు వేచి చూశారు. ఈ నేపథ్యంలో ఆయన బేగంపేటలో కాకుండా గోషా మహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట హాజరయ్యారు. ప్రదీప్‌కు పోలీసులు మూడు డాక్యుమెంటరీలు చూపించారు. అరగంటపాటు కౌన్సిలింగ్ ఇచ్చారు. కౌన్సిలింగ్ పూర్తయిన అనంతరం ప్రదీప్ మీడియాతో మాట్లాడారు. తాగి వాహనం నడపవద్దని తాను ప్రచారం చేస్తానని చెప్పారు. తాను ఎవరినీ తప్పుదోవ పట్టించలేదన్నారు. ఆ రోజు అలా జరిగి పోయిందని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. తనకు ఇచ్చిన సమయానికి కౌన్సిలింగ్‌కు వచ్చానని తెలిపారు. తాను తప్పు చేశానని, ఇకముందు ఇలాంటి తప్పు చేయనని ప్రదీప్ చెప్పారు. తాను పట్టబడటం ఇదే తొలిసారి అని చెప్పారు. ఇక్కడికి రావడం కూడా ఇదే మొదటిసారి అని తెలిపారు. తమలాంటి వారిని చూసి చాలా మంది నేర్చుకుంటారని, కాబట్టి మేం ఇలా తప్పులు చేయవద్దన్నారు. తాను చేసిన తప్పు ఇక ఎవరూ చేయ కూడదని యాంకర్ ప్రదీప్ అన్నారు.

కౌన్సెలింగ్ ద్వారా చాలా విషయాలు తెలుసుకున్నా...

సోమవారం కౌన్సెలింగ్ సెషన్‌కు హాజరు కావాలని మెసేజ్ వచ్చిందని, అందుకే వచ్చానని, ఇప్పటివరకు రాలేదేంటని అంతా అనుకుంటున్నారని, తప్పించుకుంటున్నానని, అజ్ఞాతంలోకి వెళ్లానని రకరకాలుగా అంటున్నారని, అలాంటిదేమీ లేదని ప్రదీప్ చెప్పారు. పోలీసులు తనకు కేటాయించిన తేదీలో వచ్చానని, నిబంధనలు ఫాలో అవుతున్నానని, ఈ కౌన్సెలింగ్ ద్వారా తాను చాలా విషయాలు తెలుసుకున్నానని, పోలీసులు చాలా ఓపికతో బాగా వివరించారని చెప్పారు. మద్యం తాగడం వల్ల శరీరంలో ఎలాంటి మార్పులు వస్తాయి? డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలకు గురయ్యేందుకు అవకాశాలు తదితర అంశాలను అర్థమయ్యేలా చెప్పారన్నారు. నిబంధనల ప్రకారం తదుపరి వాటికి హాజరవుతానని చెప్పారు.

గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

• బొలెరో వాహనం బోల్తాపడి 5 మంది కూలీలు మృతి • ఐదుగురికి తీవ్ర గాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం
• డ్రైవర్ నిద్రమత్తులో ఉండడమే కారణం
• సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ



జోగుళాంబ గద్వాల, ప్రభన్యూస్ : వారంతా రోజువారి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.. ఎప్పటిలాగే దినసరి కూలీలుగా పత్తి జిన్నింగ్ మిల్లుకు వెళ్లి రాత్రంతా శ్రమించి తిరిగి ఇళ్లకు చేరుకునేందుకు పయనమయ్యారు... కొన్ని నిమిషాల్లో స్వస్థలాలకు చేరుకుంటామనేలోపు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా.. అనుకోని ప్రమాదానికి గురై ఐదుగురు ప్రాణాలు అనంతవాయువులో కలిసిపోగా, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది.. మరో 15మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి... ఈ విషాద సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండల పరిధిలోని పారుచర్ల గ్రామ స్టేజి సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది.

ధరూర్ మండలంలోని చిన్నపాడు, ఎములోంపల్లి గ్రామాలకు చెందిన 40మంది కూలీలు బొలెరో వాహనంపై గద్వాలలోని ఓ పత్తి మిల్లులో రాత్రి పని చేసేందుకు ఆదివారం వచ్చారు. రాత్రంతా మిల్లులో పనిచేసి తెల్లవారుజామున గ్రామానికి బయలుదేరారు. కాగా కూలీలతోపాటు నిద్ర మేల్కొని ఉన్న డ్రైవర్ రాముడు వాహనాన్ని అతివేగంగా నిర్లక్ష్యంగా నిద్రమత్తులో నడుపుతూ పారుచర్ల గ్రామ స్టేజి శివారులో మలుపు వద్ద మలుపు తీసుకుంటూ వాహన వేగాన్ని నియంత్రించలేక బోల్తా కొట్టించాడు. రాత్రంతా పనిచేసి అలసిపోయిన కూలీలు నిద్రమత్తు కళ్లతో ఉండడం, వాహనం బోల్తాపడడం... పరిమితికి మించి వాహనంలో ప్రయాణించడంతో ఒకరిపై ఒకరు పడి...వాహన కడ్డీలకు ఢీకొని చిన్నపాడు గ్రామానికి చెందిన లోహిత్‌చారి(45), గీతమ్మ(30), కొత్త వెంకటన్న(40), కోట్ల వెంకటన్న(55), ఎములోంపల్లి గ్రామానికి చెందిన అరుణ(23)లు అక్కడిక్కడే మృతి చెందగా మరో 15మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ విజయ్‌కుమార్, డీఎస్పీ సురేందర్‌రావు, సంఘటన స్థలానికి చేరుకుని సంఘటన వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు.

రూ.89 లక్షల విలువైన 594 కిలోల గంజాయి పట్టివేత



అమరావతి, ఆంధ్రప్రభ : ఏపీ నుంచి మహారాష్ట్రకు పెద్ద మొత్తంలో తరలిస్తున్న 594 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్) అధికారులు ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. బహిరంగ మార్కెట్లో స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.89లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ జోనల్ కార్యాలయం అదనపు డైరెక్టర్ జనరల్ ఓ ప్రకటన జారీ చేశారు. గంజాయి రవాణా నిలువరించే చర్యల్లో భాగంగా నిఘా పెంచడంతో తుని సమీపంలోని మకరం గ్రామం నుంచి మహారాష్ట్రలోని మన్మాడ్‌కు పెద్ద మొత్తంలో తరలిస్తున్నట్లు సమాచారం చేరింది. ఈ సమాచారం మేరకు విజయవాడకు చెందిన డీఆర్ఐ అధికారులు రాజమహేంద్రవరం సమీపంలో ఐషర్ వాహనం ఆపి తనిఖీ చేయగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలో దీనిని తరలిస్తున్నట్లు గుర్తం చారు. ఎవరికీ అనుమానం రాకుండా వాహనం పైభాగంలో ఏర్పాటు చేసిన అరలో ప్యాకింగ్ చేసిన గంజాయిని పెట్టి రవాణా చేస్తున్నారు. దీంతో వాహనాన్ని సీజ్ చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తితో పాటు కొనుగోలు చేసిన వ్యక్తి సహా ఏడుగురిని ఎన్‌డీపీఎస్ చట్టం కింద అరెస్టు చేశారు. తదుపరి విచారణ జరుగుతున్నట్లు ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

ఆర్టీఐ స్వచ్ఛంద కార్యకర్తలకు

రక్షణ కల్పించాలి

• గరీబ్ గైడ్ చైర్మన్ డాక్టర్ డీ.వీ.రావు



అమరావతి, ఆంధ్రప్రభ: దేశవ్యాప్తంగా సమాచార చట్టాన్ని అస్త్రంగా చేసుకుని వివిధ ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న అవినీతిని ప్రజల ముందుకు తీసుకువస్తున్న ఆర్టీఐ స్వచ్ఛంద కార్యకర్తలకు రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు న్యాయవాది, గరీబ్ గైడ్ చైర్మన్ డాక్టర్ డి.వి రావు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు ఆయన పత్రికలకు ఒక ప్రకటనను విడుదల చేశారు. అవినీతి అధికారుల అసలు స్వరూపాన్ని బహిర్గతం చేసే సమయంలో స్వచ్ఛంధ సమాచార హక్కు చట్టం కార్యకర్తలు హత్యకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో 56మంది కార్యకర్తలు హత్యకు గురయ్యారని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే వీరి కుటుంబాలకు రూ. 20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఇప్పటికే ఎక్స్‌గ్రేషియా అంశంపై ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి లేఖ రాయడం జరిగిందని డీ.వీ.రావు తెలిపారు. అవినీతి నిర్మూలన, పారదర్శక పాలనతో దేశాన్ని ముందుకు నడిపిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ ఈ అంశంపై సానుకూలంగా స్పందిస్తారనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. అదే విధంగా గరీబ్ గైడ్ స్వచ్ఛంధ సంస్థకు అనుబంధంగా ఆర్టీఐ ఆర్మీ అనే సంస్థను ప్రారంభించామని తెలిపారు. ఇందులో పనిచేస్తున్న స్వచ్ఛంధ కార్యకర్తలు విధినిర్వహణలో భాగంగా హత్యకు గురైతే గరీబ్ గైడ్ పక్షాన ఆ కుటుంబానికి రూ. 2లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు.

రైళ్ల నిర్వహణలో భద్రత, సమయపాలన ప్రధానం

ద.మ. రైల్వే జనరల్‌మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రైళ్ల ఆలస్యానికి కారణమయ్యే వ్యవస్థాగత వైఫల్యాల తగ్గుదల కోసం కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కువార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. భద్రత, సమయ పాలన, ఎగుమతుల మెరుగుదలపైన సోమవారం రైల్ నిలయంలో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. వెల్డింగ్ వైఫల్యాలు, రైలు పట్టాలు తప్పడం, లెవల్ క్రాసింగ్‌ల వద్ద జరిగే ప్రమాదాలపై అధికారులు అన్ని కోణాల్లో స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. డివిజనల్ మేనేజర్లు క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించి ట్రాక్ నిర్వహణలో సమస్యలను అధిగమించవలసి ఉంటుందన్నారు. ట్రాక్ నిర్వహణ సిబ్బంది సమస్యల పై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. సరకు రవాణా ఎగుమతులు పెంచవలసి ఉందన్నారు. రైళ్ల రాకపోకల్లో సమయపాలన కచ్చితంగా పాటించాలన్నారు. వేగ నియంత్రణ నియమాలను పాటించవలసి ఉందన్నారు. ట్రాఫిక్ బ్లాక్‌లు, వ్యాగన్ల సరఫరా పై సమీక్షించారు. కాపలాలేపి లెవల్ క్రాసింగ్‌ల తొలగింపు పనులను తరచుగా సమీక్షించవలసి ఉందని డిఆర్ఎంలను ఆదేశించారు. ప్రయాణికుల సౌకర్యాలపై కూడా దృష్టి కేంద్రీకరించవలసి ఉందన్నారు. ఈ సందర్భంగా ఏడుగురు రైల్వే సిబ్బందికి మ్యాన్ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రధానం చేశారు.

దైవ దర్శనానికి వెళ్లి...!



నంగునూర్, ప్రభన్యూస్: భార్యతో కలిసి రాజన్న సిరిసిల్లా జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడకు వెళ్లి హత్యకు గురైన బాలయ్య మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నా యి. సిద్దిపేట జిల్లా, నంగునూర్ మండల పరిధిలోని ఘనపూర్ గ్రామానికి చెందిన బండి బాల య్య(40) సోమవారం తెల్లవారు జామున వేములవాడ పుణ్య క్షేత్రంలో హత్యకు గురైయాడన్న విషయం తెలిసిన కుటుంబికులు, గ్రామస్థులు వేములవాడకు తరలివెళ్లారు. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బండి బాలయ్య తన భార్య బండి నర్సవ్వతో కలిసి ఆదివారం ఉదయం వేములవాడకు తరలివెళ్లారు. దేవాలయ ఆవరణ పార్కింగ్ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు మెడపై కత్తితో పొడవడంతో బాలయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. . దైవ దర్శనానికి వెళ్లేముందు బాలయ్య కూతురు శైలజ(17), అంజలి(9), తండ్రి బక్కయ్యను సైతం వెంట తీసుకెళ్లకపోవడంతో పక్క ప్రణాళికతోనే మరొకరితో కలిసి బాలయ్యను హత్య చేసి ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. అనుమాని తురాలిగా భార్య నర్సవ్వను అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. బాలయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించారు. అటు తల్లి నర్సవ్వ పోలీసుల అదుపులో ఉండటం, ఇటు తండ్రి హత్యకు గురికావడంతో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న శైలజ, 4వ తరగతి చదువుతున్న అంజలిల రోదనలు గ్రామస్థులను కంటతడి పెట్టించాయి.

గంటకో విద్యార్థి ఆత్మహత్య

• మూడేళ్లలో దేశవ్యాప్తంగా 26వేల మంది బలవన్మరణం • ఏటా పెరుగుతున్న సంఖ్య • మొదటి స్థానంలో మహారాష్ట్ర • పరీక్షల్లో తప్పడంతోనే అత్యధిక ఆత్మహత్యలు • కౌన్సిలింగ్ సెంటర్లు నిర్వహిచాలంటున్న వైద్యులు

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా గంటకో విద్యార్థి కన్నుమూస్తున్నాడు. ఈ పరంపర స్కూల్ స్థాయి నుండి వృత్తి విద్యా కళాశాలల వరకు కొనసాగుతున్నది. భారత్‌లో 2014 నుండి మూడేళ్లలో సుమారు 26వేల మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దీనికి సంబంధించిన డాటాను కేంద్ర మంత్రిత్వ శాఖ అన్నీ రాష్ట్రాలకు పంపింది. ఈ విషయమై కేంద్రం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. కేవలం 2016లోనే 9,474 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. అంటే సగటున 55 నిమిషాలకో విద్యార్థి బలవన్మరణానికి పాల్పడినట్టు మంత్రిత్వ శాఖ తేల్చింది. ప్రతీ ఏటా విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతూ వస్తున్నాయని నివేదికలో పేర్కొంది. ఎక్కువ మంది పరీక్షలు ఫెయిల్ కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు తెలిసింది. 2014లో 2,403 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడగా, 2015లో ఈ సంఖ్య పెరిగింది. ఆత్మహత్యలు 2,646గా నమోదైంది. 2016లో మరింత పెరిగి 2,413కి చేరింది. వీరంతా కేవలం పరీక్షలు ఫెయిల్ కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్ వివరించారు. దీనికి సంబంధించిన డాటాను ఆయన జనవరి 2న లోక్‌సభలో అందజేశారు. 2016ల అత్యధికంగా విద్యార్థులు మహారాష్ట్రలో బలవన్మరణానికి పాల్పడ్డారు. ఒకే ఏడాదిలో సుమారు 1,350 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. తరువాత వెస్ట్‌బెంగాల్‌లో 1,147, తమిళనాడులో ఈ సంఖ్య 981గా నమోదైంది. కేవలం ఫెయిల్ కావడంతో వీరంతా ఆత్మహత్యలకు పాల్పడలేదని, ఇతరాత్ర కారణాలు చాలానే ఉన్నాయని సర్వేలో తేలింది. కొందరు చదువుపై ఒత్తిడి చేయడంలో, కోర్సుల ఎంపికలో ఇలా అనేక కారణాలతో విద్యార్థులపై మానసికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వారంతా ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్టు అధికారులు గుర్తించారు. కౌన్సిలింగ్ కేంద్రాలు లేని కారణంగా కూడా ఆత్మహత్య చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వెంటనే అన్నీ పాఠశాలల్లో, కళాశాలల్లో కౌన్సిలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. మహారాష్ట్రలో అత్యధికంగా మెడికల్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని నివేదికలో తేలిందని మహారాష్ట్ర ఎంపీ కపిల్ మోరేశ్వర్ పాటిల్ తెలిపారు. ఆత్మహత్యల విషయమై పాటిల్ పార్లమెంట్‌లో ప్రశ్న లేవనెత్తగా... పరీక్షల్లో పేలవమైన ప్రదర్శన ఇవ్వడంతో పాటు పని ప్రదేశాల్లో వర్గాలపరంగా విభేదాలు ఉండటం కూడా ఆత్మహత్యలకు కారణం మీడియా చెబుతున్నదని కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ సమాధానం ఇచ్చారు. అదేవిధంగా మానసిక వైద్య నిపుణుల ద్వారా కూడా జిల్లాల వారీగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నదని మంత్రి చెప్పారు. పాఠశాలల్లో అయితే ఉపాధ్యాయులతో, పని ప్రదేశాల్లో అయితే మేనేజ్‌మెంట్‌తో మాట్లాడుతూ.. ఉద్యోగుల మానసిక పరిస్థితులపై అధ్యయనం చేస్తున్నట్టు తెలిపారు. పుణెలో 115 కళాశాలల్లో వెల్‌నెస్ విభాగాలను ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లడటంతో పాటు, ఎక్కువ ఒత్తిడికి గురవుతున్న వారికి కౌన్సిలింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు.

దేశంలో అత్యధిక, నైపుణ్యం గల ఇంజినీరింగ్ కళాశాలలు పుణేలోనే ఎక్కువగా ఉన్నాయి. ఖరగ్‌పూర్ ఐఐటీలో కూడా విద్యార్థుల మానసిక పరిస్థితులపై ఎప్పటికప్పుడు అధ్యయం చేస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా తోటి విద్యార్థులతో తమ బాధలు, సంతోషాలు పంచుకోవడానికి ఒక గంట పాటు సమయం కేటాయిస్తున్నారు. మూడేళ్లలో 26,416 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా, అందులో 28.24 శాతం అనగా, 7,462 మంది విద్యార్థులు పరీక్షలు బాగా రాయకపోవడంతోనే తనువు చాలించినట్టు ప్రభుత్వ లెక్కల పరంగా తేలింది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆత్మహత్యల్లో.. 6 నుండి 7 శాతం మంది విద్యార్థులు ఉంటున్నారు. సగటున చూస్తే మూడేళ్లలో చనిపోయిన విద్యార్థుల్లో 40 నుండి 45 శాంతి విద్యార్థినులు ఉన్నారు.

థియేటర్లలో జాతీయగీతంపై కేంద్ర కమిటీ

న్యూఢిల్లీ: జాతీయ గీతాన్ని థియేటర్లలో బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శనపై కేంద్రం సోమవారం నూతన నియమావళిని రూపొందించడానికి మంత్రివర్గ కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు అఫిడవట్లో పేర్కొంది. దీనిపై తగిన కసరత్తు చేసేందుకు ఆరునెలల సమయం పట్టవచ్చన్నారు. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రభుత్వ దాఖలు చేసిన అఫిడవిట్లో సుప్రీంకోర్టుకు తెలియజేయడం జరిగింది. దేశంలోని అన్ని సినిమాహాళ్లలో చలన చిత్ర ప్రదర్శనకు ముందు జాతీయగీతాన్ని ప్రదర్శించాలని నవంబర్ 30, 2016లో సుప్రీంకోర్టు ఆదేశించింది.

అంతేకాక గీతం ముగిసే వరకూ ప్రేక్షకులు గౌరవంగా నిలబడాలని అత్యున్న త న్యాయస్థానం ఆదేశించిన సంగతి విదితమే. ఇది ఆచరణలో దేశభక్తి, జాతీయవాదం భావన కలిగిస్తుందని సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా, న్యాయమూర్తులు కన్విల్కర్, చంద్రచూడ్‌తో కూడిన ముగ్గురు న్యాయమూర్తులు ధర్మాసనం అక్టోబరులో మార్పులు చేయాలని సూచించింది.

2016లోనే ఆదేశాలిచ్చిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆ సందర్భంలో మాట్లాడుతూ ముందు ముందు ఈ ఆదేశాలను కోర్టు సవరించే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు.

విశాఖలో

నైపుణ్యాభివృద్ధి వర్సిటీ

• ఇంధన, లాజిస్టిక్, హాస్పిటాలిటీ యూనివర్శిటీల ఏర్పాటు • ఉపాధ్యాయ శిక్షణకు ప్రత్యేకించి యూనివర్శిటీ: మానవ వనరుల శాఖ మంత్రి గంటా

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో వివిధ అంశాల్లో వృత్తి నైపుణ్యాన్ని మరింతగా మెరుగుపర్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారని రాష్ట్రమానవ వనరులు, విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. సోమవారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఇందుకు సంబంధించి వివిధ రకాలైన యూనివర్శిటీలను అమరావతిలో నెలకొల్పి, అమరావతిని ప్రపంచంలోనే అగ్రభాగాన నిలపాలన్నది ముఖ్యమంత్రి ఆశయమన్నారు. సీఎం ఆశయాలకనుగుణంగా రాష్ట్రంలో ఇంధన, లాజిస్టిక్, హాస్పటల్టీ, స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్శిటీలను అమరావతిలో నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విశాఖపట్నంలో నైపుణ్యాభివృద్ధి యూనివర్శిటీని ఏర్పాటు చేసేందుకు పెద్ద ఎత్తున కసరత్తు చేస్తున్నామన్నారు. ఈ విషయమై ఇటీవల విశాఖ వచ్చిన కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రిని కలిసి, వివరించామని, అందుకు ఆయన ఆర్థిక సహకారంతోపాటు అన్ని రకాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో దీని నిర్మాణానికి అవసరమైన మార్గదర్శకాలను రూపొందిస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే విశాఖలో నైపుణ్యాభివృద్ధి యూనివర్శిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరించేందుకు ముందుకొచ్చిందని తెలిపారు.

అంతేకాకుండా మారుతున్న కాలానుగుణ మార్పుకనుగుణంగా ఉపాధ్యాయ విద్యా వ్యవస్థను మరింతగా మెరుగుప ర్చాలనే ఉద్దేశంతో ప్రత్యేకించి టీచర్ శిక్షణా యూనివర్శిటీని కూడా నెలకొల్పేందుకు యోచిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఈ తరహా యూనివర్శిటీ తమిళనాడులో ఉందని, ఏపీలో కూడా త్వరలోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను రూపొందిస్తున్నామని చెప్పారు. విద్యా ప్రమాణాలు మరింతగా మెరుగుపర్చాలనే ఉద్దేశంతో నాలుగేళ్ల సమీకృత బీఈడీ కోర్సును వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో అమల్లోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి గంటా పేర్కొన్నారు.

1,385 అధ్యాపక పోస్టుల భర్తీ

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్శిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీకి కూడా చర్యలు తీసుకున్నామని మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పారు. పోస్టుల వివరాలు కూడా యూనివర్శిటీ వారీగా సేకరించామన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి కొన్ని యూనివర్శిటీలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు కూడా విడుదల చేశాయన్నారు. ప్రొఫెసర్,అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు కలిపి మొత్తం 1385 పోస్టులను భర్తీ చేయనున్నామని మంత్రి వివరించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ బాధ్యతను ఏపీపీఎస్‌సీకి అప్పగించామని అన్నారు. ఆ దిశగా ఇప్పటికే ఏపీపీఎస్‌సీ చర్యలు తీసుకుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో బీఈడీ, డీఈడీ చదువుతున్న వారికి టెక్ రాసేందుకు అవకాశం కల్పించామని చెప్పారు. బీటెక్ తర్వాత బీఈడీ చేసిన వారికి అవకాశం కల్పించే విషయమై ఆలోచన చేస్తున్నామని తెలిపారు.

ఆన్‌లైన్‌లో

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థులు అర్హత సాధించారన్నారు. అదే విధంగా లాసెట్‌ను ఏప్రిల్ 19న, ఎంసెట్‌ను ఏప్రిల్ 24 నుంచి 26 వరకు నిర్వహించామ న్నారు. మెడిసిన్ ప్రవేశపరీక్షను ఏప్రిల్ 28న నిర్వహించా మని, ఏపీఐసెట్‌ను మే 2న, ఏపీ ఈసెట్‌ను మే 3న, ఏపీ పీజీ సెట్‌ను మే 10 నుంచి 12 వరకు, ఏపీపీఈసెట్‌ను మే 6న నిర్వహించినట్లు మంత్రి వివరించారు. ఎంసెట్, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలను ఏప్రిల్ 22 నుంచి 25వరకు ,ఎంసెట్ మెడిసిన్ పరీక్ష ఏప్రిల్ 26న నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.అన్ని పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామన్నారు. వివిధ సెట్లకు సంబంధించిన వివరాలు కింది విధంగా ఉన్నాయి.

ప్రవేశ పరీక్ష	తేదీ	సమయం	యూనివర్శిటీ	కన్వీనర్
ఎడ్‌సెట్	ఏప్రిల్ 19	11నుంచి1గం.	ఎస్వీయూనివర్శిటీ	ప్రొ. టి.కుమారస్వామి
లాసెట్	ఏప్రిల్ 19	3-4.30 పీఎం	ఎస్.కె.యూనివర్శిటీ	ప్రొ.జ్యోతి విజయకుమార్
ఎంసెట్, ఇంజనీరింగ్	ఏప్రిల్ 22-25	9 -12	జేఎన్‌టీయూ,కాకినాడ	ప్రొ.సాయిబాబు
ఎంసెట్-బైపీసీ	ఏప్రిల్ 26	9-12 మరియు 2.30-4	పీఎంజేఎన్‌టీయూ, కాకినాడ	ప్రొ.సీహెచ్.సాయిబాబు
ఐసెట్	మే 2	10.30-12.30 2.30-5.00	ఎస్వీ యూనివర్శిటీ	ప్రొ. బి.సుధీర్
ఈసెట్	మే 3	10-1.00	జేఎన్‌టీయూ, అనంతపురం	ప్రొ. భానుమూర్తి
పీజీఈసెట్	మే10-12	10-12, 2- 4.00	ఆంధ్రా యూనివర్శిటీ	ప్రొ.పి.ఎస్.అవధాని
పీఈసెట్	మే 4	9.00	నాగార్జున యూనివర్శిటీ	ప్రొ.పాల్‌కుమార్

మెట్టలోనూ వరి



(మొదటిపేజీ తరువాయి)

విషయాలను వెల్లడించారు. భారత దేశ వాతావరంలో వరి పంటను ఎక్కడైన పండించవచ్చని పాలేకర్ చెప్పారు. క్రమ పద్ధతిలో సాగు చేస్తే వరి పంట ఎకరానికి 120 క్వింటాళ్ల దిగుబడిని కూడా ఇస్తుందని, అయితే దీనికోసం నేలలో 25 శాతం కర్బనం ఉండాలన్నారు. కానీ ప్రస్తుతం మన నేలల్లో 0.2 శాతం మాత్రమై కర్బనం ఉందని, కర్బనం, నత్రజని 10:1 నిష్పత్తిగాను, 10 వేల నుంచి 12 వేల ఫుట్ కాండిల్స్ సౌరశక్తిని సాధించగలిగితే ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబులు కోరుకున్నట్లు అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో మాత్రమే నేలలో కర్బనం శక్తి పెరుగుతుందని, అదే రసాయనిక, మందుల సేద్యంలో ఇష్టారీతిగా మోతాదుకు మించి రసాయనిక మందుల వాడకంతో నేల విషతుల్యం అవుతుందని తెలిపారు.

సంకర విత్తనాలతో సాగు చేసే పంటలు దిగుబడులు రావాలంటే రసాయనాలు, పురుగుల మందులు తప్పనిసరి అని, అదే స్థానిక విత్తనాలకు వాటి అవసరం ఉండదని పాలేకర్ స్పష్టం చేశారు. మెట్ట భూముల్లో వరి పంట సాగు చేయాలనుకున్నపుడు నూతన ఆలోచనా విధానంతో నీటిని ఆదా చేసే విధంగా పప్పు ధాన్యాలను అంతర పంటలుగా వేయాలన్నారు. వరి ఏక దళ జాతికి చెందిన మొక్క అని, దీనితో అతివృష్టి, అనావృష్టిలను తట్టుకునే శక్తి సహజసిద్ధంగా దానికి ఉంటుందన్నారు. దీని కోసం అధిక నీరు అవసరం లేదని, పరిమితమైన నీటిని క్రమపద్ధతిలో వినియోగించుకొంటూ అధిక సూర్యరశ్మి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకృతి సేద్యం దిశగా అద్భుతమైన ప్రోత్సాహకాలను రైతులకు ఇవ్వడం అభినందనీయమని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని దేశ వ్యాప్తంగ పలు రాష్ట్రాలు ఈ తరహా సేద్యం దిశగా కార్యాచరణ ప్రారంభించాయన్నారు. అందరికీ అన్నంపెట్టే రైతన్న ఆర్థికంగా బలంగా ఉన్నపుడే ఆ దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, అతితక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను ఇచ్చే ప్రకృతి సేద్యం ద్వారా మెరుగైన జీవన ప్రమాణాలను రైతులు పొందవచ్చని ఆయన తెలిపారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారు విజయ్‌కుమార్ మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు శిక్షణకు హాజరైన దాదాపు ఎనిమిది వేల మంది రైతులకు సర్టిఫికేట్‌లను జారీ చేస్తున్నామని, వీరంతా వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి ప్రకృతి వ్యవసాయ విధానంతో పంటలను పండించనున్నారని చెప్పారు. రాష్ట్రంలోని సాగు భూమిలో ఐదు లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్య విధానం అమలుకు చర్యలు చేపట్టామని, దీనిలో భాగంగానే రాష్ట్ర రైతాంగానికి ప్రకృతి సేద్య విప్లవ పితామహుడు పాలేకర్ ద్వారా ప్రత్యేక శిక్షణలు ఇప్పించినట్లు తెలిపారు.

కృశిస్తున్న సబల!



(మొదటిపేజీ తరువాయి)

ఫొలిక్ యాసిడ్, ఐరన్ మాత్రలను అందించేవారు. అంతేకాకుండా కొద్ది రోజుల క్రితం వరకు బాలికలు ఒక్కొక్కరికీ రోజుకు రూ.5ల చొప్పున వ్యయం చేస్తున్న కేంద్రం దీనిని రూ.9.50కు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆశగా చూసిన కిశోర బాలికలకు కేంద్రం అనూహ్యంగా తీసుకున్న నిర్ణయం శరాఘాతంగా మారింది. కొత్తగా రాష్ట్ర ప్రభుత్వాలకు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కేవలం బడి బయట ఉన్న బాలికలకు మాత్రమే ఈ పథకం వర్తించనుంది. అయితే కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పలు విమర్శలకు దారి తీస్తోంది. కేంద్ర నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 55,607 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టికాహారం అందుకుంటున్న 2.68 లక్షల మందికి ఈ పథకం దూరం కానుంది. కేవలం బడి బయట ఉన్న 11 నుంచి 14 ఏళ్ల లోపు ఉన్న 14 వేల మంది బాలికలకు మాత్రమే లబ్ధి చేకూరే పరిస్థితి నెలకొంది. తాజాగా ఈ పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని నేషనల్ న్యూట్రిషియన్ మిషన్ పరిధిలోకి తీసుకువచ్చి పలు నిబంధనలు సవరించింది. దీంతో పాటు కేవలం 11 నుంచి 14 వేల మధ్య ఉన్న బడిబయట బాలికలకు మాత్రమే సబల పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర నిర్ణయంతో పౌష్టికాహార లోపం ఉన్న బాలికలకు ఆశనిపాతంగా మారింది. పేదల పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా అందుతున్న చేయూత ఇకపై లేకపోవడం వల్ల రాష్ట్రంలో రక్తహీనతతో బాధపడేవారి సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి 'సబల' పథకం యధావిధిగా కొనసాగేలా చేయాలని కోరుతున్నారు.

భద్రతేదీ?

(మొదటిపేజీ తరువాయి)

సిబ్బంది సహకారంతోనే వీరు లోనికి వెళ్లారా? లేక వారి ఉదాసీనతను ఆసరాగా చేసుకొని వెళ్లారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరిగిన భద్రతా లోపాలపై ఎస్పీఎఫ్ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. గత నెల 26వ తేదీ అర్ధరాత్రి అమ్మవారి ఆలయంలో తాంత్రిక పూజలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలు తీవ్ర సంచలనం కలిగించాయి. అమ్మవారి ఆలయం ప్రధాన పూజారి భద్రినాథ్‌తో పాటు మరో నలుగురు బయటి వ్యక్తులు లోనికి వెళ్లి క్షుద్రపూజలు నిర్వహించారంటూ ప్రచారం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ, పోలీసు శాఖలు వేర్వేరుగా విచారణ జరిపి నివేదికను ప్రభుత్వానికి అందజేశాయి. వీరి నివేదికల ఆధారంగా ఆగ్రహించిన ముఖ్యమంత్రి అమ్మవారి ఆలయం ఈవో సూర్యకుమారిని విధుల నుంచి తప్పించి దేవాదాయ శాఖ కమిషనర్ వై.వి.అనురాధకు బాధ్యతలు అప్పగించారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ ఎస్పీఎఫ్ సాయుధ పహారా ఉండగా బయటి వ్యక్తులు లోనికి ఎలా వెళ్లారనే అనుమానం వ్యక్తమవుతోంది. పైగా ఆలయం కొండపైనున్న పోలీసు ఔటు పోస్టులోనే వారు దుస్తులు మార్చుకున్నట్లు విచారణ అధికారులు గుర్తించారు. పోలీసు అవుట్ పోస్టులోకి వీరు వెళ్లేందుకు సహకరించిన వ్యక్తులు ఎవరనేది ఇప్పుడు తేలాల్సి ఉంది. ఇదే సమయంలో విధుల్లోని ఎస్పీఎఫ్ సిబ్బంది ఆలయం మూసేసిన తర్వాత మరో సారి తెరవడానికి ఉన్న అనుమతులను ఎందుకు పరిశీలించ లేదంటున్నారు. పైగా ఆలయం తెరవడం, మూసివేయడం రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇలా చేయకుండానే వారు లోనికి వెళుతుంటే ఎస్పీఎఫ్ సిబ్బంది ఎందుకు అడ్డు కోలేదనే విషయం తేలాల్సి ఉంది. గతంలో కూడా ప్రత్యేక సందర్భాల్లో బయటి వ్యక్తులను తీసుకొచ్చి అలంకరణలు చేయించిన విషయం ప్రాథమిక విచారణలో ఎస్పీఎఫ్ అధికారులు దృష్టికి వచ్చింది. ఏదైనా ప్రత్యేక పర్వదినాలు వచ్చినప్పుడు ప్రధాన పూజారి సహా మరికొందరు బయటి వ్యక్తులు కూడా లోనికి వెళ్లేవారంటున్నారు. ఈ క్రమంలోనే మరుసటి రోజు రాష్ట్రపతి సతీమణి పర్యటనను దృష్టిలో ఉంచుకొని అలంకరణకు వచ్చి ఉండొచ్చనే భావనతోనే ఎస్పీఎఫ్ సిబ్బంది నిలువరించకపోయి ఉండొచ్చంటున్నారు. వారిని తోడ్కొని వచ్చింది ప్రధాన పూజారి కాబట్టే తాము వారి వివరాలు అడగలేదని ఉన్నతాధికారుల దృష్టికి సిబ్బంది తీసుకెళ్లినట్లు చెపుతున్నారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నప్పుడు సహజంగా పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన సిబ్బంది ఆలయ సిబ్బందితో ఉన్న సాన్నిహిత్యం వలనే చెప్పి ఉండకపోవచ్చంటున్నారు. గతంలో ప్రైవేటు భద్రతతోనే ఆలయాల నిర్వహణ సాగేది. అమ్మవారి ఆలయంలో కిరీటం, నగలు చోరీ జరిగిన తర్వాత రాష్ట్రంలోని అన్ని ఆలయాలకు ఎస్పీఎఫ్ భద్రత కలిపిస్తున్నారు. కనకదుర్గ అమ్మవారి ఆలయంలో మూడు షిఫ్టుల్లో 15మంది ఎస్పీఎస్ సిబ్బంది పని చేస్తున్నారు. ఇటీవల ఆలయంలో చోటు చేసుకున్న ఘటనలో వీరి ఉదాసీనత కూడా ఉందనే విషయం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది.

ఇటీవల దుర్గగుడిలో చోటు చేసుకున్న పరిణామాల్లో పోలీసుల పాత్ర ఉందంటూ వస్తున్న ఆరోపణలపై విచారణకు ఆదేశించినట్లు ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు చెప్పారు. సోమవారం ఆంధ్రప్రభ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విచారణలో తమ సిబ్బంది పాత్ర లేదని వెల్లడైందన్నారు. సమగ్ర విచారణ కోసం అసిస్టెంట్ కమాండెంట్‌ను ఆదేశించామన్నారు. గతంలో అనేక సందర్భాల్లో జరిగినట్లు ప్రధాన పూజారితో బయటి వ్యక్తులు రావడం, మరుసటి రోజు రాష్ట్రపతి సతీమణి పర్యటనను దృష్టిలో ఉంచుకొని తమ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేసి ఉండకపోవచ్చన్నారు. విచారణ తర్వాతనే అన్ని విషయాలు తెలుస్తాయన్నారు.

నేడు కేసీఆర్‌కు విజయవాడలో పాలాభిషేకం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: స్వరాష్ట్రంలోనే కాదు.. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోనూ తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు ఎనలేని ఆదరణ పెరుగుతోంది. తెలంగాణలోని యాదవ సామాజికవర్గానికి రాజ్యసభ టికెట్ ఇస్తానని సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. నగర శివార్లలో యాదవ, కురవ భవన నిర్మాణానికి పది ఎకరాలు, రూ.10 కోట్లను ఆయన కేటాయించారు. యాదవుల సామా జికవర్గాన్ని దృష్టిలో పెట్టుకుని కేసీఆర్ ఈ సామాజికవర్గానికి చేస్తున్న సేవకు గుర్తింపుగా మంగళవారం విజయవాడలో పెద్దఎత్తున ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేయాలని ఏపీ యాదవ సంఘం నిర్ణయించింది. యాదవ యువభేరీ అధ్యక్షుడు లక్కనబోయిన వేణు, కొలుసు సతీష్ యాదవుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది.

సినీనటుడు గుండు హనుమంతరావుకు రూ.5 లక్షల ప్రభుత్వ ఆర్థిక సాయం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న హాస్యనటుడు గుండు హన్మంతరావుకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. అతని చికిత్స కోసం రూ.5 లక్షలను సీఎం రిలీఫ్ ఫండ్ నుండి విడుదల చేసింది. ఈ విషయాన్ని మంత్రి కేటీ రామారావు తన ట్విట్టర్‌లో వెల్లడించారు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందున్నారు.

హనుమంత రావు వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయాల్సి ఉంది. అంత ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇంట్లోనే ఉండి చికిత్స తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ స్పందించింది. చిరంజీవి నుంచి రూ.2 లక్షలు అందజేశారు. ఇప్పుడు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.5 లక్షల సాయం ప్రభుత్వం అందించింది.

రైల్వేపై డ్రోన్ కన్ను!

(మొదటిపేజీ తరువాయి)

చేపడుతున్న అన్ని పనుల్లో ఇక నుంచి డ్రోన్ కెమెరాలను వినియోగించనున్నారు. యూఏవీ, నేత్ర టెక్నాలజీతో ఉన్న డ్రోన్ కెమెరాలను వాడాలని రైల్వే నిర్ణయించింది. రైల్వే ప్రాజెక్టుల పర్యవేక్షణ, ట్రాక్‌ల నిర్వహణ ఇతర మౌలిక సదుపాయల నిర్మాణం తదితర పనులన్నింటిని రియల్ టైంలో పర్యవేక్షిస్తారు. ఈ మేరకు అన్ని రైల్వే జోన్‌లకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని పనుల పర్యవేక్షణకు కెమెరాలను ఉపయోగించుకోవాలని కోరారు. పనులకు అవసరమైన మేరకు డ్రోన్ కెమెరాలను వినియోగించాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రమాదాలు జరిగిన సమయంలో సైతం డ్రోన్ కెమెరాలను ఉపయోగించి సహాయ చర్యలను పర్యవేక్షిస్తారు. వీటితో ఆయా ప్రాజెక్టుల పురోగతి, ట్రాక్‌ల కండీషన్, ప్రధానమైన పనుల ఎలా జరుగుతున్నాయి తదితర అంశాలను నేరుగా తెలుసుకుంటారు. నాన్ ఇంటర్‌లాకింగ్ పనులకు సంబంధించి పనుల సంసిద్ధతను తెలుసుకునేందుకు ఉపయోగిస్తారు. ఆయా మేళాలలో ఎంత భారీ సంఖ్యలో జనం పాల్గొన్నారనే విషయాలు తెలుసుకోవడం, రైల్వే పనులలో మిగిలిపోయిన తుక్కు , స్టేషన్ పరిసరాలలో నెలకొన్న క్రౌడ్ పరిస్థితులను తెలుసుకోనున్నారు. భద్రత, నిర్వహణ, ట్రాక్‌ల పరిస్థితి, మౌలిక సదుపాయలపై ఎప్పటికప్పుడు డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యక్ష పరిస్థితులను తెలుసుకోవడం ద్వారా, విపత్తులను నివారించే అవకాశం కలుగుతుంది.

ఈ సాంకేతికతను అమలుపర్చడం, కెమెరాలను సమకూర్చుకోవడంలో వెస్ట్ సెంట్రల్ రైల్వే ముందంజలో ఉంది. ఇప్పటికే డ్రోన్ కెమెరాలను సమకూర్చుకుని, జోన్ పరిధిలోని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా వాటి పనితీరును పరీక్షిస్తోంది. మూడు డివిజన్లలో ఈ కెమెరాలను అమర్చి ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోంది. జబల్‌పూర్ డివిజన్, భోపాల్ డివిజన్, కోటా డివిజన్‌లలోని పలు రైల్వే ప్రాజెక్టు పనుల వద్ద వీటిని వినియోగిస్తున్నారు. బిన - కత్ని మధ్య నిర్మిస్తున్న మూడో రైలు లైన్ ప్రాజెక్టు పనులను డ్రోన్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. అలాగే కత్ని - సింగ్రౌలి మధ్యలోని డబ్లింగ్ పనులను, రైల్వే బ్రిడ్జిల తనిఖీ, ఘాట్ సెక్షన్‌లలో మలుపుల వద్ద ఉన్న పరిస్థితులను డ్రోన్ కెమెరా ద్వారా తెలుసుకుంటున్నారు.

ప్రమాదాలకు, అవినీతికి చెక్

ఇటీవల కాలంలో ట్రాక్‌లు దెబ్బతిని అనేక రైలు ప్రమాదాలు జరిగాయి. అనేక మంది ప్రయాణికులు చనిపోయారు. రైల్వేకు అపారనష్టం జరిగింది. ఈ ప్రమాదాలు రైల్వేశాఖలో దశాబ్దాలుగా పరిపాటిగా మారాయి. అయితే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని వీటికి చెక్ పెట్టేందుకు రైల్వేశాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. అందులో భాగంగానే డ్రోన్ కెమెరాలను వినియోగించాలని నిర్ణయించారు. దాని వల్ల రైలు ప్రయాణించే ఆయా ట్రాక్‌లలో ఉన్న పరిస్థితిని ఆయా స్టేషన్ మేనేజర్లు ముందుగానే తెలుసుకుంటారు. ఎక్కడైనా ట్రాక్ దెబ్బతిని ఉంటే ఆ మేరకు సంబంధిత విభాగాన్ని అప్రమత్తం చేసి వాటిని సరిచేస్తారు. ఫలితంగా ప్రమాదాలను ముందుగానే నివారించవచ్చు. వీటితో పాటు రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం చాలా నత్తనడకన నడుస్తోంది. దీనిని పరుగులెత్తించేందుకు, పనులను నేరుగా ప్రత్యక్షంగా ఎప్పటికప్పుడు చూడడం వల్ల పనుల్లో వేగం పెంచే అవకాశం ఉంది. వీటితో పాటు ప్రాజెక్టుల్లో చాలా వరకు తుక్కుతదితర అంశాల్లో భారీ అవినీతి జరుగుతోంది. ఈ అవినీతికి కూడా డ్రోన్‌కెమెరాలతో చెక్ పెట్టనున్నారు.

సుప్రీంకోర్టు మెట్లెక్కిన పందెం కోళ్లు

హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: సంక్రాంతి పండుగలో ప్రత్యేక ఆకర్షణగా చెప్పుకునే పందెంకోళ్లు ఇప్పుడు సుప్రీంకోర్టు మెట్లెక్కాయి. ఆంధ్రప్రదేశ్‌లో పండుగ మాటున కోళ్ల పందాలు నిర్వహించడంపై ఇటీవల హైకోర్టు సీరియస్ అయింది. కోడి పందాల నిర్వహణ పేరుతో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేయాలంటూ ఓ వ్యక్తి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. పందాల పేరుతో కోట్ల రూపాయలు చేతులు మారుతుండడంపై పలు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కోళ్ల పందాలు జరగకుండా ఉండాలని ఏపీ డీజీపీ, ఇతర అధికారులకు హైకోర్టు నోటీసులిచ్చింది. పందాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేసింది. బీజేపీ నేత రఘురామ కృష్ణంరాజు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోడి పందాలు తెలుగు ప్రజల సంప్రదాయాలకు చిహ్నమని, సుప్రీంకోర్టు గతంలోనూ కోళ్లను అదుపులోకి తీసుకోవద్దని చెప్పినా పోలీసులు కోళ్లను, వాటిని పెంచే వారిని అదుపులోకి తీసుకున్నారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. కోళ్లకు కత్తులు కట్టకుండా, పందాలు నిర్వహించకుండా అనుమతివ్వాలని రఘురామ కృష్ణంరాజు తరపు న్యాయవాది గల్లా సతీష్ ధర్మాసనాన్ని కోరారు. సంక్రాంతి అతి సమీపంలో ఉండడంతో ఈ పిటిషన్ బుధవారం విచారణకు వచ్చే అవకాశముందని తెలుస్తోంది.

బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. సోమవారం ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ ఉద్యోగుల సంఘ నేతలు కలిశారు. డైరీని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగ సంఘాల నేతలను అభినందిస్తూ రాష్ట్రాభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు.

ఎక్కడైనా, ఎవరితోనైనా చర్చకు సిద్ధం: బుద్ధా వెంకన్న

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని పెన్షన్ల విషయంపై మాట్లాడాటానికి ఏప్రాంతంలోనైనా, ఎవరితోనైనా చర్చించటానికి తాను సిద్ధమని టిడిపి ఎమ్మెల్సీ బుద్ధ వెంకన్న అన్నారు. సోమవారం ఆంధ్రపభతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలో అర్హత గల్గిన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించటమే లక్ష్యంగా చంద్రబాబు కృషిచేస్తున్నారన్నారు. కాని ప్రతి పక్షం అసత్య ప్రచారాలు చేస్తోందని, దాన్ని తిప్పికొట్టడానికే సత్తెనపల్లి బయల్దేరనన్నారు. తాను విజయవాడ నుంచి గుంటూరుకు వెళ్లగానే శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. పెన్షన్ల విషయంపై ఎక్కడైనా, ఏరాజకీయ నాయకుడితోనైనా తాను చర్చించటానికి సిద్ధంగా ఉన్నాన్ని స్పష్టంచేశారు.

సమన్వయంతోనే ప్రగతి సాధ్యం

- విద్యుత్ ఛార్జీల పెంపు లేదు
- ప్రజాభిప్రాయాలతో పనితీరు మెరుగు పర్చుకుందాం
- 2018-19 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ అవసరాలకు ధీటుగా ఉత్పత్తి జరగాలి
- పాలక మండలి పదవీకాలం ముగియనుండటంపై చర్చ



విద్యుత్ నియంత్రణ మండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ జస్టిస్ భవానీ ప్రసాద్

అమరావతి, ఆంధ్రప్రభ: శాస్త్ర, సాంకేతిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతున్న నేటి తరుణంలో విద్యుత్ రంగం కాంతులీనాలంటే అధికారుల సమన్వయంతోనే సాధ్యపడుతుందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ (ఏపీఈఆర్‌సీ) జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్ పేర్కొన్నారు. విద్యుత్ సౌధలో సోమవారం విద్యుత్ నియంత్రణ మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అనేక అంశాలపై చర్చించారు. ఏపీఈఆర్‌సీ పాలక మండలి పదవీకాలంత్వరలోనే ముగియనున్నందున చేపట్టాల్సిన, తీసుకోవాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలవడం అనేది సమిష్టికృషితోనే సాధ్యమైందన్నారు. విద్యుత్‌ఉత్పత్తి వ్యయాన్ని, సరఫరా నష్టాన్ని తగ్గించుకోవడం ద్వారా మరిన్ని లాభాలను ఆర్జించే దిశగా అధికారులు పనితీరు మెరుగుపర్చుకోవాలన్నారు. విద్యుత్ మండలి నిర్ణయాలపై ప్రజల అభిప్రాయాలకు పెద్దపీటత వేయాలని నిర్ణయించారు. తమ విధానాలపట్ల ప్ర జల్లో ఎటువంటి భావన ఉందో తెలుసుకోగలిగితే మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చే అవకాశముంటుందనే భావన వ్యక్తపరిచారు. ఆదిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ తూర్పు, దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థలు (ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్) 2019-19 ఆర్థిక సంవత్సారానికి అవసరమయ్యే విద్యుత్ అవసరాలపై నివేదికను అందజేశాయి. తూర్పు ప్రాంత విద్యుత్ సంస్థ 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.1,522.94 కోట్ల మేర పంపిణీ విలువ (డిస్ట్రిబ్యూషన్ కాస్ట్)ను చూపగా 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.1,772.25 కోట్లుకు పెంచి చూపింది. అలాగే సరఫరా విలువ (ట్రాన్స్‌మిషన్ కాస్ట్)ను రూ. 485.45 కోట్లుగా చూపింది. అలాగే ఎస్‌ఎల్‌డీసీ అంచనా విలువను రూ. 13.85 కోట్లుగా తెలిపింది. సీఈఆర్‌సీ రెగ్యులేషన్ ఛార్జీలను నిర్ధారించే పీజీసీఐఎల్ మరియు యుఎల్‌డీసీ విలువను రూ. 359.12 కోట్లుగా అంచనా వేసింది. ఇక విద్యుత్ సరఫరాలో నష్టాల నివారణ అంశంలో 33 కేవీ విద్యుత్ సరఫరాలో గతేడాది 2.90 శాతం ఉన్న నష్టాన్ని ఈ ఏడాది 2.84 శాతానికి, 11 కేవీ విద్యుత్ సరఫరాలో గతేడాది 3.42 శాతం ఉన్న నష్టాన్ని 3.35 శాతానికి, ఎల్‌టీ విద్యుత్ సరఫరాలో గతేడాది 4.27 శాతం ఉన్న నష్టాన్ని ఈ ఏడాది 4.18 శాతానికి తగ్గించనున్నట్లు తూర్పురంగ సంస్థ తన నివేదికలో తెలియజేసింది. ఇక అమ్మకాల సూచీ రంగంలో ఎల్‌టీ విభాగంలో గతేడాది 843.21 మిలియన్ యూనిట్లనుండి ఈ ఏడాది 9,168.52 మిలియన్ యూనిట్లకు, హెచ్‌టీ విభాగంలో గతేడాది 18,213.21 మిలియన్ యూనిట్లనుండి ఈ ఏడాది 19,751.40 మిలియన్ యూనిట్లకు ఎగబాకినట్లు తెలియజేంది. ఎల్‌టీ రంగంలో గృహావసరాలకు గతేడాది 9,774.99 మిలియన్ యూనిట్లు అమ్మకం కాగా ఈఏడాది 10,585.88 మిలియన్ యూనిట్లు అమ్మనున్నట్లు పేర్కొంది. అలాగే గృహేతర అవసరాలకు ఈ ఏడాది 1,100.97, పరిశ్రమలకు 1,354.41, సాగునీరు, వ్యవసాయ రంగాలకు 2,296.43 మిలియన్ యూనిట్లు అవసరం అవుతుందని పేర్కొంది. ఇక హెచ్‌టీ సప్లై విషయానికి వస్తే కేటగిరీ - 1లో (సాధారణ) అవసరాలకు 6,736.90, కేటగిరి-2 (ఇతర) అవసరాలకు 605.99, ఇతర హెట్‌టీ విభాగాల అవసరాలకు 1,825.63 మిలియన్ యూనిట్ల మేర అవసరాన్ని గుర్తించింది. గృహావసరాలకు 2017-18లో 3,729.00 కోట్లు ఉండగా 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.4,130.58 కోట్లకు, గృహేతర అవసరాలకు రూ.1,839.34 కోట్ల నుండి 2,024.72 కోట్లకు, పారిశ్రామిక రంగంలో రూ.640.95 కోట్ల నుండి రూ.724.21 కోట్లకు, ఇరిగేషన్ మరియు వ్యవసాయ రంగాల్లో రూ.15.58 కోట్ల నుండి రూ.53.69 కోట్లకు పెరగనున్నట్లు తెలియజేసింది. ఇక హెచ్‌టీ రంగంలో జనరల్ విభాగంలో రూ.4,339.06 కోట్లనుండి రూ.4,569.90 కోట్లకు, కేటగిరీ-2లో రూ.6.7.88 కోట్ల నుండి రూ.628.62 కోట్లకు, ఇతర విభాగాల్లో రూ.688.54 కోట్ల నుండి రూ.832.38 కోట్లకు పెరగనున్నట్లు తెలిపింది.

ఇక ఏపీఎస్‌పీడీసీఎల్ కూడా తమ వార్షిక నివేదికను సమర్పించింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 2,919.66 కోట్లుగా డిస్ట్రిబ్యూషన్ కాస్ట్‌ను చూపింది. అలాగే ట్రాన్స్‌మిషన్ కాస్ట్‌ను రూ.931.18 కోట్లుగా చూపింది. ఎస్‌ఎల్‌డీసీ విలువను రూ.26.56 కోట్లుగానూ, పీజీసీఐఎల్ మరియు యుఎల్‌డీసీ విలువను రూ. 12.93 కోట్లగా తెలిపింది. వివిధ రంగాల నుండి రూ. 14,794.21 కోట్లు మేర ఆదాయాన్ని ఆర్జించాలని లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపింది. అయితే, రూ.13,482.95 కోట్లమేర చేరుకునే అవకాశమున్నట్లు పేర్కొంది.

ఎల్‌టీ రంగంలో 7.32 శాతం నుండి 6.84 శాతానికి తగ్గగా, హెచ్‌టీ రంగంలో 4.92 శాతం ఉండి 7.87 శాతానికి పెరిగినట్లు తెలిపింది. ఆదాయ విషయంలో ఎల్‌టీ విభాగంలో రూ.6,698.12 కోట్ల నుండి రూ.7,370.98 కోట్లకు, హెచ్‌టీ విభాగంలో రూ.6,784.82 కోట్లనుండి రూ.7,445.49 కోట్లు ఆదాయం పెరిగిందన్నారు. మొత్తంమీద ఆదాయం రూ. 13,482.95 కోట్లనుండి రూ.14,816.47 కోట్లకు పెరగనున్నట్లు అంచనా వేసింది.

'సర్వజనరంజకంగా విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయాలు'

అమరావతి, ఆంధ్రప్రభ: సర్వజన రంజకంగా విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయాలు ఉండబోతున్నాయని ఆంధ్రప్రదేశ్ విద్యుత్‌నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ గ్రంధి భవనీ ప్రసాద్ పేర్కొన్నారు. విద్యుత్ సౌధలోని ఏపీ జెన్‌కో కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నింత్రణ మండలి సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జస్టిస్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ, 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విద్యుత్ అవసరాలపై ఏపీ ఈపీడీసీఎల్, ఏపీ ఎస్‌పీడీఎల్‌లు తమకు నివేదికను అందజేశాయని తెలిపారు. 2018-19 ఆరిక సంవత్సరంలో విద్యుత్ ఛార్జీల పెంపు లేకుండానే ఈ ప్రతిపాదనలు తమకు అందినట్లు వివరించారు. అధికారుల సమష్టి కృషితో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉదయ్ స్కీం అమల్లో ఏపీఈపీడీసీఎల్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలువగా, ఏపీఎస్‌పీడీఎల్ ద్వితీయ స్థానంలో నిలచిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం అనతికాలంలోనే విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్ నూతన శకానికి నాంది పలికిందన్నారు. ఈ స్ఫూర్తితోనే ఈ ఏడాది విద్యుత్ అవసరాలపై సమగ్ర నివేదిక తయారు చేస్తున్నామన్నారు. ఈ నివేదికలపై ప్రజాభిప్రాయాన్ని కోరుతామని తెలిపారు. ఇందుకోసం ఫిబ్రవరి 5 నుండి 9 వరకు విశాఖపట్టణం, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, తిరుపతి నగరాల్లో ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని నలుమూలల ఈ కమిటీ పర్యటించడం సాధ్యపడే విషయం కానందున ప్రధాన నగరాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నామని తెలిపారు. ఈ విధంగా ప్రజాభిప్రాయ సేకరణ జరిపిన అనంతరం మార్చి 31నాటికి వార్షిక బడ్జెట్‌ను రూపొందిస్తామని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక రంగం విప్లవాత్మకమైన అభివృద్ధిని సాధించిన నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తి ధర తగ్గిపోయిందన్నారు. అయినప్పటికీ తూర్పు, దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థలు లోటులోనే ఉన్నాయన్నారు. వీటిని అధిగమించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. గడచిన మూడేళ్లుగా విద్యుత్ కొనుగోలు ఖర్చును తగ్గించగలిగామన్నారు.

నర్సాపూర్-కాకినాడ-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సంక్రాంతి సందర్భంగా నర్సాపూర్ - సికింద్రాబాద్, కాకినాడ - సికింద్రాబాద్ మధ్యన రెండు ప్రత్యేక రైళ్లను నడిపించడానికి దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. నర్సాపూర్ - సికింద్రాబాద్ సువిధ ఎక్స్‌ప్రెస్ 17న నర్సాపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు సికింద్రాబాద్ చేరుకుంటుంది. కాకినాడ - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు 18న కాకినాడలో బయలుదేరి మరుసటి రోజు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు అన్ని ప్రధాన స్టేషన్లలో నిలుపుదల చేయడం జరుగుతుంది.

లోకో రన్నింగ్ సిబ్బందికి ఊరట

సిగ్నల్ రన్నింగ్ ఎట్ డేంజర్ కేసుల్లో లోకో రన్నింగ్ సిబ్బందిని నిర్దాక్షిణ్యంగా విధుల నుండి తొలగించే నిబంధనలను భారతీయ రైల్వేలు సడలించాయి. ఇక మీదట నిర్దాక్షిణ్యంగా ఏ ఒక్కరిని తొలగించబోరని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లయిస్ యూనియన్ తెలిపింది. ఎస్‌సీఆర్ఇ సంఘ్ జాతీయ నాయకులు మర్రి రాఘవయ్య కృషి ఫలితంగా కఠిన నిబంధనలను తొలగించడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు.

జన్మభూమి సభలకు

జనం వెల్లువ

- 37 లక్షల మంది హాజరు, 7 లక్షలకు పైగా వినతులు
- ఆదివారం తగ్గిన వినతులు, జనం..
- పెన్షన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాల కోసం ఆర్జీలు
- కార్యక్రమాల సంతృప్తిపై ప్రజాభిప్రాయం సేకరణ



మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా నిర్వహిస్తోన్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి జనం వెల్లువలా వస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా 37 లక్షల మంది జనం హాజరు కావడం విశేషం. ఇప్పటి వరకు సుమారు 57 వేల గ్రామ సభలు నిర్వహించగా 7 లక్షలకు పైగా వినతులు వచ్చాయి. ఐదోరోజు కంటే ఆరో రోజు (7వ తేదీ) వినతులు జనం సభలకు 42 శాతం తగ్గగా, వినతులు కూడా 44 శాతం తగ్గాయి.

ఇప్పటి వరకు కార్యక్రమ వివరాలిలా ఉన్నాయి.. (2 నుంచి 7 వరకు)

- మొత్తం నిర్వహించిన గ్రామ సభలు - 56,473
- మొత్తం వచ్చిన వినతులు - 6,96,656
- పాల్గొన్న ప్రజల సంఖ్య - 36,18,754
- రేషన్‌కార్డుల పంపిణీ - 1,14,098
- నూతనంగా మంజూరు చేసిన పింఛన్లు - 64,999
- వైద్యారోగ్య శిబిరాలు - 11,060
- రోగుల సంఖ్య - 8,41,858
- కళ్ల జోళ్ల పంపిణీ - 29,346
- యాక్టివిటీ బి కింద బహుమతులు పురస్కారాలు - 1,32,867

ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జన్మభూమి సభలకు అన్ని జిల్లాలకు సి గ్రేడ్ రావడం విశేషం. ఆరో రోజు గ్రేడింగ్‌లో అనంతపురం జిల్లా 29 పాయింట్లతో ముందుంటే, కడప జిల్లా కేవలం 18 స్కోరుతో చివరన నిలిచింది.

జన్మభూమి-మా ఊరు కార్యక్రమాలపై గ్రామాల్లో ప్రజలను ఐవీఆర్‌ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్ మీడియాకు తెలిపారు. రేషన్‌కార్డులు, అభివృద్ధి కార్యక్రమాలు, పెన్షన్లు, అధికారుల విధానంపై జనాభిప్రాయ సేకరణ చేస్తున్నామన్నారు. పెన్షన్లపై 68 శాతం సంతృప్తి వ్యక్తం చేయగా, 37 శాతం మంది సరిగా అందడంలేదన్నారు. అదేవిధంగా రేషన్‌కార్డులు 67 శాతం, అభివృద్ధి కార్యక్రమాల్లో 52 శాతం, అధికారుల విధానంపై 49 శాతం సంతృప్తి వ్యక్తం చేశారని వివరించారు. ప్రజలు బాగులేదన్న కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి సరిదిద్దుతున్నట్లు ఆయన తెలిపారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమం సందర్భంగా వచ్చిన సమస్యల పరిష్కారంపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిందిగా అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఐవీఆర్‌ఎస్ ద్వారా 78 వేల మందికి ఫోన్ చేసి అభిప్రాయాలను సేకరించడం జరిగిందన్నారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా రోజుకు 20 లక్షల మందితో మాట్లాడే అవకాశం ఉందన్నారు. దేశంలోనే ఇదొక పెద్ద విధానమని ఆయన పేర్కొన్నారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమం సందర్భంగా జిల్లాలు, మండలాలు, గ్రామాలకు గ్రేడ్లు నిర్ణయిస్తున్నామన్నారు. ఏ, బీ, సీ గ్రేడ్లు వచ్చిన జిల్లాలు, మండలాలు, గ్రామాల వివరాలను ఆయన మీడియాకు వివరించారు.

ఏడోరోజు (8వ తేదీ) సాయంత్రం 6 గంటల వరకు అందిన వివరాలు..

- మొత్తం వచ్చిన వినతులు - 32,005
- పాల్గొన్న ప్రజలు - 1,64,139
- రేషన్‌కార్డుల పంపిణీ - 5,724
- నూతన పెన్షన్లు - 3,438
- వైద్య శిబిరాలు - 495
- కళ్ల జోళ్ల పంపిణీ - 1252
- ఇళ్ల స్థలాలు పంపిణీ - 1686
- పనిముట్ల పంపిణీ - 2,660
- పశువైద్య శిబిరాలు - 657
- యాక్టివిటీ బి కింద బహుమతులు పురస్కారాలు - 6,689

బీజేపీని గద్దె దింపడమే

లక్ష్యంగా పనిచేద్దాం

- లౌకికవాద పరిరక్షణకు విశాల ఐక్యవేదిక అవసరం
- ఘనంగా సీపీఐ జాతీయ సమితి సమావేశాలు ప్రారంభం: సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి



స్వాగతోపన్యాసం చేస్తున్న సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ: భారతీయ జనతా పార్టీని అధికారం నుంచి తప్పించడమే తక్షణ రాజకీయ కర్తవ్యమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అన్నారు హిందుత్వశక్తుల దాడులపై పోరాటాలు చేయడం చాలా అవసరమని, దేశంలో ప్రజాస్వామ్యం, లౌకిక వాదాన్ని కాపాడాలనుకునే రాజకీయ, రాజకీయేతర శక్తులతో కలసి విశాల ఐక్య వేదికను ఏర్పాటు చేయాలని అందుకు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సీపీఐ జాతీయ సమితి సమావేశాలు విజయవాడలో సోమవారం ఘనంగా ప్రారంభమైనాయి.మూడు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాలలో తొలుత సీపీఐ పార్టీ కార్యాలయం దాసరి భవన్ ఎదుట పార్టీ జెండాను కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు హాషీమ్ ఫైజీ ఆవిష్కరించారు. అనంతరం సమావేశాలు ప్రారంభమైనాయి. తొలుత సంతాప తీర్మానాలను అతుల్ కుమార్ అంజన్ ప్రవేశపెట్టగా కొద్దిసేపు మౌనం వహించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి ప్రారంభోపన్యాసం చేస్తూ ధరల పెరుగుదలతో ప్రజల పై పెనుభారం పడుతుందని, నరేంద్రమోడీ వచ్చాక గ్యాస్ చార్జీలు నానాటికి పెంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల్లో తీవ్ర స్థాయిలో అసహనం నెలకొం దన్నారు. నల్లధనాన్ని వెనక్కి తీసుకురావాలని బీజేపీకి లేదని, అవినీతిలో బీజేపీ బాగా కురుకుపో యిందని ఆయన ఆరోపించారు. దళితులు, జర్నలిస్టుల పై దాడులు పెరిగిపోయాయని, ప్రభుత్వం దళితుల పై కేసులు నమోదు చేసి ఒత్తిళ్లకు గురి చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాలన, న్యాయవ్యవస్థలను సైతం తమ గుప్పిట్లో పెట్టుకుని నియంత్రిస్తోందని ఆయన ఆరోపించారు. హిందుత్వశక్తుల పేరుతో జరుగుతున్న దాడులు మైనార్టీల్లో అభద్రతభావాన్ని కలిగిస్తోందన్నారు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు, స్టేటస్టిక్స్ ధోరణులు పెరుగుతున్న నేపథ్యంలో తమ పార్టీ తీవ్రంగా ఆందోళన చెందుతుందన్నారు. అమెరికా-ఉత్తర కొరియా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల సహా ఆయా దేశాలల్లో నెలకొన్న అర్థిక సంక్షోభాలు, రాజకీయ పరిణామల ను సురవరం ఈ సందర్భంగా ప్రస్తవించారు. వాతవరణ కాలుష్యం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న మూడేళ్లలో పార్టీ తీసుకోవల్సిన రాజకీయ తీర్మానాల పై సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. కేరళలో ఏప్రిల్ 25వ తేదీ నుంచి 29 వరకు జరిగే 23వ మహాసభల్లో ఆమోదించాల్సిన రాజకీయ తీర్మానం గురించి ఈ సమావేశంలో చర్చించనున్నట్లు సురవరం వివరించారు.

ఈ సమావేశాలకు సీపీఐ రాష్ట్ర కార్యాదర్శి కె. రామకృష్ణ అధ్యక్షత వహించాగా పార్టీ కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు హాషీమ్ ఫైజీ, డి రాజా, నారాయణ, రామేంద్రకుమార్, అతుల్ కుమార్ అంజన్ , పన్నీర్ రవీంద్రన్, నాగేంద్రనాద్ ఝా, అమర్‌జిత్ కౌర్ వేదిక పై ఆసీనులయ్యారు. ఇంకా వివిధ రాష్ట్రా ల నుంచి హాజరైన రాష్ట్ర సమితి ప్రతినిధులు కౌన్సిల్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అగ్రి ఆధారిత ఆర్థిక వ్యవస్థే మేలు

మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్

అమరావతి, ఆంధ్రప్రభ: వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థతోనే దేశం మరింత అభివృద్ధి చెంద టంతోపాటు అన్ని రంగాల్లోనూ వృద్ధిని సాధించే అవకాశం ఉంటుందని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ అన్నారు. సోమవారం విజయవాడలోని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యం లో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమెరికా తరహా ఆర్థిక వ్యవస్థ కోసం వెంపర్లాడుతుందని, కాని ఆ వ్యవస్థ వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆదేశంలో రుజువైంద న్నారు. పాలకులు ఢిల్లీలో కూర్చొని మేక్ ఇన్ ఇండియా పేరుతో నినాదాలు ఇస్తున్నారేకాని, క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిశీలన చేయటంలేదని మండిపడ్డారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయటం వల్ల యవత ఉద్యోగావకాశాలు లభించడంతోపాటు ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతుం దని చెప్పారు. దేశంలోని కార్మిక సంఘాలు అభివృ ద్ధిని, సంక్షేమాన్ని కోరుకుంటు న్నాయని, కాని పాలకులు చట్టాల్లో తెస్తున్న మార్పుల వల్ల కార్మికుల ప్రయోజనాలకు భంగం వాటిల్లు తోందని ఆందో ళన వ్యక్తంచేశారు. ఏపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పటికే కార్మిక చట్టాల సంస్కరణల బిల్లులను ప్రవేశపెట్టాయని, దీనిని నిరసిస్తూ గత నవంబర్‌లో జాతీయ కార్మిక సమ్మె నిర్వహించినట్లు తెలిపారు. అంగన్ వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఆశా పథకాలలో పనిచేస్తున్న వారికి కనీస వేత ఇవ్వాలని ఉద్యోగ, సామాజిక భద్రత కల్పించేందుకు ఈనెల 17న ఢిల్లీలో దేశవ్యాప్త సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు కార్మిక సంఘాలు మద్దతిస్తు న్నట్లు చెప్పారు. అలాగే పెరుగుతున్న ధరలను తగ్గించేం దుకు 23న ఆంధ్రప్రదేశ్ సత్యాగ్రహం చేయనున్నట్లు తెలిపారు. నాలుగేళ్లుగా నిత్యావరసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని వాటిని అదుపుచేయటంలో కేంద్రం పూర్తిగా విఫలమైం దన్నారు. అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించటంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ మీట్ ది ప్రెస్‌లో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, ఏపీయూడబ్ల్యూజే అర్బన్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి విలియం పాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్కే బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, ప్రధాన కార్యదర్శి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 1,385 అధ్యాపక పోస్టుల ఖాళీలు

భర్తీకి ఏపీపీఎస్‌సీ చర్యలు

అమరావతి, ఆంధ్రప్రభ : ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని వివిధ విశ్వ విద్యాలయాల్లో పేరుకుపోయిన అధ్యాపకుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన వివరాలను ఏపీపీఎస్‌సీకి అందజేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసే బాధ్యతను ఏపీపీఎస్‌సీకి అప్పగించారు.. రాష్ట్రంలోని వివిధ విశ్వ విద్యాలయాల్లో ఏఏ పోస్టులు ఖాళీగా ఉన్నాయో ఇప్పటికే ప్రభుత్వం వివరాలు సేకరించింది.అన్నీ కలిపి 1385 పోస్టులును భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.అన్ని యూనివర్శిటీల్లో పెద్ద ఎత్తున ఖాళీలు పేరుకుపోవడంతో విద్యా బోధన ఇబ్బందికరంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం వీటి భర్తీకి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంది. ఖాళీల వివరాలు యూనివర్శిటీ వారిగా కింది విధంగా ఉన్నాయి.

యూనివర్శిటీ పేరు	ప్రొఫెసర్ పోస్టు	అసోసియేట్ ప్రొఫెసర్	అసిస్టెంట్ ప్రొఫెసర్	మొత్తం ఖాళీలు
ఆంధ్రా యూనివర్శిటీ	22	28	341	391
శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీ	10	17	174	201
నాగార్జున యూనివర్శిటీ	13	4	80	97
శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ	3	3	112	118
ద్రావిడియన్ యూనివర్శిటీ	1	4	13	18
శ్రీపద్మావతి యూనివర్శిటీ	0	2	27	29
జెఎన్‌టీయూ-కాకినాడ	1	6	34	41
జెఎన్‌టీయు- అనంతపూర్	10	17	131	158
డాక్టర్ బీఆర్‌అంబేద్కర్	5	10	33	48
ఆదికవి నన్నయ్య	5	10	24	39
కృష్ణా యూనివర్శిటీ	6	14	20	40
విక్రమసింహపురి యూనివర్శిటీ	15	28	33	76
రాయలసీమ యూనివర్శిటీ	7	14	40	61
యోగివేమన యూనివర్శిటీ	2	18	48	68
మొత్తం	100	175	1110	1385

నూతన సంవత్సరంలోనూ

అదే జోరు

- ఈ ఏడాది ఆరు సినిమాలు సిద్ధం
- గత ఏడాది ఆరు సినిమాలు విజయవంతం
- ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు: నిర్మాత దిల్‌రాజు



సింహాచలం(విశాఖపట్నం), ప్రభన్యూస్ బ్యూరో: తెలుగు ప్రేక్షకుల ఆదరణ లభించే సినిమాలు తీయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు అన్నారు. సోమవారం సింహాచలం శ్రీ వరాహాలక్ష్మీనరసింహ స్వామిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దిల్‌రాజు స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ గత ఏడాది ఆరు సినిమాలు విడుదల చేయడం జరిగిందని అన్నింటిని ప్రేక్షకులు పూర్తి స్థాయిలో ఆదరించారన్నారు. శతమానం భవతి సినిమాకు మరింత ఆదరణ లభించిందన్నారు. ఈ ఏడాది కూడా అదే రీతిన ప్రేక్షకులు మెచ్చే విధంగా ఆరు సినిమాలు నిర్మించనున్నట్లు దిల్‌రాజు వివరించారు. నితిన్ హీరోగా శ్రీనివాసకళ్యాణం, మహేష్‌బాబు, రామ్‌లు హీరోగా మరో రెండు సినిమాలు నిర్మిస్తున్నామన్నారు. ఇక లవర్‌తో పాటు మరో రెండు సినిమాలు కూడా నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఈ సినిమాలు కూడా ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నామన్నారు. తొలుత సింహాద్రి నాదుడికి దిల్‌రాజు ప్రత్యేక పూజలు నిర్వహించి తదుపరి సుదర్శన నరసింహహోమంలో పాల్గొన్నారు.

తొలి టెస్టు సఫారీలదే

- 73 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా విజయం
- రెండో ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే చేతులెత్తేసిన ఇండియా
- ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ ఫిలాండర్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాతో ఆడుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో ఇండియా ఓటమినుంచి తప్పించుకోవడానికి శతవిధాలా ప్రయత్నించి విఫలమైంది. భారత్ విజయానికి మరో 72 పరుగుల దూరంలో భారత్ ఇన్నింగ్స్ (135/ఆలౌట్) ముగిసింది. దీనితో సఫారీలు మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించారు. భారత్ తన రెండో ఇన్నింగ్స్‌లో బ్యాట్స్‌మన్లు ఆదినుంచే తడబడ్డారు. ఏడో ఓవర్లోనే తొలి వికెట్ పడింది. పిచ్ బౌలింగ్‌కు అనుకూలించడంతో సఫారీ బౌలర్లు చెలరేగిపోయారు. ముఖ్యంగా భారత తొలి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు తీసిన



ఫిలాండర్

ఫిలాండర్ రెండో ఇన్నింగ్స్‌లో రెచ్చిపోయాడు 15.4 ఓవర్లు వేసి 42 పరుగిలిచ్చి 6 వికెట్లు తీశాడు. కాగా, సఫారీలు తొలి ఇన్నింగ్స్‌లో 286 పరుగులు చేయగా, భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 130పరుగులకు ఆలౌట్ అయింది. మూడోరోజు ఆట వర్షార్పణం కావడంతో సోమవారం నాలుగోరోజు వరుణుడు తెరిపి ఇచ్చాడు. రెండో ఆట ముగిసే సమయానికి క్రీజులో ఉన్న సఫారీ బ్యాట్స్‌మన్లు అషీం ఆమ్లా(4), రబాడా(2) నాలుగోరోజు రెండో ఓవర్లో మహ్మదా షమీ వేసిన బంతిని ఆడబోయి ఆమ్లా రోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన డివిలియర్స్ నిలకడగా ఆడుతూ సఫారీల స్కోరును ముందుకు పరుగెత్తించాడు. జట్టు స్కోరు 73 పరుగుల వద్ద రబాడా(5) వికెట్‌ను కూడా షమీ చేజిక్కుంచుకున్నాడు. ఆ తర్వాత వచ్చిన బ్యాట్స్‌మన్‌లెవరూ కూడా భారత బౌలర్ల ధాటికి నిలబడలేకపోయారు. సఫారీల వికెట్లు టపటపా రాలిపోయాయి. భారత బౌలర్ల సహనాన్ని పరీక్షిస్తున్న డివిలీయర్స్ 35 పరుగులు చేసి బూమ్రా బౌలింగ్‌లో భువనేశ్వర్ క్యాచ్ పట్టగా పదవ వికెట్‌గా వెనుతిరిగాడు. మొత్తానికి సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌లో 130 పరుగులు చేశారు. భారత్ గెలవాలంటే 208 పరుగులు సాధించాల్సి ఉంది. అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన భారత ఓపెనెర్లు శిఖర్ ధావన్, మురళీ విజయ్‌లు సఫారీల బౌలింగ్ ద్వయం ఫిలాండర్, మోర్కెల్లను బాగానే ఎదుర్కొన్నారు. అయితే ఫిలాండర్ ఇన్నింగ్స్ ఏడవ ఓవర్లో ధావన్‌ను ఔట్ చేశాడు. ధావన్ 20 బంతులు ఎదుర్కొని 16 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన పూజారా, విజయ్‌తో కలిసి స్కోరును నెమ్మదిగా కొనసాగిస్తున్న సమయంలో.. విజయ్13 (32 బంతులు) రెండో వికెట్‌గా ఫిలాండర్‌కు చిక్కాడు. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ కోహ్లీ వీరోచితంగా ఆడుతూ స్కోరును ముందుకు పరుగెత్తించాడు. కోహ్లీ బరోసాతో భారత్ విజయ్ ఖాయమని అందరూ అనుకుంటున్న సమయంలో.. పూజారా 4(13బంతులు) మోర్కెల్ బౌలింగ్‌లో డికాక్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. 13 ఓవర్లు గడిచేసరికి భారత్ స్కోరు 39/3. అనంతరం బ్యాటింగ్ వచ్చిన రోహిత్ శర్మ, కెప్టెన్ కోహ్లీతో జతకలిశాడు. 21 ఓవర్లు ముగిసే సరికి భారత్ 71 పరుగులకు 3



వికెట్లు కాగా అనంతరం భారత్ వరుసగా వికెట్లను కోల్పోయింది. 22వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన ఫిలాండర్, కోహ్లీని28(బంతులు40) ఎల్బీడబ్ల్యు చేశాడు. 22 ఓవర్లు ముగిసేసరికి భారత్ స్కోరు 71/4గా ఉంది. కోహ్లీ స్థానంలో బ్యాటింగ్‌కు సాహా వచ్చాడు. 24వ ఓవర్లో రోహిత్ 10(30బంతులు) ఫిలాండర్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆదుకున్న హార్ధిక్ పాండ్యా ఈ సారీ విఫలమయ్యాడు. కేవలం ఒక పరుగు చేసి రబాడా బౌలింగ్‌లో డివిల్లియర్స్‌కు క్యాచ్ ఇచ్చి ఆరవ వికెట్‌గా వెనుదిరిగాడు. అప్పటికి భారత్ స్కోరు 77 పరుగులు మాత్రమే. అనంతరం ఆశ్విన్ బ్యాటింగ్‌కు వచ్చాడు. 29వ ఓవర్లో రబాడా బౌలింగ్‌లో సాహా 8(19బంతులు) ఎల్బీడబ్ల్యుగా వెనుదిరిగాడు. దీనిపై భారత్ రీవ్యూ కోరగా నిర్ణయం సఫారీలకు అనుకూలంగా వచ్చింది. సాహా స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన భువనేశ్వర్‌కుమార్, ఆశ్విన్‌కు జతకలిసి భారత స్కోరును వంద దాటించారు. అడపా దడపా ఫోర్లు కొడుతూ వీరిద్దరూ కుదురుకున్నట్లే కన్పించారు కాని.. ఫిలాండర్ వేస్తున్న 43వ ఓవర్లో ఆశ్విన్ బంతిని కట్ చేయబోయి డికాక్‌కు క్యాచ్ ఇచ్చాడు. అంతవరకు భారత శిబిరంలో ఆశలు రేపిన ఆశ్విన్ వెనుదిరగడంతో ఇక భారత్ ఓటమి దాదాపుగా నిశ్చయమైంది. అనంతరం షమి వచ్చి నాలుగుపరుగులు చేసి ఫిలాండర్ బౌలింగ్‌లో డుప్లెస్సిస్‌కు క్యాచ్ ఇచ్చి ఔట్‌కాగా బూమ్రా ఫిలాండర్ బౌలింగ్‌లోనే డుప్లెస్సెస్‌కే క్యాచ్ ఇచ్చి పరుగులేమీ చేయకుండానే ఔటయ్యాడు. దీనితో భారత్ 135 పరుగులకు ఆలౌట్ అయింది. సఫారీ జట్టు 72 పరుగుల తేడాతో గెలిచింది. రెండు ఇన్నింగ్స్‌లలో భారత్ నడ్డి విరిచిన ఫిలాండర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. కాగా భారత్ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 17 ఫోర్లు మాత్రమే నమోదయ్యాయి. వాటిలో ఆశ్విన్ కొట్టినవి 5 కాగా, 4 ఫోర్లు కోహ్లీ, విజయ్, ధావన్, సాహాతలా 2 ఫోర్లు కొట్టగా, భువనేశ్వర్ కుమార్, షమీ చెరొక ఫోర్ కొట్టారు. సిక్సర్లు నమోదు కాలేదు.

స్కోరు బోర్డు:

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 286 ఆలౌట్, భారత్ తొలి ఇన్నింగ్స్:209 ఆలౌట్,

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: ఎల్గర్ (సి) సాహా (బి) పాండ్యా 25, మర్క్రమ్ (సి)భువనేశ్వర్ (బి) పాండ్యా 34, ఆమ్లా (సి) రోహిత్ (బి) షమీ 4, డివిలియర్స్ (సి) భువనేశ్వర్ (బి) బుమ్రా 35, డు ప్లెసిస్ (సి) సాహా (బి) బుమ్రా 0, డి కాక్ (సి) సాహా (బి) బుమ్రా 8, ఫిలాండర్ ఎల్బీడబ్ల్యు(బి) షమి 0, మహరాజ్ (సి)సాహా(బి) భువనేశ్వర్ 15 రబాడ (సి) కోహ్లీ (బి) షమీ 5, స్టెయిన్ నాటౌట్ 0, మోర్కెల్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 2, ఎక్స్‌ట్రాలు 2, మొత్తం 130ఆలౌట్(41.2 ఓవర్లు), వికెట్ల పతనం: 52-1, 59-2, 66-3,73-4, 82-5, 92-6, 95-7, 122-8, 130-9, 130-10.

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) డివిల్లియర్స్ (బి) ఫిలాండర్ 13, ధావన్ (సి) మోరిస్ (బి) మోర్కెల్ 16, పుజారా బ్యాటింగ్ 5, విరాట్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 4, కోహ్లీ ఎల్బీడబ్ల్యు (బి) ఫిలాండర్ 28, రోహిత్ శర్మ (బి) ఫిలాండర్ 10, సాహా ఎల్బీడబ్ల్యు (బి) రబాడా 8, పాండ్యా (సి)డివిల్లియర్స్ (బి)రబాడా 1, ఆశ్విన్ ఎల్బీడబ్ల్యు (బి) ఫిలాండర్ 37, భువనేశ్వర్ కుమార్ నాటౌట్ 13, షమీ (సి) ప్లెస్సిస్ (బి)ఫిలాండర్ 4, బుమ్రా (సి) ప్లెస్సిస్ (బి)ఫిలాండర్ 0, ఎక్స్‌ట్రాలు 1,

మొత్తం :135 ఆలౌట్(42.4 ఓవర్లు), **దక్షిణాఫ్రికా బౌలింగ్:** ఫిలాండర్ 15.4-42-6, మోర్కెల్ 11-39-2, రబాడా12-41-2,మహరాజ్ 4-12-0

క్రీడాప్రభ

యాషెస్‌తో టెస్ట్ ర్యాంకులు తారుమారు

ఇంగ్లండ్ ఐదుకు డౌన్, ఆస్ట్రేలియా 3కు అప్



దుబాయ్: యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా విజయం అనంతర ప్రపంచ టెస్ట్ ర్యాంకులు మారాయి. ఇప్పటివరకు ఐదో స్థానంలో ఉన్న ఆస్ట్రేలియా 104 పాయింట్లతో మూడో స్థానానికి ఎగబాకగా, మూడో స్థానంలో ఉన్న ఇంగ్లండ్ 99 పాయింట్లతో ఐదో స్థానానికి దిగజారింది. కాగా భారత్ 124 పాయింట్లతో అగ్ర స్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా111 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

ఆల్ ఇండియా యూనివర్శిటీ

మహిళా టెన్నిస్ విజేత ముంబై యూనివర్శిటి



విశాఖస్పోర్ట్స్, ప్రభన్యూస్: ఆల్ ఇండియా యూనివర్శిటీ మహిళా టెన్నిస్ పోటీల్లో ముంబై యూనివర్శిటీ విజేతగా నిలిచింది. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా గత మూడు రోజులుగా జరుగుతున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయం మహిళా టెన్నిస్ పోటీలు సోమవారం ముగిసాయి. ద్వితీయ స్థానంలో ఎస్.ఆర్.ఎమ్. విశ్వవిద్యాలయం, తృతీయ స్థానంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం, నాల్గవ స్థానంలో పూణె విశ్వవిద్యాలయం విజేతలుగా నిలిచాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్.పీ. రాహుల్‌దేవ్‌శర్మ విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఆచార్య కె.లక్ష్మీప్రసాద్, గీతం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి కె. రామకృష్ణ మహిళా టెన్నిస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాదే యాషెస్



సిడ్నీ: ఆస్ట్రేలియా యాషెస్‌ను దక్కించుకుంది. సోమవారం సిడ్నీ మైదానంలో ముగిసిన చివరి టెస్టులో ఇన్నింగ్స్, 123 పరుగుల ఆధిక్యతో గెలిచి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-0 తేడాతో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో నాల్గవ టెస్ట్ డ్రాగా ముగిసింది. చివరి టెస్టులో ఇంగ్లండ్ ఆటగాళ్లు ఆస్ట్రేలియా బౌలర్లను ఎదుర్కొనడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్లు ఏదశలోనూ అసీస్ బౌలర్లను నిలువరించలేకపోయారు. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్ ప్యాట్ కమిన్స్ చెలరేగిపోయాడు. ఇంగ్లండ్ రెండు ఇన్నింగ్స్‌లో మొత్తం 8 వికెట్లు తీసి ఆ జట్టు నడ్డి విరిచాడు. మ్యాచ్ ప్రారంభంలో ఇంగ్లండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఇంగ్లండ్ తన తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి తట్టకుకోలేకపోయారు. 346 పరుగులు చేసి ఆలౌటయింది. కమిన్స్ నాలుగు వికెట్లు తీశాడు. మిచెల్ స్టార్క్, హేజిల్‌వుడ్ తలా రెండు వికెట్లు, లియన్ ఒక వికెట్ తీశాడు. అనంతరం ఆట ప్రారంభించిన ఆస్ట్రేలియా తన తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లకు 649 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ బ్యాట్స్‌మన్ ఉస్మాన్ ఖ్వాజా 171పరుగులు, షువాన్ మార్చ్ 156 పరుగులు, మిచెల్ మార్ష్ 101పరుగులు చేయగా, కెప్టెన్ స్టీవెన్ స్మిత్ 83 పరుగులు చేశాడు. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో కూడా ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి తలవంచి 180(88.1 ఓవర్లు) పరుగులు చేసి ఆలౌట్ అయింది. దీనితో ఆసీస్ జట్టు ఇన్నింగ్స్, 123 పరుగుల ఆధిక్యతతో యాషెస్‌ను గెలుచుకుంది. 2015లో జరిగిన యాషెస్ సిరీస్‌లో ట్రోఫీని ఇంగ్లండ్ గెలుచుకుంది. చివరి రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లండ్ నాలుగో రోజు నాటౌట్ నిలిచిన జోరూట్ ఆస్ట్రేలియాకు మింగుడుపడలేదు. చివరి రోజు కూడా బ్యాంటింగ్ చేసి తీవ్ర అనారోగ్యం పాలై రిటైర్డ్ అవుట్‌గా మధ్యలోనే వెనుతిరిగాడు. రూట్ 58 పరుగులు చేశాడు. దీనితో ఆస్ట్రేలియాకు తమ విజయంపై మరింత విశ్వాసం పెరిగింది. ఆ తర్వాత వచ్చిన ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్లలో వికెట్ కీపర్ బెయిర్‌స్టో (38పరుగులు నాటౌట్), టామ్ కర్రెన్ (23 పరుగులు) మినహా ఎవరూకూడా పెద్దగా రాణించలేదు. రెండో ఇన్నింగ్స్‌లో కూడా కమిన్స్ తన బుల్లెట్ లాంటి బంతులతో ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్లకు చుక్కలు చూపించాడు. కమిన్స్ నాలుగు వికెట్లు చేజిక్కుంచుకోగా, లియాన్ మూడు వికెట్లు, స్టార్క్, హేజిల్‌వుడ్ తలా ఒక వికెట్‌ను తీశారు. మొత్తం 8 వికెట్లు తీసి ఆస్ట్రేలియా చివరి టెస్టులో కీలక భూమిక నిర్వహించిన కమిన్స్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకోగా సిరీస్‌లో మొత్తం ఏడు ఇన్నింగ్సుల్లో 687 పరుగులు చేసిన ఆధునిక బ్రాడ్‌మన్(అభిమానులు ఇచ్చిన పేరు) కెప్టెన్ స్మిత్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. యాషెస్ సిరీస్‌లో ఒక కెప్టెన్‌గా అత్యధిక పరుగులు చేసిన మూడవ బ్యాట్స్‌మన్‌గా స్మిత్ రికార్డు సృష్టించాడు. కాగా యాషెస్ సిరీస్‌లలో 500కు పైగా పరుగులు చేసిన వారిలో స్మిత్ ఏడవ వాడు. ఆస్ట్రేలియా ఈ విజయంతో ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానం పొందగా, ఇంగ్లండ్ ఐదవ స్థానానికి పడిపోయింది.

స్కోరు బోర్డు:

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ : 346 ఆలౌట్, **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 649/7 డిక్లేర్డ్, **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** అలెస్టర్ కుక్ (బి) లియాన్ 10, మార్క్‌స్టోన్‌మన్ ఎల్బీడబ్ల్యు (బి) స్టార్క్ 0 జేమ్స్ విన్స్ (బి) స్టార్క్ (సి) స్మిత్ (బి) కమిన్స్18, జో రూట్(కెప్టెన్) రిటైర్డ్ అవుట్ 58, డేవిడ్ మలాన్ ఎల్బీడబ్ల్యు (బి)లియాన్ 5, జొన్ని బెయిర్‌స్టో(వి.కీ) ఎల్బీడబ్ల్యు (బి) కమిన్స్ 38, మొయిన్ అలీ ఎల్బీడబ్ల్యు (బి)లియాన్ 13, టామ్ కర్రెన్ 23 నాటౌట్, స్టువార్డ్ బ్రాడ్ (సి)పెయినీ, (బి)కమిన్స్4, మాసన్ క్రానె (సి)పెయినీ, (బి)కమిన్స్2, అండర్సన్ (సి)పెయినీ (బి)హేజిల్‌వుడ్ 2,

ఎక్స్‌ట్రాలు:7 మొత్తం 180(10 వికెట్లకు,88.1 ఓవర్లు)

వికెట్ల పతనం: 5-1, 15-2, 43-3, 68-4, 121-5, 144-6, 148-7,156-8,180-9,

ఆస్ట్రేలియా బౌలింగ్: మిచెల్ స్టార్క్ 16-4-38-1, హేజిల్‌వుడ్ 17.1-6-36-1, లియాన్ 35-12-54-3, కమిన్స్ 17-4-39-4, స్మిత్ (సి) 2-0-6-0, మిచెల్ మార్ష్ 1-1-0-0

ఒక యాషెస్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన కెప్టెన్లు

810 డాన్ బ్రాడ్‌మన్ 1936/37 (9 ఇన్నింగ్సులు) (ఆస్ట్రేలియా)
732 డి గోవర్ 1936/37 (9 ఇన్నింగ్సులు) (ఇంగ్లండ్)
687 ఎస్‌స్మిత్ 2017/18 (7 ఇన్నింగ్సులు) (ఆస్ట్రేలియా)
680 డి బ్రాడ్‌మన్ 1946/47 (8 ఇన్నింగ్సులు)(ఆస్ట్రేలియా)

500కు పైగా పరుగులు సాధించిన ఆటగాళ్లు

డి బ్రాడ్‌మన్ రెండుసార్లు 1934/1936-37, 1946/47, 1948(ఆస్ట్రేలియా)
అర్థర్ మోరిస్ 1946/47, 1948(ఆస్ట్రేలియా)
కె బారింగ్టన్ 1962-63, 1964 (ఇంగ్లండ్)
జాన్ ఎడ్రిక్ 1968, 1970-71 (ఇంగ్లండ్)
డీన్ జోన్స్ 1986-87, 1989(ఆస్ట్రేలియా)
డేవిడ్ బూన్ 1990-91 , 1993(ఆస్ట్రేలియా)
స్టీవ్ స్మిత్ 2015, 2017-18 (ఆస్ట్రేలియా)

ముంబై చెస్ టోర్నీ విజేతలుగామగసూద్లూ, మాస్టర్ గుకేష్

ముంబై: ఇరానియన్ గ్రాండ్ మాస్టర్ ఫర్హామ్ మగసూద్లూ, భారత్‌కు చెందిన మాస్టర్ గుకేష్‌లు ముంబై చెస్ టైటిల్‌ను గెలుచుకున్నారు. ఐఐఎఫ్ఎల్ వెల్త్ 3వ ముంబై అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ ఓపెన్‌ను ఫర్హామ్ మగసూద్లూ గెలుచుకోగా, జూనియర్ గ్రూప్స్‌లో మాస్టర్ గుకేష్ విజేతగా నిలిచారు. ఫైనల్ రౌండ్‌లో ఫర్హామ్ ఇటాలియన్ గ్రాండ్ మాస్టర్ డేవిడ్ అల్బర్టోతో మ్యాచ్ డ్రాగా ముగించింది. కాగా అమెరికన్ గ్రాండ్ మాస్టర్ తిముర్ గ్యారీయెవ్, భారత గ్రాండ్ మాస్టర్ అభిజిత్ గుప్తాపై విజయం సాధించారు.

ఈ ఫలితాలతో ఫర్హామ్ 8/9స్కోరును సాధించగా, రెండో స్థానంలో డేవిడ్ అల్బర్టో(ఇటలీ 7.5/9) నిలిచాడు. కాగా భారత గ్రాండ్ మాస్టర్ దీపన్ చక్రవర్తి 7/9 స్కోరుతో నాల్గవ స్థానంలో నిలిచాడు. జూనియర్స్ గ్రూప్‌లో గుకేష్ టోర్నమెంట్‌లో అగ్రభాగాన నిలవాలని చేస్తున్న పోరాటం ఫలించింది. ఫైనల్ రౌండ్‌లో రోహిత్ క్రిష్ణపై గెలుపొందాడు. ప్రణవ్‌తో జరిగిన మ్యాచ్‌ను టై చేసుకున్నాడు. ప్రణవ్ అర్యన్ వార్ష్నేయ్‌తో జరిగిన మ్యాచ్‌ను డ్రాగా ముగించడంతో గుకేష్ టై బ్రేక్ స్కోర్ 8/9తో అతన్ని విజేతగా నిలిపింది. ప్రణవ్ 8/9తో రన్నరప్‌గా నిలిచాడు. ఫర్హాం బహుమతిగా రూ.లక్షలు గెలుచుకోగా, గుకేష్ రూ.1.5లక్షలు గెలుచుకున్నాడు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

మన మొదటి లోక్‌సభ స్పీకర్ ఎవరు?..అదీ....!..అనుమానం ఎందుకు గూగుల్‌లో చూడు తెలుస్తుంది. టన్నుకు ఎన్ని కిలోలు..? ఏమో...! స్మార్ట్ ఫోన్‌లో నెట్ ఉందిగా గూగుల్‌లో చూడు తెలుస్తుంది.... విషయం ఏది తెలియకున్నా..గూగుల్‌ను ఆశ్రయించడం మనకు బాగా అలవాటైపోయింది. నేటి డిజిటల్ యుగంలో ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పగలిగే ఏకైక సాధనం గూగుల్ అనడం అతిశయోక్తి కాదు. గతంలో అడగండి చెబుతా..అంటూ ప్రముఖ రచయిత్రి మాలతీ చందూర్ రెడీగా ఉండేవారు. ప్రస్తుతం మీరేదడిగినా చెప్పడానికి నేనున్నా ....అంటోంది గూగుల్. చాలా మందికి ఏది తెలియకున్నా గూగుల్‌ను ఆశ్రయించడం సర్వసాధారణం. కాని గూగుల్ చాలా మందికి తెలియని ఎన్నో సౌకర్యాలను, ఫీచర్లను అందిస్తోంది. మెయిల్ వాడకం అవసరం లేకపోయినా...స్మార్ట్‌ఫోన్ యూజర్స్ అంతా గూగుల్ అకౌంట్ తెరవడం మంచిది. ఒకవేళ స్మార్ట్ ఫోన్ యూజర్లకు ఈ పాటికే గూగుల్ ఖాతా ఉన్నట్లయితే దాని వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకోవాలి. వాస్తవానికి గూగుల్‌లో వందల కొద్ది ఫీచర్లు ఉన్నాయి. కాకపోతే మనకు నిత్యం ఉపయోగపడే, ఆపత్కాలంలో యూజర్లను కాపాడే ఫీచర్ల వివరాలు తెలుసుకుందాం!



ఓ మై...గూగుల్!

మహేష్ స్మార్ట్ ఫోన్ నీళ్లలో పడిపోయింది. పనిచేయకుండా మొరాయించింది. కొత్తది కొనడం తప్ప వేరే మార్గం లేదు. బస్సు ప్రయాణంలో శ్రీధర్ స్మార్ట్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. తిరిగి దొరికే ఛాన్స్ లేదు. ఇక్కడ పోగొట్టుకున్నా,నీళ్లలో పడిపోయినా.. పరిష్కారం కొత్త ఫోన్ కొనుక్కోవడమే. కాని పాత ఫోన్‌లో ఉన్న ఫోన్ నెంబర్ల మాటేంటి? కాకపోతే మహేష్ తన ఫోన్‌ను గూగుల్‌తో అనుసంధానం చేయడం మూలంగా పాత ఫోన్‌లోని నెంబర్స్, జీమెయిల్‌లోని డాటా అంతా జీడ్రైవ్‌లో సేవ్ అయి ఉంది. అతను కొత్తఫోన్ కొని గూగుల్ అకౌంట్‌కి లాగిన్ కాగానే పాతఫోన్‌లోని డేటా అంతా కొత్తఫోన్‌లోకి వచ్చేసింది. శ్రీధర్ అలా చేయక పోవడంతో,పోగొట్టుకున్న ఫోన్‌తో పాట ఫోన్ కంటాక్ట్స్, జీమెయిల్‌లోని డేటా అంతా పోయింది. అంటే సంవత్సరాలుగా సేకరించిన సమాచారం హుష్ కాకి. సో...గూగుల్‌తో అనుసంధానం వల్ల ఫోన్ పోయినా,చెడిపోయినా.. మనం అంతకు ముందు సేకరించిన డేటా, ఫోన్‌నెంబర్లు అన్నీ సేఫ్‌గా ఉంటాయి. అందుకే స్మార్ట్ ఫోన్ కొన్నవెంటనే జీమెయిల్ అకౌంట్ ఓపెన్ చేసి,అనుసంధానం చేయడం చాలా ముఖ్యం. మీ జీమెయిల్ ఖాతాను ఫోన్‌కు అనుసంధానం చేసి,సింక్ చేసినట్లయితే ఫోన్‌లోను డేటా అంతా ప్రతిక్షణం జీమెయిల్‌లో సేవ్ అవుతుంది. మరో ముఖ్యమైన విషయం...,. .జీమెయిల్ ఖాతాతో జోడించి ఉన్న స్మార్ట్‌ఫోన్ పోతే.... దాని లొకేషన్ ఇట్టే తెలుసుకోవచ్చు లేదా ఫోన్‌ను లాక్ చేయవచ్చు. కాని ఫోన్‌లోని ఫోన్‌లో ఉన్న ఎస్‌డీ కార్డులోని డేటాను మాత్రం తొలిగించలేము. అంతేకాదు మనకు ఒకటికన్నా ఎక్కువ ఫోన్‌లు ఉంటే.. అన్నింటిని జీమెయిల్‌తో అనుసంధానించుకోవచ్చు. పోయిన ఫోన్‌కు సంబంధించిన లాక్ చేయబడిన స్క్రీన్‌కు సందేశాన్ని, లేదా ఇతర ఫోన్ నెంబర్‌ను పంపించవచ్చు. మీరు పోగొట్టుకున్న ఫోన్ ఎవరైనా మంచి వ్యక్తులకు దొరికితే మీరు ఫంపిన సందేశం లేదా నెంబర్‌కు లాక్ చేసిన స్క్రీన్‌పై డిస్ప్లే అవుతుంది. అది చూసి దొరికిన వ్యక్తి ఫోన్ చేసిన మీ ఫోన్ మీకు అందించే ఛాన్స్ ఉంటుంది. ఇక ముఖ్యమైన డ్యాక్యుమెట్స్,ఐడీ కార్డులు, సర్టిఫికేట్స్, ఫోటోలు తదితర విలువైన వాటిని స్కాన్ చేసి వాటిని గూగుల్ డ్రైవ్‌లో భద్రపరుచుకోవచ్చు.కొన్ని సందర్భాలలో ఫోన్‌లో ఖాళీలేకపోతే కొంత డేటానుగూగుల్ డ్రైవ్‌లో సేవ్ చేసుకోవచ్చు. గూగుల్ డ్రైవ్‌లో 15జీబీ వరకు స్పేస్ ఉచితంగా వాడుకోవచ్చు.

ఒకే మెయిల్ ద్వారా..!

మీరు హాట్‌మెయిల్, ఔట్లుక్, మరొక జీమెయిల్ ఐడీ , యాహూలాంటి ఇతర మెయిల్స్ వాడుతున్నారా? వాటన్నింటిని ఒకే జీమెయిల్‌కు అనుసంధానం చేసుకోవచ్చు. దాని ద్వారానే ఇతర మెయిల్స్ సందేశాలను నిర్వహించవచ్చు. దీనివల్ల సమయం ఆదా ఆవతుంది. ఏదైనా పాప్(క్ష) లేదా ఐమాప్ (ఒఃఆ) ఖాతా నుంచి సందేశాలను సంపూర్ణంగా దిగుమతి చేసుకోవడంతో జీమెయిల్‌లో బహుళ ఇ-మెయిల్ చిరునామాలను ఏకీకరించుకోవచ్చు.



జీమెయిల్ లో అన్ డూ సెండ్ ఆప్షన్

జీమెయిల్‌లో అన్ డూ సెండ్ ఆప్షన్ ఉంది. సెట్టింగ్‌లోకి వెళ్లి దీనిని ఆక్టివేట్ చేసుకోవడం ద్వారా ఈ ప్రయోజనం పొందవచ్చు. మనం పంపిన మెయిల్‌లో అక్షర దోషాలు ఉన్నట్లు గుర్తించినా, ఒకరికి పంపాల్సిన మెయిల్ పొరపాటున ఇంకొకరికి పంపినా, దానివల్ల జరిగే నష్టనివారణ కోసం ఈ ఆప్షన్ ఎంతోఉపయోగ పడుతుంది. మెయిల్ సెండ్ చేసిన 5 నుంచి 30 సెకన్లలోపు అన్ డూ సెండ్ బటన్ క్లిక్ చేయడం ద్వారా మెయిల్‌ను నిరోధించవచ్చు. ఎన్ని సెంకండ్లు అన్నది అన్ డూ సెండ్ బటన్ ఆప్షన్ ఆక్టివేట్ చేసేటప్పుడే సెట్ చేసుకోవాలి. అయితే 30 సెకండ్లకు మించి ఈ ఛాన్స్ ఉండదు.

కీ బోర్డ్ షార్ట్ కట్స్

వినియోగదారుల సమయం ఆదాచేసుకోవడం, సులభ శైలిలో మెయిల్ పంపించుకోవడం కోసం కొన్ని కీ బోర్డ్ షార్ట్ కట్స్‌ను జీమెయిల్ ప్రవేశ పెట్టింది. సెట్టింగ్స్‌లోకి వెళ్లి కీ బోర్డ్ షార్ట్ కట్స్ ఆన్‌ను సెలక్ట్ చేసుకోవడం ద్వారా వినియోగ దారులే కీ బోర్డ్ షార్ట్ కట్స్‌ను సృష్టించుకోవచ్చు. ఉదాహరణకు కొత్త మెయిల్ కంపోజ్ చేయడానికి సీ..క్లిక్ చేయాలి. ఆర్..క్లిక్ చేయడం ద్వారా రిప్లై ఇవ్వవచ్చు. ఏ ..క్లిక్ చేసి కాపీ చేసిన వారందరికి మెయిల్ సందేశం పంపించ వచ్చు. మరో వైపు... పండుగలకు మీ మిత్రులకు శుభాకాంక్షలు,పుట్టిన రోజు శుభాకాంక్షలు, మీకు వచ్చిన సందేశాలకు ధన్యవాదాలు జీ మెయిల్ ద్వారా పంపడానికి మరో సులభమైన మార్గం ఉంది. అందుకోసం మీరు ముందుగా మీ సందేశాన్ని లేదా ప్రతిస్పందనను తయారు చేసుకోవాలి. ఆతర్వాత సెట్టింగ్స్‌లోని కెన్‌డూ రెస్పాన్స్‌ను క్లిక్ చేయడం ద్వారా ఈ సౌకర్యం ఉపయోగించుకోవచ్చు.



స్మార్ట్ రిప్లై ఫీచర్

జీమెయిల్ సెట్టింగ్స్‌లో ఉన్న స్మార్ట్ రిప్లై ఫీచర్‌ను ఆక్టివేట్ చేసుకుంటే ..మీకు వచ్చిన ప్రతి మెయిల్ కింద దాని సారాంశాన్ని బట్టి మూడు సూక్ష్మ సందేశాల వస్తాయి. దానిని క్లిక్ చేసి వెంటనే మెయిల్‌కు రిప్లై ఇవ్వవచ్చు. ఇది మిషన్ లెర్నింగ్ ఆధారిత ఫీచర్. ఉదాహరణకు ..మీ ఊర్లోపుస్తక ప్రదర్శన ఉందని మిత్రుల ద్వారా మెయిల్ వచ్చిందనుకోండి. ఈ ఫీచర్ ఆక్టివేట్ చేసుకుంటే..ఆ మెయిల్ కింద ... వెళ్లడం కుదరదు.. ఇష్టం లేదు....అటెండ్ అవుతాను.. అనే ఆప్షన్ మెసేజ్‌లు ఉంటాయి.వాటిని క్లిక్ చేయడం ద్వారా వెంటనే మీకు వచ్చిన మెయిల్‌కు రిప్లై ఇవ్వవచ్చు.

మ్యూట్ ,బ్లాక్ ఆప్షన్లు ఉన్నాయి...!

మనం పాల్గొనక పోయినా వాట్సాప్ గ్రూపుల్లో జరిగిన సంభాషణలకు సంబంధించి నోటిఫికేషన్స్ వచ్చి డిస్టర్బ్ చేస్తుంటాయి. వాటిలాగే ఈ మెయిల్ థ్రెడ్స్ కూడా పొద్దస్తమానం వస్తూ... మీ ఏకాగ్రతను చెడగొట్టవచ్చు. అటువంటప్పుడు సందేశాన్ని తెరచి దానిపై ఉన్న మ్యూట్ బటన్ క్లిక్ చేయడం ద్వారా జీమెయిల్ గ్రూప్, థ్రెడ్స్ మెసేజ్‌లను మ్యూట్ చేసుకోవచ్చు. ఇక మీకు ఇష్టం లేని వ్యక్తుల నుంచి వచ్చే మెయిల్స్ లేదా ఒక సంస్థ నుంచి పదేపదే వచ్చే మార్కెటింగ్, ప్రమోషన్ మెయిల్స్, లేదా మిమ్ములను బాధించే వ్యక్తులను బ్లాక్ చేయవచ్చు. అలాంటి మెయిల్ వచ్చిన నప్పుడు దానిని ఓపెన్ చేసి రిప్లై బటన్ ఎగువన కుడివైపు మూలలో బ్లాక్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అలాచేస్తే పైన చెప్పుకున్న వారినుంచి మీకు ఎలాంటి మెయిల్ రాకుండా నిరోధించవచ్చు.

ఆఫ్ లైన్ జీమెయిల్ ..!

వినియోగ దారులు విమానంలో ఉన్నప్పుడో...వైఫై సౌకర్యం లైదా మొబైల్ నెట్‌వర్క్ అందని మారు మూల ప్రదేశాల్లో ఉన్నప్పుడో... కొండ ప్రాంతాల్లో పర్యటిస్తున్న ప్పుడో ఆఫ్ లైన్ జీమెయిల్ సౌకర్యం ఎంతగానో ఉపయోగ పడుతుంది. గూగుల్ క్రోమ్ బ్రౌసర్ అనువర్తనంతో ఆఫ్‌లైన్‌లో జీమెయిల్ ఉపయోగ పడుతుంది. మీరు ఆఫ్‌లైన్‌లో ఉన్నప్పుడు సందేశం పంపితే మీరు ఆన్‌లైన్‌లోకి రాగానే మీ ప్రమేయం లేకుండా సందేశం పంపబడుతుంది.

మీ జీమెయిల్ సురక్షితమా?

మీ జీమెయిల్ సురక్షితంగా ఉందా? లేదా ఎవరైనా దాని పాస్‌వర్డ్ తెలుసుకుని లేదా హాక్ చేసి మీ మెయిల్ ఒపెన్ చేస్తున్నారా?అనే విషయం తెలుసుకునే సౌకర్యం కూడా ఉంది. ఇది తెలుసుకోవాలంటే మీ ఇన్ బాక్స్‌లో.. లాస్ట్ అకౌంట్ ఆక్టివిటీ ... వివరాలు ఉంటాయి. అందులో డిటైల్స్ పై క్లిక్ చేస్తే మీ గూగుల్ ఖాతాను ఎప్పుడెప్పుడు లాగిన్ అయ్యారు,ఐ.పీ అడ్రెస్ జాబితాతో సహా జీమెయిల్ మీకు అందిస్తుంది. అంతేకాకుండా గూగుల్ క్రోమ్ అనేక ఎక్స్‌టెన్షన్లను కలిగి ఉంది. వాటిలో మెయిల్ షెడ్యూల్ మరియు ట్రక్ కూడా చేయవచ్చు. మీరు మధ్యాహ్నం రాసిన బిజినెస్ ప్రపోజల్ మెయిల్ అమెరికాలోని క్లయింట్‌కు పంపాలంటే..అప్పుడు అతనికి నిద్రాభంగం అవుతుంది. మరి మనం మధ్యాహ్నం రాసిన మెయిల్ అతనికి ఆఫీసు వేళలో చేరాలంటే ..మీరు పంపే మెయిల్‌ను సమయం ఆధారిత షెడ్యూల్ చేసుకోవచ్చు. అంతేకాదు మనం పంపిన మెయిల్ ను అవతలి వ్యక్తి ఓపెన్ చేశారా? లేదా? ఏ సమయంలో ఓపెన్ చేశారు? తదితర వివరాలు తెలుసుకోవచ్చు. ఇక అలాగే ఇందులో టూ డూ లిస్ట్ సౌకర్యం ఉంది. మనం చేయాల్సిన పనుల జాబితాను, టాస్కులను రూపొందించి గూగుల్ క్యాలెండర్ లేదా కంటాక్టులతో అనుసంధానం చేసుకోవచ్చు. జీమెయిల్ ల్యాబ్స్ ద్వారా అపాయింట్ మెంట్ షెడ్యూల్ చేసుకోవచ్చు. షెడ్యూల్ చేసుకునేందుకు ఇన్ బాక్స్ గూగుల్ క్యాలెండర్ ఉంటుంది.ఇలా గూగూల్‌లో ఎన్నో ఫీచర్లు ఉన్నాయి. వాటిని సరైన రీతిలో వినియోగించుకుంటే యూజర్లకు ఎంతో సౌకర్య వంతంగా ఉంటుంది. ఆశించిన ప్రయోజనం కలుగుతుంది.



-సునీల్ ధవళ, మాజీ వైస్ ప్రెసిడెంట్ , నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్

ఈ బైక్...'త్రి'భయచరం!

ఇక గాల్లో... నీటిలో... రోడ్లపై రైడింగ్ చేయొచ్చు

2017 ముగిసింది. 2018 ప్రారంభమైంది. మరి ఎగిరే కార్లు ఎక్కడ? కొన్ని సంవత్సరాలుగా మనం ఏదో సందర్భంలో ఎగిరే కార్ల గురించి మాట్లాడుకుంటున్నాం. అయితే వాటి సంగతి ఎలా ఉన్నా..ఇప్పుడు ఎగిరే బైక్‌లు మన కళ్లముందుకు వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. ఇంతకుముందు ఒక హాలివుడ్ సినిమా ఇలాంటి సూపర్ బైక్‌లనే తెరమీద సృష్టించి ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. స్టార్ వార్స్ అనే ఈ హాలీవుడ్ సినిమా యువతరాన్నే కాకుండా అన్ని వయసువారినీ అలరించింది. విజయం సాధించింది.

ఆ మూవీలో వినియోగించిన సూపర్ బైక్స్ గతంలో మనం ఎప్పుడూ చూసినవి కాదు. కానీ ఇలాకూడా తయారుచేయవచ్చు అనే ఊహకు ఆ సినిమా ఊతం ఇచ్చింది. ఇప్పుడు ఆ ఊహని నిజం చేయడానికి సిద్ధమైంది... అమెరికాకు చెందిన ఎరోఫెక్స్ అనే సంస్థ.

ఎరోఫెక్స్....మునుపెన్నడూ ఊహల్లోకి కూడా రాని ఒక అద్భుతాన్ని నిజం చేసి చూపిస్తానంటోంది. సాధారణంగా టూవీలర్స్..ఎంత అధునాతన టెక్నాలజీతో వచ్చినా అవి నేలమీద మాత్రమే నడుస్తాయి. మరింత వేగంగా మరింత సౌకర్యవంతంగా...ఉండేలా వాటిని మార్పులు చేస్తూ వచ్చారు. కానీ ఎరోఫెక్స్ తయారుచేస్తున్న ఎరో-ఎక్స్ అనే బైక్ మాత్రం నేలమీదే కాదు...నీటిపైనా గాలిలో కూడా నడవగలదు. కాకపోతే గాలిలో ఇది 12 అడుగుల ఎత్తు వరకు మాత్రమే ప్రయాణం చేయగలుగుతుంది. ఎగిరేందుకు వీలుగా దీనికి రెండు పెద్ద ఫ్యాన్స్ ఉంటాయి. సాధారణ బైక్‌ల మాదిరిగానే దీనిని నడపవచ్చు.


ఈ బైక్‌ని 2017లోనే అందుబాటులోకి తీసుకురావాలని కంపెనీ భావించింది. అయితే ఇది కచ్చితంగా ఎప్పుడు మనముందుకు వస్తుందనే విషయం మాత్రం ఇప్పటికి ప్రశ్నే. అయితే దీనిని మామూలు బైక్‌ల్లా రోడ్లమీద పరుగులు తీయించే అవకాశాలు మాత్రం తక్కువనే చెప్పాలి. అందుకే ప్రాథమిక దశలో ఈ బైక్‌ని వ్యవసాయ క్షేత్రాల్లో, భూమి సర్వేల కోసం వాడవచ్చని భావిస్తున్నారు. అంతేకాకుండా... సరదా రైడింగ్‌కు కూడా ఈ ఎగిరే బైక్‌ని అప్పుడప్పుడు వాడుకోవచ్చు...అదీ ట్రాఫిక్ సమస్యలు లేని చోట్ల మాత్రమే. 2018లో లేదా మరికొన్నేళ్లకో ఈ బైక్ మార్కెట్లోకి వచ్చే అవకాశాలు మాత్రం పుష్కలంగా ఉన్నాయి.

ఏదైతేనేమి ఎరో-ఎక్స్ అందుబాటులోకి వస్తే ఎగిరే కార్ల సంగతెలా ఉన్నా...రోడ్లమీద, నీటిలో, గాలిలో...అంటే మూడు విధాలుగా నడిచే త్రిభయచరవాహనం మనకు అందుబాటులోకి వచ్చినట్టే. నీటిలో నేలమీద కూడా బతకగల కప్ప ఉభయచర జీవి కనుక దీన్ని త్రిభయచరం అనడం సముచితమే కదా! కాకపోతే ఎరో-ఎక్స్ గాల్లో ఎగిరినట్టుగానే దీని ధర కూడా ఆకాశంలోనే ఉంది... సింపుల్‌గా 85,000 డాలర్లు లేదా 55 లక్షల రూపాయలు మాత్రమే.



* రంగవల్లిక *

17చుక్కలు 1వచ్చే వరకు (సరిచుక్క)



ఎమ్.ధనలక్ష్మి, కల్లూరి పల్లి, హౌసింగ్ బోర్డు కాలని

21 చుక్కలు
3 వరుసలు
3 వచ్చే వరకు



ఎం కుసుమ లత
మోతీ నగర్
హైదరాబాద్



21చుక్కలు
1 వచ్చే వరకు

మీరూ ముగ్గులు పంపొచ్చు

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ, 8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

స్వధర్మమే పరమోత్కృష్టం

స్వధర్మ పరిపాలన ఎంతో ముఖ్యం. స్వధర్మే నిధనం శ్రేయః అని స్వధర్మ పరిపాలన శ్రేయస్కరమని శ్రీకృష్ణుడు గీతలో చెప్పాడు. స్వధర్మాచరణను మించిన ధర్మం లేదు. స్వధర్మాన్ని గాలికొదిలేసి ఏవేవో చేస్తాననటం సరికాదు. ఇక స్వధర్మం అనేది విస్తృతమైనది. మన స్వధర్మం ఏదో తెలుసుకుని దానిని ఆచరించడానికి కృషి చేయాలి.



స్వధర్మం గురించి భారతంలో ఉన్న ఈ కథ వివరిస్తుంది.

పూర్వం ఒకానొకాశ్రమంలో దేవశర్మ అనే మహర్షి అతని భార్య రుచి ఉండేవారు. రుచి అతిలోక సౌందర్యవతి. ఆమెను దేవశర్మ ఎంతో అనురాగంతో చూసుకునేవాడు. ఆమె కూడా పతిని ప్రత్యక్ష దైవంగా భావించి సేవ చేస్తుండేది. వారి దగ్గర ఉన్న శిష్యుల్లో విపులుడనేవాడు ఉండేవాడు. అతనిపై దేవశర్మకు ప్రత్యేకమైన అభిమానం ఉండేది. ఆ విపులుడికి దేవ శర్మ ఎన్నో శాస్త్రాలు, ధర్మాలూ బోధిస్తూ ఉండేవాడు.

మహాభారతంలో చిన్న కథలు

ఒకసారి దేవశర్మ పక్క ఊరికి యజ్ఞం చేయడానికి వెళ్లవలసి వచ్చింది. దానితో ఆయన ఆలోచనలో పడ్డాడు. 'నా భార్య అతిలోక సౌందర్యవతి. ఇంద్రునికి నా భార్య అందం గురించి తెలుసు. అహల్య విషయంలో మాదిరి అతను నేను లేని సమయం చూసుకుని నా భార్యను మాయోపాయంతో అపహరించే ప్రయత్నం చేయవచ్చు. అతనే కాక అసురీ ప్రవృత్తిగల వారు గతంలో అందుకు ప్రయత్నం చేస్తే నా ధర్మాచరణతో, బుద్ధి కుశలతతో అడ్డుకున్నాను. అంతేకాదు వివాహమైన నాటి నుంచి ఆమె ఆశ్రమంలో ఏనాడూ నేను లేకుండా లేదు, ఇపుడు ఆమెకు రక్షణ ఎలాగ అని ఆలోచించాడు. ఇలా ఆలోచించే దేవశర్మ వద్దకు విపులుడు వచ్చాడు. దేవశర్మ తన సంకటాన్ని ప్రియ శిష్యుడైన విపులునికి చెప్పాడు. తాను వచ్చే దాకా అతనికి గురుపత్ని అయిన తన భార్యను రక్షించమని కోరాడు. 'మీ ఆజ్ఞతో ఆమెను రక్షిస్తాన'ని విపులుడు మాట ఇచ్చాడు. దేవశర్మ ఊరికి బయలుదేరాడు. విపులుడు ఆమె రక్షణ బాధ్యత నెరవేరుస్తూ, క్షణ క్షణం ఆమెను కనిపెట్టుకుని ఉండడం కష్టమని అంతేకాక అసురీ శక్తులు ఎటువంటి మాయలు పన్నుతాయో తెలియదు కనుక తానే ఆమెలో ప్రవేశిస్తే ఇక నిరంతర రక్షణ కల్పించవచ్చని భావించాడు. వెంటనే రుచి చూస్తూండగానే రుచికి తెలియకుండా గాలి రూపంలో విపులుడు ఆమె శరీరంలోకి తన యోగ శక్తితో చేరాడు. విపులుని ఆత్మ రుచిలోకి ప్రవేశించినందున అతని శరీరం అచేతనంగా పడిపోయింది. రుచి అది చూసి అతను నిద్రపోతున్నాడనుకుంది. ఆ విధంగా విపులుడు గురుపత్నిని కాపాడాడు. తర్వాత గురువు వచ్చాడు. విపులుని వల్ల తన భార్య సురక్షితంగా ఉందని తెలుసుకుని ఆనందించాడు.

ఇలా ఉండగా ఒకనాడు రుచి వనంలో తిరుగుతుండగా ఆకాశంలో వెడుతున్న ఒకదేవ కాంత చేతి నుంచి జారిపడిన పూలమాల అమెకు దొరికింది. ఆ పూల వాసనకు అబ్బురపడిన ఆమె ఆ పూలు వాడనివి అయినందున వాటిని జాగ్రత్తగా దాచుకుంది.

మరో రోజు చిత్ర రథుడనే మహారాజు దేవశర్మ ఆశ్రమానికి వచ్చి తమ రాజ్యంలో జరిగే ఒక ఉత్సవాన్ని చూడడానికి రమ్మని రుషి దంపతుల్ని ఆహ్వానించారు. చిత్రరథుని భార్య, రుచి అక్కాచెల్లెళ్లు. రుచి ఆ ఉత్సవానికి తన వద్ద ఉన్న దేవలోక పూలను అలంకరించుకుని వెళ్లింది. వాటి వాసనకు ఆమె సోదరి పరవశించి తనకు కూడా అటువంటి పూలు సంపాదించి పెట్టమంది. రుచి ఆ విషయం దేవశర్మకు తెలిపింది.


ఆయన ఆ పూలు ఎక్కడున్నా వాటిని తెమ్మని విపులుణ్ని ఆదేశించాడు. విపులుడు అవి ఎక్కడుంటాయో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుండగా మార్గమధ్యంలో అతనికి అటువంటి పూల మాల దొరికింది. అది తీసుకుని ఆయన గురువు గారి వద్దకు బయలుదేరాడు. తిరుగు ప్రయాణంలో అతను నాట్యం చేస్తున్న ఒక యువతీయువకుల జంటను చూశాడు. ఇంతలో ఆ జంట నాట్య విషయంలో తమలో తాము వాదులాడుకున్నారు. వారిలో ఒకరు 'నేను తప్పు కనుక చేసి ఉంటే విపులునికి పట్టిన గతే నాకూ పడుతుంది' అని అన్నారు. ఇది విన్న విపులుడు తాను ఏమి తప్పు చేశాడా అని ఆలోచిస్తూ, మరి కొంత దూరం వెళ్ళాడు. అక్కడ ఆరుగురు వ్యక్తులు జూదమాడుతూ కనిపించారు. వారిలో వారికి తగవులొచ్చి ఒకడు 'నేను తప్పు చేస్తే నాకు ఆ విపులుని గతే పడుతుంది అని అన్నాడు. ఈ మాటలు విన్న విపులుడు వ్యాకుల పడి గురువు దగ్గరికి వెళ్ళి పూలమాల ఇచ్చి తాను ఏమి తప్పు చేశానని అడిగాడు. అప్పుడు గురువు చిరునవ్వుతో, 'విపులా! నీవేమీ తప్పు చేయలేదు. నీకు ఎటువంటి దుర్గతి పట్టదు. నీకు కనిపించిన యువతీ యువకుల జంట సూర్యచంద్రులకు, ఆరుగురు జూదరులు ఆరు ఋతువులకు సంకేతం. ఎవరైనా తాము చేసిన పని ఎవరూ చూడలేదనుకున్నా సూర్య చంద్రులు, ప్రకృతి చూస్తూనే ఉంటాయి' అని చెప్పడానికి వీరు నీకు కనిపించారు. ఇక నీవు నా భార్య, నా అనుమతి లేకుండా ఆమెలో ప్రవేశించడం తప్పు అనుకుంటున్నావు. నీవు చేసిన పనిని తప్పు అనుకోనక్కర్లేదు. ఎందుకంటే నేను నీకు విధించినది నీకు స్వధర్మం. దానితో ఆమెను కాపాడడం నీ స్వధర్మం అయింది. స్వధర్మాన్ని, సాంఘిక ధర్మ, సమాజ హిత ధర్మాన్ని పాటించావు. కనుక నీవు నా భార్యను రక్షించడానికి ఆమె శరీరంలోకి నా అనుమతి లేక వెళ్ళావు. అయినా ఆమెను రక్షించడమే నీ ఉద్దేశం కనుక నీకు పాపమేదీ రాదు. నీకు ఎలాంటి చింత అక్కర్లేదు' అని చెప్పాడు. దానితో విపులునికి చాలా ఆనందం కలిగింది. ఆ విధంగా స్వధర్మమైనా, సాంఘిక ధర్మమైనా, ఎవరికీ అన్యాయం చేయకుండా, ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి చేసే కొన్ని పనులు తప్పు కాదు అని మనకు ఈ కథ వల్ల తెలుస్తుంది.

\- అశ్విని

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

గురుస్వరూపం



శ్రీ రమణాశ్రమం

26-2-47

ఉన్నదంతా బయటికి రావద్దూ? ఈ లోకమంతా వెదకి గురుస్వరూపం నిర్ణయిస్తారట వీరు. గురువుగా వరించే యోగ్యత ఇంతవరకూ ఎవరి వద్దనూ కనుపించలేదట. దత్తాత్రేయులు, లోక గురువు గదా? వారు లోకమంతా నాకు గురువేనన్నారట. చెడ్డ చూస్తే చేయరాదని తోస్తున్నది. అందువల్ల అదీ గురువే. మంచి చూస్తే చేయాలనిపిస్తున్నది గనుక ఇదీ గురువే. మంచి చెడ్డలు రెండూ నాకు గురువులేనన్నారు. వేటకాడు దోవ అడిగిన తన మాట వినిపించుకొనక పక్షిని గురిపెట్టి కొట్టటం చూచి 'నాయనా, నీవు నాకు గురువువు'అని నమస్కరించారట. పక్షిని చంపటం చెడ్డదైనప్పటికీ లక్ష్యముంచి బాణం వేయటం చూచి, నా మనస్సు ఈవిధంగా ఈశ్వరుని యందు లక్ష్యముంచి అనుసంధించాలని బోధిస్తున్నావు గనుక, నీవొక గురువువు' అన్నారట. ఇదేవిధంగా ఏది చూస్తే, అదే గురువని చెప్పి కడకీ శరీరమే గురువన్నారు. ఏమంటే నిద్రలో, ఈ శరీరం లేదు గదా; ఈ లేని దానియందు దేహాత్మ భావన కూడదని బోధిస్తున్నది. అందువల్ల ఇదీ గురువే'నన్నారు. వారు లోకమంతా గురువుగా భావిస్తే వారిని లోకమంతా గురువని కొనియాడింది. ఈశ్వర విషయమూ అంతే. లోకమంతా ఈశ్వర మయంగా ఎవరు చూస్తారో, వారిని ఈశ్వరుడని లోకం పూజిస్తుంది. మనమెంతో లోకమంతే. 'యద్భావం తద్భవతి' అన్నారు. పెద్ద తోట ఉంటుంది. కోకిల వస్తే, మంచి పండ్ల నిమిత్తం మామిడి చెట్లు వెదకుతుంది. కాకి వస్తుందనుకో, అది వేపచెట్లు వెదకుతుంది. తుమ్మెదలు, తేనెకొఱకు మంచి పూలను వెదికితే, ఈగలు మలాన్నన్వేషిస్తవి. సాలగ్రామం కావలసినవాడు రాళ్లన్నీ త్రోసివేసి అది ఒక్కటీ గ్రహించి పూజిస్తాడు. ఆ సాలగ్రామం రాళ్లల్లోనే ఉంటుంది. చెడ్డ ఉంటేనే మంచి తెలుస్తుంది. చీకటి ఉంటేనే, వెలుగు శోభిస్తుంది. మాయ ఉంటేనే ఈశ్వరుడున్నాడు. సార గ్రాహికి నూరింటిలో ఒక్కమంచి దొరికితే చాలు. ఆ ఒక్కటీ గ్రహించి, తొంబది తొమ్మిదీ త్రోసివేసి ఇదొక్కటీ చాలురా మనకు, దీనితో లోకమంతా జయించవచ్చుననుకుంటాడు. వారి దృష్టి ఆ ఒక్క దానిమీదనే ఉంటుం'' దని మేఘ గంభీర ధ్వనితో పలికి విరమించారు.

హాలంతా నిశ్శబ్దమై గంభీరంగా ఉన్నది. గడియారం టంగుటంగున గంటలు నాలుగు కొట్టింది. అజ్ఞానమనే శూరపద్మని హతమార్చి శాంతించిన అరుణాచల రమణుని అడుగుదమ్ములకు నమస్కరించి, విను తిసేయవచ్చిన ఆది మయూరమా; అన్నట్లు హాలుకు ఉత్తర దిక్కున ఉన్న పాకలోనికి నెమలి వచ్చి, గంభీరమైన ఒక్క కేకారవంతో, తనరాక తెలియ పరచుకొన్నది. భగవాన్ ''ఆవ్ ఆవ్'' అంటూ అటువైపు తిప్పారు దృష్టి.

\- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

అన్నం మహిమ ఇంతింత కాదు



భారతీయ సనాతనధర్మంలో అన్నానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చారు. అన్నం అంటే ఆహారం అని అర్థం చేసుకోవాలి. సనాతన ధర్మం ముఖ్యంగా చెప్పే దానిలో కర్మ ఒకటి. ఈ కర్మకాండ చేసేందుకు, ధర్మాచరణకు శరీరం ముఖ్యం. అటువంటి కర్మకాండకు అవసరమైన శరీరాన్ని నిలిపి ఉంచేది అన్నమే కనుక అన్నానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. **శరీరమాద్యం ఖలు ధర్మ సాధనం** అన్నది తెలిసిందే. ఇంకా అన్నాన్ని నిందించకూడదని, నిర్లక్ష్యం చేయకూడదని, పారవేయకూడదని ఎన్నో చోట్ల చెప్పబడింది. సూక్తాలలో అన్న సూక్తం ఒకటి. జీవించి ఉన్న వారికే కాదు, మరణించిన పితరులకూ అన్నాన్ని శ్రాద్ధాల్లో పెడుతూంటారు. ఇక అన్నదాన మహిమ చెప్పనలవికాదు. ఏ దానం ఇవ్వని ఉత్కృష్ట ఫలితం అన్నదానం ఇస్తుంది. ఎవరినైనా పూర్తిగా తృప్తిపరచగలిగేది అన్నమే. ఒకస్థాయి తర్వాత ఇక వద్దు అనిపించగలిగేది అన్నదానమే. కడుపు నిండిన తర్వాత ఇంకా అన్నం పెడితే దానిని తినేవాడు వద్దంటాడు . అదే డబ్బయితే ఎంత ఇచ్చినా ఇంకా కొంత ఇస్తే బావుండేదే అనే భావంతో ఉంటాడు. మిగతా దానాలకు పాత్రత చూడాలి. ఒక్క అన్నానికే అటువంటిదేమీ లేదు. ఆకలితో ఉన్నవాడు ఎవడైనా వాడికి అన్నం పెట్టవచ్చని ధర్మ శాస్త్రం చెబుతోంది. ఇక అన్న దానాన్ని సంపూర్ణ దానంగా పేర్కొన్నారు. ఇది దాతకూ, దాన ప్రతిగ్రహీతకు ఆనందం కలిగిస్తుంది. కనుక దీనిని సంపూర్ణ దానం అన్నారు.

అన్నాన్ని సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపంగా పేర్కొన్నారు. అందుకే అన్నాన్ని వృథా చేయరాదంటారు. అంతేకాక అన్నాన్ని తొలిబ్రహ్మంగా వర్ణించారు . అన్నాన్ని బ్రహ్మ గాను, అందులోని రసాన్ని విష్ణువుగాను దానిని తినేవాడిని మహేశ్వరుడని చెప్పే వాక్యం కూడా ఉంది. అన్నం పేరు మీద ఆహారానికి అధిదేవతగా అన్నపూర్ణాదేవి ఆరాధన కూడా సనాతన ధర్మంలో ఉంది. అన్నానికి సంబంధించి మరో నమ్మకం కూడా ఉంది. దేవుడు ప్రతి జీవి ఈ భూమి మీద పుట్టక మునుపే అతనికి ఇంత ఆహారం, నీరు అని నిర్దేశిస్తాడని అది అయిపోగానే మరణిస్తాడని, అందు వల్ల కూడా దానిని వృథా చేయరాదని అంటుంటారు. అందుకే మరణించాడనే దానికి నూకలు చెల్లాయనే మాట వచ్చిందని చెబుతారు.

భారత వర్షము-అధిదేవత



భారత వర్షంలో భగవానుడు నరనారాయణ రూపంలో కల్పాంతం వరకు లోకాలను అనుగ్రహించటం కోసం ఆత్మ జ్ఞానం కలవారిపై దయతో తపస్సు చేస్తూ సంచరిస్తుంటారు.

నర నారాయణులు తపోమూర్తులు, జ్ఞాన మూర్తులు, పరమ శాంత మూర్తులు. తపః ప్రభావాన్ని లోకులకు ఉపదేశించడానికి అవతరించారు. మనశ్శాంతిని, మనో నిగ్రహాన్ని, మనోజయాన్ని కోరే వారు నరనారాయణులకు సంబంధించి భాగవతంలో ఉన్న మంత్రాన్ని భక్తి శ్రద్ధలతో జపించాలి. కోపాన్ని, కోరికలను గెలవాలనుకున్నవారు, విద్యాబుద్ధులు, సత్ ప్రవర్తన, లోక కళ్యాణ కాంక్ష కలిగిన వారు ఈ మంత్రాన్ని జపించాలి.

ధర్మం-మర్మం

మంత్ర జప విధానం




ప్రాతఃకాలమునే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రములు ధరించి లలాటమున తిలకమును దిద్దుకుని పూజామందిరంలో దీపారాధన చేసి తమ నిత్య కృత్యములైన సంధ్యావందనాది కార్యక్రమములను ముగించుకుని నిశ్చలమైన పరిశుద్ధమైన మనస్సుతో తమ శక్తికి అనుగుణంగా మంత్రాన్ని జపించాలి

\- డా॥ కందాడై రామానుజాచార్య

భగవద్గీత

మానవులలో సామర్థ్యాన్ని నేనే



అధ్యాయం7

శ్లోకం 8:

రసోహమప్సు కౌంతేయ
ప్రభాస్మి శశిసూర్యయోః।
ప్రణవః సర్వవేదేషు
శబ్దః ఖే పౌరుషం నృషు ॥

తాత్పర్యం

ఓ కుంతీ పుత్రా! నీటిలో రుచిని, సూర్య చంద్రుల యందు కాంతిని, వేదమంత్రములందు ఓంకారమును, ఆకాశమునందు శబ్దమును, నరుని యందు సామర్థ్యమును నేనే అయియున్నాను.

భాష్యం

ఈ శ్లోకములో భగవంతుడు తన భౌతిక ఆధ్యాత్మిక శక్తుల ద్వారా ఎలా విస్తరించి ఉన్నాడో వివరించడం జరిగింది. సూర్యరశ్మి ద్వారా సూర్య భగవానుడి ఉనికిని గుర్తించినట్లు, భగవంతుని వివిధ శక్తుల ద్వారా భగవద్ధామంలో నున్న దేవాదిదేవుణ్ణి గుర్తించవచ్చును. ఉప్పునీరు సముద్రమంతా ఉన్నప్పటికీ దానిని తాగలేము. రుచిని బట్టి మనము నీటిని ఆస్వాదించగలము. అటువంటి స్వచ్ఛమైన నీటి రుచి భగవంతుని శక్తియై ఉంది. ఈ విధంగా మన దప్పిక తీర్చేందుకు భగవంతుడు చక్కని ఏర్పాటు చేసినందుకు మనము ఆయనను కీర్తించవచ్చు. అలాగే భగవంతుని దేహకాంతియైన బ్రహ్మజ్యోతి సూర్యచంద్రుల తేజస్సుకు మూలం. అలాగే ప్రతి వేదమంత్రము ముందూ ఉచ్చరించబడు 'ఓం' భగవంతుని శబ్ద రూపము. ఈ విధంగా కృష్ణుణ్ణి సదా స్మరించవచ్చు, ముక్తిని పొందవచ్చు. ఈ విషయము తెలియని వారు బంధములోనే ఉండి పోతారు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు, దూరప్రయాణాలు అనుకూలం. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు లాభిస్తాయి.

కర్కాటక రాశి: విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. శుభవార్తలు వింటారు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. శత్రుభీతి పోతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: స్థిరాస్తి కొనుగోళ్ళు అనుకూలం. ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యం జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: విదేశీ సంభాషణలు ఉపకరిస్తాయి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభరాశి: నూతన వాహన కొనుగోళ్ళు వంటివి ఆనందాన్ని కలిగిస్తాయి. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆకస్మిక వ్యయం లేకపోలేదు. ఆరోగ్య విషయంలో ప్రతికూలత ఉంటుంది. ప్రత్యర్థుల ద్వారా చిరు సమస్యలు ఉంటాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: రుణ ప్రయత్నాలు లాభిస్తాయి.వాహన కొనుగోళ్లు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com




మంచిమాట

సహనం ప్రతి మనిషికీ అత్యావశ్యకం

సహనశీలుడు ఏనాడూ వినాశం పొందడు

గుండెపోటులో 'గోల్డెన్ అవర్'

కులాసా



గుండె పోటు అనేది అత్యంత ప్రమాదకరమైనది. గుండెకు రక్తాన్ని అందించే రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడడం వల్ల గుండెకు రక్తసరఫరా నిలిచిపోతుంది. ఫలితంగా గుండెపోటు వస్తుంది. గుండె కండరానికి తగినంత ఆక్సిజన్, ఇతర పోషకాలు అందకపోతే దానికి నష్టం వాటిల్లుతుంది. ఒక్కోసారి అది పూర్తిగా నిర్వీర్యం కావచ్చు కూడా. చికిత్స అందడానికి ఎంత ఎక్కువ సమయం పడితే అంత ఎక్కువ నష్టం వాటిల్లుతుంది. ఎంత త్వరగా చికిత్స ప్రారంభిస్తే గుండెకు అంత తక్కువ నష్టం జరుగుతుంది. అంత త్వరగా కోలుకునే అవకాశాలుంటాయి. సాధారణంగా గుండెపోటులో ఛాతిలో నొప్పి, లేదా చాతి పట్టేసినట్లుగా ఉంటుంది. ఒక్కోసారి గుండె మీద ఏదో బరువు ఉన్నట్టుగా కూడా ఉండొచ్చు. గుండెలో మంటగా ఉంటుంది. చాతి ముందు వైపు కూడా నొప్పి ఉండొచ్చు. సాధారణంగా ఎడమ వైపు నొప్పి వస్తుంది. చాలాసార్లు ఎడమ భుజం నుంచి నొప్పి పాకినట్టుగా ఉంటుంది. ఇలా 30 నిమిషాల నుంచి కొన్ని గంటల వరకు ఉండొచ్చు. నొప్పి తీవ్రత ఒక్కొక్కరిలో ఒక్కోవిధంగా ఉండొచ్చు. కొంతమందిలో భరించలేని విధంగా ఉండొచ్చు. నొప్పితో పాటు తీవ్రంగా చెమటలు, ఊపిరి అందక పోవడం వంటి లక్షణాలు కూడా కనిపించవచ్చు. అయితే అందరిలో ఈ అన్ని లక్షణాలు కనిపించకపోవచ్చు. ముఖ్యంగా స్త్రీలలో ఇలాంటి లక్షణాలు అన్నీ కనిపించవు. గుండెపోటు లక్షణాలూ, గ్యాస్ పైకి తన్నినప్పుడు కలిగే ఛాతినొప్పి ఇంచుమించూ ఒకేలా ఉంటాయి. పైగా గ్యాస్‌తో కలిగే చాతినొప్పికి ఇంగ్లీష్ పేరు హార్ట్ బర్న్ అని. దాంతో ఏది ప్రమాదకరమైన గుండెపోటో, ఏది ప్రమాదం లేని గ్యాస్ సమస్యో తెలియక కొందరు తికమకపడుతుంటారు. కొందరు ప్రమాద కరమైన గుండెపోటును సైతం లైట్‌గా తీసుకుంటారు. అందుకే అది ప్రమాదం కాని గ్యాస్ సమస్యే అయినా, ప్రమాదకరమైన గుండెపోటుగా కాసేపు అనుకున్నా తప్పు లేదు. ఇలా ఎందుకు అనుమానించాలంటే.. గుండెపోటు ప్రమాదం భారతీయుల్లో చాలా ఎక్కువ. కారణం మన జన్యువులే. ఇతర దేశాల్లో వయో వృద్ధులకు వచ్చే గుండెపోటు ముప్పు మన దేశంలో పాతికేళ్లకే ఎదురవుతోంది. మూడు పదులు దాటకముందే గుండెకు రక్తాన్ని అందించే మూడు ప్రధాన రక్తనాళాలు పూడుకుపోతున్నాయి. ముందున్న ఈ ముప్పును గుర్తుంచుకొని గుండెపోటును గుర్తించడం ఎలాగో తెలుసుకుందాం. గుండెపోటు ఇస్తుంది వార్నింగ్... గుండెపోటు అకస్మాత్తుగా వచ్చే అవకాశాలు ఉన్నా.. కొన్ని లక్షణాలను ముందస్తు హెచ్చరికలా పంపుతుంది. దాంతో మనం ముందుగానే గుండెపోటును అనుమానించవచ్చు. కొన్నిసార్లు గుండెపోటు రావడానికి చాలా గంటల ముందు నుంచే మనకు ఈ హెచ్చరికలు అందుతుంటాయి.

ఛాతికి ఎడమవైపు

ఛాతికి ఎడమవైపున నొప్పితో పాటు బరువుగా ఉన్నట్టు అనిపించడం ఊపిరాడని పరిస్థితి మగత చెమటలు పట్టడం వాంతులు కొందరిలో దగ్గుతో పాటు నోటి నుంచి రక్తం కూడా రావచ్చు. గుండె నొప్పికీ, గుండెపోటుకీ మధ్య కూడా తేడా ఉంటుంది. ఛాతి నొప్పి ఉండే కాలవ్యవధిని బట్టి ఆ తేడాను గుర్తించవచ్చు. ఛాతినొప్పి మొదలైన మూడు నిమిషాల్లోదానికదే తగ్గిపోతుంది. అలా మూడు నిమిషాల్లో ఆగిపోకుండా, నొప్పి పది నిమిషాలకు పైగా కొనసాగుతూ ఉంటే దాన్ని గుండెపోటుగా అనుమానించాలి.

కారణం

గుండెకు రక్తప్రసరణ అకస్మాత్తుగా నిలిచిపోతే ఆకస్మికంగా గుండెపోటు వస్తుంది. గుండె రక్తనాళాల్లో ఏవైనా అడ్డంకులు తలెత్తితే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుంది. భారతీయుల్లో సాధారణంగా 25 ఏళ్ల వయసులోనే మంచి రక్తం అందించే రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడే లక్షణాలు మొదలవుతున్నాయి. రక్తనాళాల్లో కొవ్వు గడ్డలుగా పేరుకుపోతూ రక్తప్రసరణకు ఆటంకం కలిగినప్పుడు ఆకస్మికంగా గుండెపోటు వస్తుంది. ఇది ఎప్పుడైనా జరగవచ్చు.

గందరగోళం

సాధారణంగా చాలామంది గుండెపోటును గ్యాస్ సమస్యగానో, కడుపులో / ఛాతిలో మంటగానో, వెన్ను నొప్పిగానో, మెడనొప్పిగానో తేలిగ్గా తీసుకుంటారు. వాస్తవానికి మీరు అజీర్తి లేదా గ్యాస్ సంబంధిత సమస్యతో బాధపడుతూ.. కడుపులోనో లేదా గుండెలోనో మంటగా ఉంటే ఒక్క యాంటాసిడ్ మాత్రతో తగ్గిపోతాయి. మెడ, వెన్ను లేదా ఆ పరిసరాల్లోని ఇతర ప్రాంతాల్లో నొప్పి ఉంటే పెయిన్ కిల్లర్ మాత్ర తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది. ఇలా జరిగితే పర్వాలేదు. కానీ ఇలా ఒకటి రెండు టాబ్లెట్లు తీసుకున్న తర్వాత కూడా ఉపశమనం లేదని భావిస్తే మాత్రం దాన్ని కచ్చితంగా గుండెనొప్పిగా అనుమానించాలి. గుండెపోటు వచ్చినప్పుడు ఛాతి మధ్యలో నొప్పితో పాటు తీవ్రమైన అసౌకర్యంగా ఉన్నట్లుగా అనిపిస్తుంది. ఛాతి మెలిపెడుతున్నట్లుగా, బరువు పెట్టినట్లుగా, ఒత్తిడి పడ్డట్టుగా ఉంటుంది. నొప్పి ఛాతిమొత్తం వ్యాపించినట్టుగా అనిపిస్తుంది. ఈ నొప్పి చాలాసార్లు కండరాలకు సంబంధించిన నొప్పిలా, జీర్ణ సంబంధ నొప్పి కూడా ఇలాగే అనిపిస్తూ తికమకపెడుతుంటుంది. రెండింటికీ తేడా ఏమిటంటే.. గుండెనొప్పి ఒకసారి వస్తే అది కొనసాగుతూ ఉంటుంది. అందే కండరాలు లేదా జీర్ణకోశ నొప్పులైతే వస్తూ పోతూ ఉంటాయి. అందువల్ల గుండెపోటును గ్యాస్ సమస్యగా తికమకపడుతుండగా దాని లక్షణాలు జాగ్రత్తగా పరిశీలించాలి. ఒక్కోసారి నొప్పి ఛాతిలో కాకుండా చంకల నుంచి మెడ, దవడలు, పొట్ట, దంతాల నుంచి కూడా మొదలుకావచ్చు.

గోల్డెన్ అవర్

గుండెపోటు లక్షణాలు బయటపడ్డ మొదటి గంట వ్యవధిని బంగారు క్షణాలుగా అభివర్ణించవచ్చు. ఇంగ్లీషులో దీన్ని గోల్డెన్ అవర్ అంటారు. ఈ సమయంలో రోగిని ఆసుపత్రికి చేర్చగలిగితే అతడిని తప్పక రక్షించవచ్చు. అందుకే ఆ క్షణాలకు అంత విలువ. ఈ ఒక్కగంటే చావుబతుకుల మధ్య తేడాను నిర్ణయిస్తుంది. సాధారణంగా కొందరు రోగులు గుండెపోటు లక్షణాలు చాలా తేలిగ్గా తీసుకుంటారు. తమకు అప్పుడప్పుడు కనిపించే గ్యాస్ తాలూకూ లక్షణాలుగా అపోహ పడతారు. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో ఉంటారు. కానీ ఛాతినొప్పిని గుండెపోటుగా అనుమానించి ఆసుపత్రికి వెళ్లినా.. రోగి క్షేమంగా తనకు అవసరమైన గ్యాస్ సమస్యకే చికిత్స తీసుకొని బయటకు వస్తాడు. కానీ ఒకవేళ .. అది నిజంగానే గుండెపోటు అయి ఉండి, గ్యాస్ సమస్యగా అపోహ పడితే దానికి చెల్లించే మూల్యం చాలా భారీగా ఉండవచ్చు. అందుకే గ్యాస్ సమస్యనూ గుండెపోటుగానే అనుమానించి, నిర్ధారణ కోసం ఒక ఈసీజీ పరీక్ష తీయించడంలో తప్పేమి లేదు. తప్పేది ముప్పు మాత్రమే.

జాగ్రత్తలు

గుండెపోటు వచ్చినట్లు అనుమానించి వెంటనే రోగి చేత కొద్దిగా నీళ్లు తాగించాలి. ఆసుపత్రికి చేరుకునేలోగా అతడు దగ్గేలా ప్రోత్సహించాలి. 325 మి.గ్రా డిస్ప్రిన్, 300 మి. గ్రా క్లోపిడోగ్రెల్, 80 మి. గ్రా. స్టాటిన్ టాబ్లెట్లను మింగించాలి. దీనివల్ల ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. ఇక రోగి శరీరంపై బిగుతుగా ఉన్న దుస్తులను వదులు చేయాలి. అవసరమైతే కృత్రిమ శ్వాస అందించాలి. రోగి శరీరానికి ఏ మాత్రం శ్రమ కలగకుండా ఏదైనా వాహనంలో తక్షణం ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అంతేగానీ ఎట్టిపరిస్థితుల్లోనూ రోగి గుండెపై భారం పడేలా నడిపించడమో, మెట్లు ఎక్కించడమో చేయకూడదు.

రకాలు

గుండెపోటు వచ్చిన సమయంలో నొప్పి తీవ్రత రకరకాలుగా ఉంటుంది. చాలా సందర్భాల్లో నొప్పి తీవ్రంగానూ, భరించలేనంతగా ఉంటుంది. ఛాతిలో అసౌకర్యం 15 నుంచి 30 నిమిషాలపైనే ఉంటుంది. దీనికి సంబంధించిన మూడు ప్రధాన లక్షణాలు ఇలా ఉంటాయి. నొప్పి వస్తున్న ప్రాంతం, నొప్పి స్వభావం, నొప్పి తీవ్రమవుతూ తగ్గుతూ ఉండడం.

డాక్టర్ అనూజ్ కపాడియా
ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
బంజారాహిల్స్



ఆక్యుపంక్చర్‌లో అద్భుత చికిత్స

గుండె సమస్యలు చాలావరకు ఒత్తిడి కారణంగానే వస్తుంటాయి. పనిలో ఒత్తిడి, జీవితంలో ఒత్తిడి ఏ రూపంలో ఉన్నప్పటికీ అది ఆరోగ్యం మీద విపరీతమైన ప్రభావాన్ని చూపుతుంది. ఒత్తిడిని ఎదుర్కొంటున్న వారు సాధారణంగా తీసుకునే ఆహారం, విశ్రాంతి, వ్యాయామం వంటి వాటి మీద పెద్దగా శ్రద్ధ నిలుపరు. ఫలితంగా ఆరోగ్యం మరింత దెబ్బతింటుంది. ఒత్తిడికారణంగా బీపీ, షుగర్ వంటి వ్యాధులు కూడా రావచ్చు. ఇవి కూడా పరోక్షంగా గుండె సమస్యలకు కారణమవుతాయి. ఆరు నుంచి 8 గంటల రాత్రిపూట నిద్ర ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవసరమవుతుంది. వారంలో కనీసం ఐదు రోజులపాటు వ్యాయామం తప్పకుండా చేయాలి. సంవత్సరంలో కనీసం ఒక్కసారైనా ఉద్యోగ బాధ్యతల నుంచి విశ్రాంతి తీసుకోవడం వల్ల శరీరం, మనసూ తిరిగి ఉత్సాహాన్ని పుంజుకుంటాయి.



శారీరక శ్రమ

రోజులో కనీసం 30 నిమిషాలపాటు వ్యాయామం చేయాలి. ఇది గుండె జబ్బులను నివారించడంలో కీలకపాత్రపోషిస్తుంది. వ్యాయామాన్ని జీవితలో భాగం చేసుకోగలిగితే అన్ని విధాల మంచిది. లిఫ్ట్ వాడడం కంటే మెట్లు ఉపయోగించడం, చిన్న చిన్న దూరాలకు వాహనం వాడకుండా కాలినడకన వెళ్లడం వంటివి కూడా శరీరం ఉత్తేజితంగా ఉండేందుకు తోడ్పడతాయి. అంతేకాదు శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. పెరిగే బరువు గుండెమీద భారాన్ని పెంచుతుందనే విషయాన్ని మరిచిపోవద్దు.

ధూమపానం

ధూమపానం తాగే అలవాటు మానుకోవడం మీకే కాదు. మీ చుట్టు ప్రక్కల వారికి కూడా మేలు చేస్తుంది. పొగవల్ల రక్తనాళాల్లోని లోపలి పొరకు నష్టం వాటిల్లుతుంది. రక్తనాళాల్లో కొవ్వు చేరుకునేందుకు దోహదం చేస్తుంది. నికోటిన్ వల్ల గుండె వేగం పెరిగి బీపీ కూడా పెరుగుతుంది. తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. చేపలు, గింజలు, చిక్కుళ్లు ఆహారంలో భాగం చేసుకోవాలి. సంతృప్త కొవ్వులు తక్కువగా తీసుకోవాలి. ఆల్కాహాల్ తీసుకునే అలవాటు ఉన్నవారు దాన్ని పరిమితంగా చేసుకోవాలి. నీళ్లు వీలైనంత ఎక్కువగా త్రాగాలి. ఆహారంలో ఉప్పు తగ్గించి తీసుకోవడం వల్ల బీపీ అదుపులో ఉంటుంది. ఫలితంగా గుండె మీద భారం తగ్గుతుంది. బీఎంఐ రేటు 18.5 నుంచి 24.9 మధ్య ఉంటే వారు ఆరోగ్యవంతమైన శరీర బరువును కలిగి ఉన్నట్టు లెక్క.


ఆక్యుపంక్చర్

గుండెజబ్బులకు ఆక్యుపంక్చర్‌లో అనేక చికిత్సావిధానాలు ఉన్నాయి. గుండెజబ్బులు రావడానికి ప్రధాన కారణం బీపీ, షుగర్ వ్యాధులు అని చెప్పుకోవచ్చు. ఈ వ్యాధులు రావడానికి తగిన కారణాలు తెలుసుకుని మానసిక, శారీరక ఆరోగ్యాన్ని చేకూర్చే ఆక్యుపంక్చర్ చికిత్స చేయాలి. ప్రెషర్ పాయింట్స్ వద్ద సూదులతో గుచ్చి నాడులను తిరిగి ఉత్తేజితం తీసుకురావచ్చు.

హీలర్ కె. దిలీప్‌కుమార్
క్యాతన్ ఆక్యుపంక్చర్ హెల్త్ రీసెర్చ్ అండ్ సొసైటీ
హైదరాబాద్, విజయవాడ
9848828808



ఆహారం, జీవనశైలే కీలకం



గుండె సంబంధిత వ్యాధులలో కరోనరీ ఆర్టరీ డిసీజెస్ అనేది సాధారణంగా నడివయసు గల పురుషులలో, వయసు మీరిన వారిలో కలిగే వ్యాధి. ప్రస్తుతకాలంలో యుక్తవయసు గలవారిలో కలటం మనం గమనించవచ్చు. ఈ రకం గుండె వ్యాధి ప్రపంచమంతా విస్తరించి మరణించే వారి సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. ఆహార సేకరణలో లోపాలున్నాయి. అంటే అధిక మొత్తంలో కొవ్వు పదార్థాలను తినడం మంచిది కాదు. హైపర్ టెన్షన్ ఉండకూడదు. మంచి జీవనశైలి వల్ల దీనిని అరికట్టవచ్చు. సిగరెట్ వంటి అలవాట్లు ఉన్నవారిలో గుండె సంబంధిత ధమనులలో కొవ్వు పదార్థాలు పేరుకుపోయి రక్తప్రసరణకు అడ్డంకులు ఏర్పడటం వల్ల కరోనరీ ఆర్టరీ డిసీజెస్‌లు కలుగుతాయి. ఆయుర్వేద వైద్య శాస్త్రం ప్రకారం ఆహార సేకరణ లోపాలు, ఒత్తిడి, అనారోగ్యకర జీవనశైలి అనుసరణ వల్ల జీర్ణాశయంలో హానికర పదార్థాలు నిల్వ ఉంటాయని ఈ హానికర పదార్థాలు సమయానికి అనుగుణంగా శరీరంలో వివిధ విభాగాల్లో అంటే కరోనరీ ధమని వంటి ముఖ్య భాగాల్లో చేరి అవరోధంగా ఏర్పడతాయి. ఫలితంగా రక్తప్రసరణ రేటు తగ్గి, వివిధ రకాల గుండె సంబంధిత వ్యాధులు కలుగుతాయి. ఆయుర్వేద వైద్య శాస్త్రంలో గుండె సంబంధిత వ్యాధులను తగ్గించుటకుగాను, శరీరంలో ఉండే హానికర కారకాలను బయటికి పంపి జీర్ణవ్యవస్థ శుభ్రపరిచి శరీరంలో అవరోధాలు ఏర్పడకుండా చేయటమే ఆయుర్వేద వైద్య శాస్త్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.


కరోనరీ ఆర్టరీ డిసీజెస్, గుండె సంబంధిత వ్యాధులకు గురవకుండా ఉండటానికి జీవనశైలి మార్పులను అనుసరించి ఆయుర్వేద ఔషధాలను వాడాలి.

యోగా, వ్యాయామాలు, ధ్యానం అనుసరించడం వల్ల శారీరక సామర్థ్యం పెరగటమే కాకుండా మానసిక ప్రశాంతతను పొందవచ్చు. కరోనరీ ఆర్టరీ డిసీజెస్‌ను ప్రథమంగా నివారించడానికిగానూ, సులువైన వ్యాయామాలను అనుసరించాలి.

గుండె వ్యాధులను తగ్గించే ఔషధాలలో అల్లియం సటైవా, సెంటెల్లా ఆసియాటికా, కొమ్మిఫోరా ముకుల్, కాన్వోల్వ్యూలాస్ ప్లూరికాలిస్(శంకపుష్పి), ఎమ్బ్లికా ఆఫిసినాలిస్(ఉసిరి), జటామాంసి, తులసి, జాజికాయ, అర్జున, హిర్దే, గుడూచి, మెంతులు, అశ్వగంధ, అల్లం వంటి ఔషధాలను వాడాలి.

డాక్టర్ బి. సంగమేశ్వర్
శివ ఆయుర్వేద వైద్యశాల
హైదరాబాద్
9440065764





బరువు తగ్గడంలో తాత్సారం వద్దు

మధుమేహ నియంత్రణలో కొత్త పద్ధతులేవైనా వచ్చాయా?

గుండె, కిడ్నీలు సురక్షితంగా ఉండే అనేకరకాల మందులు ఇప్పుడు మధుమేహ నియంత్రణలో వస్తున్నాయి. ఈ మందులు వాడటం వల్ల బరువు కూడా తగ్గే అవకాశం ఉంది. ఎస్‌జిఎల్‌టి2 ఇన్‌హిబిటర్స్, జీఎల్‌పి 1 రిసెప్టర్ అగోనిస్ట్‌లు అనే రెండు రకాల మందులు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి.

మధుమేహ నియంత్రణలో బరువు తగ్గించే పాత్ర ఏమిటి?

బరువు తగ్గడం అనేది మధుమేహ నియంత్రణలో కీలక పాత్రపోషిస్తుంది. భారతదేశంలో 57శాతం కంటే ఎక్కువ మంది మధుమేహరోగులు పొత్తికడుపు స్థౌల్యంతో బాధపడుతున్నారు. స్థూలకాయాన్ని అరికట్టే లక్ష్యం ఉన్నవాళ్లు తక్కువగా ఉంటున్నారు. మధుమేహానికి వాడే మందుల వల్ల కూడా బరువు పెరుగుతున్నారు. ముఖ్యంగా ఇన్సులిన్ తీసుకోవడం వల్ల బరువు పెరిగే అవకాశం ఉంది. బరువుపెరగడం వల్ల ఇన్సులిన్ పనిచేయనిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల గుండెపోటు, గుండెవైఫల్యం వంటివి కలుగుతాయి. గుండెసంబంధిత వ్యాధులు ఎక్కువవుతాయి.

ఎస్‌జిఎల్ టి 2 ఇన్‌హిబిటర్స్ ఏ విధంగా పనిచేస్తాయి? దీనివల్ల ప్రయోజనాలు ఏమిటి?

ప్రతినెలా రెండు నుంచి నాలుగుకిలోల బరువు తగ్గడానికి దోహదపడుతుంది. అంతేకాదు గ్లైసమిక్ అదుపులో ఉంటుంది. అంతేకాదు గుండె జబ్బులు రాకుండా నిరోధిస్తుంది. మయోకార్డియల్ ఇన్‌ఫ్రాక్షన్ , గుండె వైఫల్యంతో ఆస్పత్రిలో చేరి చనిపోయే పరిస్థితుల నుంచి ఇది తప్పిస్తుంది. మూత్రంలో ప్రోటీన్ విడుదల కాకుండా అడ్డుకుంటుంది. మున్ముందు డయాలసిస్ రాకుండా నిరోధిస్తుంది.

జిఎల్‌పి 1 రిసెప్టర్ అగొనిస్ట్ ఏ విధంగా పనిచేస్తుంది? దీనివల్ల ప్రయోజనాలు?

కొన్ని కొంతకాలమైతే మరికొన్ని దీర్ఘకాలం పనిచేస్తాయి. డులాగ్లూటైడ్, లిరాగ్లూటైడ్, లిక్సిసేనేటైడ్ మిశ్రమంతో కూడుకుంది. ఇతర మందులతో పోలిస్తే బరువు తగ్గడానికి ఇది అద్భుతంగా పనిచేస్తుంది.

ఈ రెండు రకాల మందుల దుష్ప్రభావం ఏమైనా ఉందా?

ఎస్‌జిఎల్‌టి 2 ఇన్‌హిబిటర్స్ చాలా ఖరీదైనవి. ప్రతీనెలా రూ 1,500 ఖర్చవుతుంది. జిఎల్‌పి1 రెసెప్టర్ అగొనిస్ట్ చాలా ఖరీదైనది. రూ 6000 నుంచి 10,000 వరకు ఉంటుంది. కొన్ని రకాల మందులు వాంతులు , వికారం, మలబద్ధకం, అతిసారం వంటివి కలిగిస్తాయి. ఈ లక్షణాలు అందరికీ వర్తించవు. కొంతమంది రోగులకు మాత్రమే ఉంటుంది. ఈ రెండు రకాల మందులు గ్లైసమిక్‌ను అదుపులో ఉంచడానికి గొప్పగా పనిచేస్తాయి. అంతేకాదు బరువు తగ్గించే అవకాశం ఉంది. మధుమేహం వల్ల కలిగే గుండెపోటు, గుండెవైఫల్యం, కిడ్నీలు పనిచేయకపోవడం వంటి దుష్పరిణామాలను తగ్గిస్తుందని అధ్యయనంలో తేలింది.

డాక్టర్ దిలీప్ గుడె
సీనియర్ కన్సల్టెంట్
ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్
విరించి హాస్పిటల్స్
హైద్రాబాద్



కైరాతో మహేష్ ఆటా పాట...!



నటుడిగా వృత్తిపరమైన పని ఒత్తిడి ఎదుర్కొంటూనే వీలు దొరికినప్పుడు కుటుంబంతో సమయాన్ని గడుపుతుంటాడు మహేష్‌బాబు. కొత్త ఏడాది సందర్భంగా కుటుంబంతో సెలవులు గడిపిన మహేష్ బాబు మళ్లీ షూటింగ్‌కు వచ్చేశారు. ఒమన్ పర్యటనకు వెళ్లి వారం పాటు విరామం తీసుకుని తిరిగొచ్చారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం భరత్ అను నేను ఇవాళ్టి నుంచి రెగ్యులర్ చిత్రీకరణ జరుపుకోనుంది. నగరంలోని ఓ సెట్‌లో మహేష్‌బాబు, నాయిక కైరా అద్వానీ పై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఈ షెడ్యూల్‌లోనే పాటలను తెరకెక్కిస్తారు. భరత్ అనే నేను చిత్రీకరణ తుది దశలో ఉంది. నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేసి ఏప్రిల్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రంలో ముఖ్యమంత్రి పాత్రలో కనిపించనున్నారు మహేష్. ఇక ఈ స్టార్ నటించనున్న 25వ చిత్రం ఫిబ్రవరిలో సెట్స్ మీదకు వెళ్లబోతోంది. ప్రతిష్ఠాత్మక పాతిక చిత్రం కాబట్టి...ఈ సినిమాను ప్రత్యేకంగా తీసుకున్నారు మహేష్. దిల్‌రాజు, అశ్వనీదత్ నిర్మాణంలో దర్శకులు వంశీ పైడిపల్లి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. పూర్తిగా అమెరికాలో చిత్రీకరణ జరుపుకోనుందీ సినిమా.



ఇది భాగమతి అడ్డా అంటున్న అనుష్క

అరుంధతి, రుద్రమదేవి వంటి మహిళా ప్రధానాంశ చిత్రాలు అనుష్కకు ఎంతో పేరు తెచ్చిపెట్టాయి. టైటిల్ పాత్రలో ఆమె నటించిన మరో మహిళా ప్రధానాంశ చిత్రం భాగమతి. అశోక్ దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్న ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం మధ్యాహ్నం విడుదలచేశారు. ఎవడు పడితే వాడు రావడానికి...ఎప్పుడు పడితే అప్పుడు పోవడానికి ఇదేమైనా పశువుల దొడ్డా? భాగమతి అడ్డా...లెక్కలు తేలాలి...ఒక్కడ్నీ పోనివ్వను అంటూ అనుష్క చెప్పే డైలాగ్ ఆకట్టుకుంటోంది. భగ..భగ..భగ..భాగమతి అంటూ వచ్చే నేపథ్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగే ఈ ట్రైలర్ చిత్రంపై ఇప్పటికే నెలకొన్న అంచనాలను మరింత పెంచేలా చేస్తోంది. ఇదిలావుండగా...ఈ చిత్రంలో అనుష్క తన నటనతో ప్రేక్షకులను అబ్బురపరచనుందని, విడుదలైన కొన్ని గంటల్లోనే ట్రైలర్‌కు విశేషమైన స్పందన లభించిందని నిర్మాతలు వెల్లడించారు. దర్శకుడు అశోక్ టేకింగ్, మధి కెమెరా పనితనం, రవీందర్ కళా దర్శకత్వం, తమన్ రీరికార్డింగ్ హైలైట్స్‌గా నిలుస్తాయని వారు చెప్పారు. ఇలాంటి చిత్రాన్ని మా బేనర్‌లో మేం నిర్మిస్తున్నందుకు గర్వంగా ఫీలవుతున్నాం. కథకు తగ్గట్టుగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాం. తప్పకుండా ఈ కథ, కథనాలు తెలుగు ప్రేక్షకుల్ని తప్పకుండా ఆకట్టుకుంటాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న సినిమాను విడుదల చేయబోతున్నాం అని వారు వివరించారు. ఈ చిత్రంలోని ఇతర పాత్రలలో ఉన్ని ముకుందన్, ఆది పినిశెట్టి, జయరాం, ఆశాశరత్, మురళీశర్మ, ధన్‌రాజ్, ప్రభాస్ శ్రీను, విద్యుల్లేఖ రామన్, దేవ దర్శిని, తలైవాసల్ విజయ్, అజయ్‌ఘోష్, మధునందన్ తదితరులు తారాగణం.



నయనతార

అంకితభావంతో కష్టపడతాను...!

సంక్రాంతికి జైసింహాతో ప్రేక్షకుల ముందుకొస్తోంది తమిళ సుందరి నయనతార. బాలకృష్ణతో ఆమె నటిస్తున్న మూడో చిత్రమిది. జైసింహాలో యాక్షన్ సన్నివేశాల తీవ్రత తగ్గించేందుకు తన గ్లామర్ జోడించి కథను సమతూకం చేయబోతోంది నయనతార. తెలుగులో అడపాదడపా సినిమాలు చేస్తున్న నయన్ కోలీవుడ్‌లో అద్భుత విజయాలతో తిరుగులేని తారగా ఎదిగింది. మొత్తంగా ఆమె పదిహేనేళ్లుగా ప్రేక్షకులకు నయనానందం కలిగిస్తోంది. 2003 లో మనసినక్కరే చిత్రంతో నాయికగా తెరంగేట్రం చేసిన నయన్....చంద్రముఖి, గజినీ చిత్రాలతో స్టార్ హీరోయిన్ అయ్యింది. అనుభవంతో పాటు ఎదుగుతూ వస్తున్న నయనతార..కేవలం అందాల తారగానే కాకుండా...ఓ కథానాయకుడికున్నంత పేరు తెచ్చుకుంటోంది. నాయిక ప్రధాన చిత్రాలు చేస్తూ విజయాలు సాధిస్తోంది. ఆమె తాజా చిత్రం ఆరమ్ తమిళ బాక్సాఫీస్ దగ్గర సంచలన విజయం నమోదు చేసింది. వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూస్తున్న నయన్..నటిగా పోటీలో ముందుంటోంది. ఈ దిగ్విజయ పరంపరపై నయన్ మాట్లాడుతూ...ఒప్పుకున్న చిత్రంలో సంపూర్ణమైన అంకితభావంతో పనిచేస్తాను. ఏ రోజూ నాపై నేను ఆత్మవిశ్వాసాన్ని కోల్పోను. ఇది ఒక్క నటనలోనే కాదు...జీవితంలో ఏ పని చేసినా ఇదే వ్యక్తిత్వంతో ఉంటాను. అని చెప్పింది. ప్రస్తుతం నయనతార చేతిలో ఉన్న అరడజను చిత్రాలు ఆమె క్రేజ్‌కు నిదర్శనం.

శరవేగంగా నా... నువ్వే

నందమూరి కల్యాణ్‌రామ్, తమన్నా నాయకానాయికలుగా జయేంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రానికి నా...నువ్వే అనే టైటిల్‌ను ఖరారు చేశారు. కూల్‌బ్రీజ్ సినిమాస్ నిర్మాణంలో, ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ నెలాఖరుకు షూటింగ్ దాదాపుగా పూర్తవుతుందని నిర్మాతలు తెలిపారు. చిత్రానికి ఈ టైటిల్ చాలా చక్కగా సరిపోతుందని, ఒక నూతన కథాంశంతో దర్శకుడు దీనిని తీర్చిదిద్దుతున్నారని వారు చెప్పారు. కల్యాణ్‌రామ్ ఇందులో కొత్త లుక్‌తో కనిపిస్తారని వారు తెలిపారు. నిర్మాతలలో ఒకరైన కిరణ్ ముప్పవరపు మాట్లాడుతూ, కల్యాణ్‌రామ్, తమన్నాల కాంబినేషన్, పి.సి.శ్రీరామ్ కెమెరా పనితనం సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని అన్నారు. ముఖ్యంగా కల్యాణ్‌రామ్‌కు టోటల్ మేకోవర్‌ని ఇస్తుందని నమ్ముతున్నామని చెప్పారు. లవ్, యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానాంశాలుగా సాగే ఈ చిత్రాన్ని వేసవి సెలవుల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని సమర్పకుడు మహేష్ కోనేరు తెలిపారు.

ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో తనికెళ్ళ భరణి, పోసాని, వెన్నెలకిషోర్, ప్రవీణ్, బిత్తిరి సత్తి, ప్రియ, సురేఖవాణి తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: షరెత్, ఎడిటింగ్: టి.ఎస్.సురేష్, సమర్పణ: మహేష్ కోనేరు, నిర్మాతలు: కిరణ్ ముప్పవరపు, విజయ్ వట్టికూటి, కథ, స్క్రీన్‌ప్లే: జయేంద్ర, దర్శకత్వం: జయేంద్ర.



తమన్నా, కల్యాణ్ రామ్

ఇది నా లవ్‌స్టోరీ.. మూడు గెటప్స్‌లో కనిపిస్తా

- తరుణ్



ఇది నా లవ్‌స్టోరీ రెగ్యులర్ ప్రేమకథాచిత్రం కాదని హీరో తరుణ్ అన్నారు. రామ్ ఎంటర్‌టైనర్స్ పతాకంపై తరుణ్, ఓవియా హీరోహీరోయిన్లుగా రమేష్‌గోపి దర్శకత్వంలో ఎస్.వి.ప్రకాష్ నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదలచేశారు. తన జన్మదినోత్సవం సందర్భంగా తరుణ్ చేతులమీదుగా ఈ ట్రైలర్ విడుదలైంది. అనంతరం తరుణ్ మాట్లాడుతూ, ఇటీవల నాగార్జునగారు ఆవిష్కరించిన టీజర్‌కు చాలా మంచి స్పందన లభించింది. ఇప్పుడు ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తుంది. ఈ చిత్రంలో నేను మూడు గెటప్స్‌లో కనిపిస్తాను. అయితే ఇందులో త్రిపాత్రాభినయం చేశానా? మూడు కోణాలున్న పాత్ర చేశానా? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. డైలాగ్స్, స్క్రీన్‌ప్లే, సినిమాటోగ్రఫీ, సంగీతం వంటివన్నీ చక్కగా కుదిరాయి. హీరోయిన్ ఓవియా చక్కటి అభినయాన్ని కనబరిచింది. ఈ చిత్రంలో ఎక్కువ పాత్రలు కూడా కనిపించవు. గోగినేని బాలకృష్ణగారు ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. అలాగే ట్రెండీ మూవీస్ సంస్థ చిత్రాన్ని యు.ఎస్.లో విడుదల చేస్తుంది అని అన్నారు. దర్శకుడు గోపి మాట్లాడుతూ, అంజలి, నువ్వేకావాలి కంటే ఈ సినిమా తరుణ్‌కి పెద్ద హిట్‌గా నిలుస్తుంది. సినిమాను చూసే ప్రేక్షకుల్లో అధికశాతం ఇది నా లవ్‌స్టోరి అని తప్పకుండా ఫీలవుతారు అని అన్నారు. నిర్మాత ఎస్.వి.ప్రకాష్ మాట్లాడుతూ, సినిమా చాలాబాగా వచ్చింది. ఫిబ్రవరి 14న సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని అన్నారు. సంగీత దర్శకుడు శ్రీనాథ్ విజయ్ మాట్లాడుతూ, తెలుగులో తనకిది తొలి చిత్రమని, ఓ మంచి సినిమాకు పనిచేసే అవకాశం కలిగిందని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మధు తదితరులు పాల్గొన్నారు. ఇదే వేదికపై తరుణ్ కేక్ కట్ చేసి తన జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు.

నా అభిమానులు మారలేదు...!



షారుక్ ఖాన్

ఎందరు స్టార్‌లు వచ్చినా బాలీవుడ్‌లో షారుక్ స్థానం పదిలమే. బాలీవుడ్‌ను రెండున్నర దశాబ్దాలుగా ఏలుతున్న ఈ బాద్‌షా ఆకర్షణ ఏమాత్రం తగ్గలేదు. ఆయన నటిస్తున్న సినిమాలు వాటిని ఆదరిస్తున్న ప్రేక్షకులు, అభిమానులు అదే ప్రేమను చూపిస్తున్నారు. షారుక్ ఖాన్ బాలీవుడ్ వచ్చి పాతికేళ్లవుతోంది. ఆయనకిప్పుడు 50 ఏళ్ల వయసు. ఇన్నేళ్లు తరగని స్టార్‌డమ్‌తో కెరీర్ కొనసాగిస్తున్న కథానాయకులను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. షారుక్ ఇరవై ఐదేళ్ల నట ప్రస్థానం సందర్భంగా తన మనసులో మాట చెప్పేశారు. రెప్పపాటులో పాతికేళ్లు గడిచాయన్నారు. తానెప్పుడూ వయసు గురించి ఆలోచించనని, అది ఒక భావం మాత్రమేనని అన్నారు. ఇటీవల ఓ పురస్కార కార్యక్రమంలో షారుక్ ఖాన్ మాట్లాడుతూ....ఓ రెండేళ్లు నటుడిగా కొనసాగితే చాలు అనుకుని ఢిల్లీ నుంచి ముంబై వచ్చాను. కానీ సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అతి త్వరగా పేరొచ్చింది. రెండేళ్లు అనుకున్నది...చూస్తుండగానే పాతికేళ్లు గడిచిపోయాయి. 25ఏళ్లుగా నటిస్తున్నాను. నాకిప్పుడు 50 ఏళ్లు. అయినా నా విషయంలో ఏదీ మారలేదు. నా తరహా సినిమాలు, నాకున్న అభిమానులు అలాగే ఉన్నారు. నాపై వాళ్ల ప్రేమ తగ్గలేదు. వయసు గురించి నేను ఆలోచించను. ఇక ముందు కూడా ప్రేక్షకులకు నా చిత్రాలతో వినోదాన్ని అందిస్తూనే ఉంటాను. అన్నారు.

గుండు హనుమంతరావుకు ఆర్థిక సాయం

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న హాస్య నటుడు గుండు హనుమంతరావుకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసింది. గత కొంతకాలంగా మూత్రపిండాల వ్యాధితో ఈ హాస్య నటుడు ఇబ్బందులు పడుతున్నారు. పాత్రలు తగ్గిపోవడంతో ఆర్థికంగా దెబ్బతిన్నారు. గుండు హనుమంతరావు పరిస్థితిని పరిశ్రమవాసుల ద్వారా తెలుసుకున్న ఐటీ మంత్రి కేటీఆర్..వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం ఇప్పించారు.

